సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
19వ వసంతంలోకి ...
visit us @ https://www.suryaepaper.com
సోమవారం | 16 ఫిబ్రవరి 2026 | హైదరాబాద్
సంపుటి 19 | సంచిక 118
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, మాఘ మాసం బహుళ పక్షం, చతుర్దశి సా.5.26, శ్రవణం రా.8.58, వర్జ్యం రా.1.06 నుంచి 2.45 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.36 నుంచి 1.22 వరకు తిరిగి మ.2.54 నుంచి 3.39 వరకు

### ట్రేడ్ డీల్స్‌లో భారత్
# సాధికారిక చర్చలు

● మన దేశం ఎదిగింది అనేందుకు అదే నిదర్శనం ● వాణిజ్య ఒప్పందాలతో దేశంలో తయారీ రంగానికి అండ ● ఎంఎస్‌ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు దోహదం ● విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ఈజీగా రావచ్చన్న స్పష్టమైన అంచనా ● భారత మార్కెట్‌పై ప్రపంచ వ్యాప్తంగా విశ్వాసం పెరుగుతోంది ● ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు అనే భావన తొలగించిన బడ్జెట్ మనది ● పిటిఐ ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్రమోడీ


6 లో

వాణిజ్య ఒప్పందాలపై విదేశాలతో సాధికారికంగా చర్చలు జరిపే స్థాయికి భారత్ ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో తయారీరంగం, సేవారంగం, ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు బలోపేతం అయినందు వల్లే భారత్‌కు ఈ సాధికారత లభించిందని ఆయన తెలిపారు. భారత్ ఇప్పటికే 38 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల(ఎఫ్‌టీఏ)ను కుదుర్చుకుందని ప్రధాని గుర్తు చేశారు. వస్త్ర, లెదర్, రసాయన, హస్తకళలు, రత్నాలు, ఇతర రంగాల్లోని భారతదేశ ఎంఎస్‌ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయన్నారు. ఆదివారం ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఈ కామెంట్స్ చేశారు. గత కొన్నేళ్ల వ్యవధిలో మునుపటి రికార్డులను అధిగమించే రేంజులో విదేశాలకు భారత్ వస్తు, ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయన్నారు. భారత్‌లో ప్రస్తుతం రాజకీయ సుస్థిరత ఉందని మోదీ తెలిపారు. దేశ రాజకీయ భవితవ్యంపైనా విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ఈజీగా స్పష్టమైన అంచనాకు రావొచ్చన్నారు. అందుకే వారికి భారత మార్కెట్‌పై విశ్వాసం పెరుగుతోందని ప్రధాని చెప్పారు.

### నేడు గ్లోబల్ లీడర్
# బిల్ గేట్స్ రాక

● ఏపీకి స్వర్ణావకాశం ● ప్రపంచ టెక్నాలజీ విప్లవానికి పునాది వేసిన బిల్ గేట్స్ ● ఆయన రాకతో రాష్ట్ర అభివృద్ధి దిశగా జరగనున్న కీలక చర్చలు ● ఐటీ, విద్య, ఆరోగ్య రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కీలక నిర్ణయాలు ● సాంకేతికత, ఇన్నోవేషన్, అభివృద్ధి రంగాల్లో రాష్ట్రానికి కొత్త భాగస్వామ్యాలకు మార్గం

ప్రపంచ ఐటీ విప్లవానికి ప్రతీకగా నిలిచిన బిల్ గేట్స్ నేడు అమరావతికి రానున్నారు. ఆయన రాకతో ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. టెక్నాలజీ, ఆరోగ్యం, విద్య రంగాల్లో భాగస్వామ్యాలపై కీలక చర్చలు జరిగే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు జరుగుతున్న ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.


2 లో

## దక్షిణ కాశీలో భక్తజన సంద్రం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణ కాశిగా పేరొందిన శ్రీకాళహస్తిలో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున రెండు గంటల నుంచే సర్వదర్శనం ప్రారంభం కావడంతో వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.


6 లో

## ఎప్‌స్టీన్ వివాదంలోకి కపిల్ సిబల్

● కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ● జెఫ్రీ ఎప్స్టీన్ నిధులతో సిబల్ అవార్డు తీసుకున్నారని బీజేపీ ఆరోపణలు ● రాహుల్ స్పందించాలంటూ డిమాండ్ - ఆరోపణలను తిరస్కరించిన కాంగ్రెస్


6 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### రాష్ట్ర సాధనలో
# లాంబాడాలది కీలక పాత్ర

● తెలంగాణ పునర్ నిర్మాణంలో వారు కృషి వెలకట్టలేనిది ● ప్రజలకు సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నా ● పాలకుడిగా నేను ఎప్పుడూ ప్రవర్తించలేదు ● సేవాలాల్ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ● ప్రతీ తండాలో ప్రభుత్వ స్కూల్ ఏర్పాటు చేయాలనీ ఆదేశం ● రాష్ట్రంలో ఏ తండా ఇక నుంచి రోడ్లు లేకుండా ఉండకూదని వెల్లడి


2 లో

తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### అబద్ధాలు చెపుతున్న
# మోడీ సర్కార్

● అమెరికాతో ట్రేడ్ డీల్‌పై రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు ● రైతులకు ద్రోహం చేస్తోందంటూ మండి పాటు ● ప్రజలను కాంగ్రెస్ తప్పుదారి పట్టిస్తోందంటూ అమిత్ షా కౌంటర్

అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీర్ఘకాలంలో భారత వ్యవసాయ రంగంపై పట్టు సాధించడానికి మరొక దేశాన్ని అనుమతిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.


6 లో

## అంతా ఇంతే!




ఇక మన పరిస్థితి ఏంటి బ్రో...

### బీసీలకు ఇచ్చిన హామీని
# అమలు చేయాలి

● హై కోర్టు తీర్పు తరువాతే ఎన్నికలకు వెళ్లాలి ● బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలి ● ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలి ● 14 బీసీ సంఘాల సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీసీలకు 42% రిజర్వేషన్లతోటే ఎన్నికలకు వెళ్లాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాగానే ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరపాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. నిన్న ముఖ్యమంత్రి "మంత్రుల సమావేశం చర్చలు జరిపినట్లు తెలిసింది. దీనిని 14 సంఘాల త్రివంగా వ్యతిరేకిస్తున్నాం. ఈ రోజున 14 బి.సి. సమావేశానికి బి.సి. భవన్ లో డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ ( జాతీయ బి.సి. సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్) అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఎట్టి పరిస్థితులలో 42 శాతం రిజర్వేషన్ లు పెంచిన తర్వాత చట్ట బద్దంగా ఎన్నికలకు వెళ్ళాలని, లేని పక్షంలో పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.


2 లో

### పాకిస్తాన్‌పై ఇండియా
# ఘనవిజయం

● టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పాక్ ● మొదట దూకుడు, ఆ తర్వాత తడబాటు... పాకిస్థాన్‌పై భారత్ నెమ్మదిగా సాగిన ఇన్నింగ్స్ ● 20 ఓవర్లలో భారత్ స్కోరు 175-7 ● విరుచుకుపడిన ఇషాన్ కిషన్, 40 బంతుల్లో 77 పరుగులు ● మొదట దూకుడుగా ఆడినా మధ్య ఓవర్లలో తడబడిన బ్యాటింగ్ ●భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్


9 లో

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరుగుతున్న హైవోల్టేజ్ మ్యాచ్‌లో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఇన్నింగ్స్ "మొదట దూకుడు... ఆ తర్వాత తడబాటు" అన్న చందంగా సాగింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ విధ్వంసకర హాఫ్ సెంచరీతో అద్భుతమైన ఆరంభాన్ని ఇవ్వగా, మధ్య ఓవర్లలో పాక్ బౌలర్లు పుంజుకోవడంతో భారత్ భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. దీంతో పాకిస్థాన్ ముందు 176 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.114తో పాకిస్తాన్ ఆలౌట్






# రాష్ట్ర సాధనలో లాంబాడాలది కీలక పాత్ర



● తెలంగాణ పునర్ నిర్మాణంలో వారు కృషి వెలకట్టలేనిది ● ప్రజలకు సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నా, పాలకుడిగా నేను ఎప్పుడూ ప్రవర్తించలేదు ● సేవాలాల్ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ● ప్రతీ తండాలో ప్రభుత్వ స్కూల్ ఏర్పాటు చేయాలని ఆదేశం ● రాష్ట్రంలో ఏ తండా ఇక నుంచి రోడ్లు లేకుండా ఉండకూడదని వెల్లడి




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తాము పాలకులం కాదు సేవకులమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు సేవ చేయడానికే ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. పాలకుడిగా తాను ఎప్పుడూ ప్రవర్తించలేదని, సేవకుడిగా మాత్రమే వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నేనే రాజు నేనే మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. గెలుపు ఓటమి అన్నింటికీ తానే బాధ్యత తీసుకుంటానని చెప్పానన్నారు. వివిధ వర్గాలను పరిపాలనలో భాగస్వాములను చేయాలనే ఆలోచన తనదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఎస్సీలు 17 శాతం ఉంటే తమ ప్రభుత్వంలో 30 శాతం ఉన్నారన్నారు. దళితులకు 3 మంత్రి పదవులు, స్పీకర్ ఇచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి వారికి మేలు చేశామన్నారు. సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు మాట్లాడారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా చేయడం తమ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అచ్చంపేట అడవుల్లో 20 ఎకరాల్లో సంత్ సేవాలాల్ పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



లంబాడీలు నాకు అండగా నిలిచారు : తెలంగాణ ఉద్యమంలో లంబాడీల పాత్ర మరిచిపోలేనిదన్న సీఎం రేవంత్, వారికి సముచిత స్థానం కల్పించాలని తమ ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. తాను గతంలో జడ్పీటీసీగా గెలిచేందుకు సహకరించింది నాగర్కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లోని లంబాడీ యువకులేనని తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలోని ప్రతి సందర్భంలో లంబాడీలు తనకు అండగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని తండాలకు బీటీ రోడ్లు వేయాలని ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు.రాష్టంలోని అన్ని తండాల్లో రహదారులు మంచిగా ఉండాలనే ఆలోచనతోనే బీటీ రోడ్లు వేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి తండాలో పాఠశాల భవనాలు ఏర్పాట్లు చేయాలన్నారు. సోలార్ ప్లాంట్ల ద్వారా కరెంటు ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

**సన్నబియ్యం ధరలు తగ్గాయ్**

ప్రస్తుతం మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.45కు తగ్గిందని ముఖ్యమంత్రి చెప్పారు. 51 లక్షల పేద కుటుంబాలు 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నాయని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం రూ.9 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని 40 శాతం మెస్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 87 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు గ్రూప్ 1 ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు.ప్రభుత్వం వద్ద ప్రస్తుతం భూములు లేవని, కానీ ప్రజలకు సంక్షేమంతో పాటు విద్య ఇవ్వాలనుకుంటున్నట్లు సీఎం చెప్పారు. చదువు వల్ల కీలక పదవులు వస్తాయన్న ఆయన, చదువుకునే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాలురకు 100, బాలికలకు 200 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. తాను చేయించిన సర్వేలో ఆస్తుల వల్ల కాదు, చదువు లేకపోవడం వల్ల పేదరికం వచ్చినట్లు తేలిందన్నారు. వెనుకబాటు తనం అన్నది ఒక శిక్ష అని, చదువు ఒక్కటే సమాజంలో ఒక హోదాలో నిలబెడుతుందని స్ఫూర్తి నింపారు. పేద పిల్లలకు చదువు అందించడానికి ఎన్ని డబ్బులు అయినా ఖర్చు చేస్తానన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిపై విపక్ష నేతలు ప్రజలను నిందిస్తున్నారని మండిపడ్డారు."మేం పాలకులం కాదు, సేవకులం. మేం సేవ చేయడానికి ప్రజలు మాకు అవకాశం ఇచ్చారు. నేను ఎప్పుడూ దానిని గుర్తు పెట్టుకుంటా. పాలకుడిగా ఎప్పుడు నేను ప్రవర్తించలేదు, సేవకునిగా నా బాధ్యతను నిర్వహిస్తున్నా. ఏ వర్గాలైతే నాకు ఈ హోదా ఇచ్చారో వారికి తిరిగి సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్నాం. నేనే రాజు, నేనే మంత్రి అనే మాటలను వక్రీకరించారు. ముఖ్యమంత్రిగా, మున్సిపల్ మంత్రిగా నేనే ఉన్నాను. ఎన్నికల్లో గెలుపు ఓటములకు నాదే బాధ్యతని అని చెప్పాను" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## జగిత్యాల సమస్యకు చెక్!

● ఏఐసీసీ నేతతో ముగిసిన జీవన్ రెడ్డి భేటీ ● ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వర్గాల మధ్య తలెత్తిన విభేదాలు ● మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఏఐసీసీ కార్యదర్శి సవాంత్‌తో ప్రత్యేక సమావేశం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రమంతా ఒక పరిస్థితి ఉంటే జగిత్యాలలో మాత్రం మరో పరిస్థితి ఉంది. మిగతా చోట్ల మున్సిపల్ చైర్మన్ పోస్టును దక్కించుకునేందుకు మిగతా పార్టీలతో మంతనాలు సాగించాల్సిన పరిస్థితి ఉంటే జగిత్యాలలో మాత్రం సొంత నేతలతోనే బుజ్జగింపులకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్సెస్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వర్గాల మధ్య కుర్చీలాట కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని జిల్లా ఇన్?చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఏఐసీసీ కార్యదర్శి సవాంత్?కు అప్పగించారు. ఈ నేపథ్యంలో సవాంత్, మంత్రి అడ్లూరితో జీవన్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశం కాసేపటి క్రితం ముగిసింది.

**నా సూచనలు పరిగణలోకి తీసుకోండి: జీవన్‌రెడ్డి**

ఈ సందర్భంగా సవాంత్?తో జీవన్ రెడ్డి తన ఆవేదన వ్యక్తం చేశారు. నాకు ఇచ్చిన 16 బీఫామ్ ల్లో 9 చోట్ల గెలిచామని అదే సంజయ్ కు 34 బీఫామ్ లు ఇస్తే 14 మాత్రమే గెలిచారని సవాంత్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. సంజయ్ పక్కన పెట్టిన 9 మంది ఇండిపెండెంట్లు కూడా గెలిచారని తన వర్గానికి బీ ఫామ్ లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నా ఆలోచనలు, సూచనలు పరిగణలోకి తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఈ సమావేశం అనంతరం మాట్లాడుతూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని జీవన్ రెడ్డి చెప్పినట్లు మంత్రి అడ్లూరి వెల్లడించారు. జగిత్యాలపై కాంగ్రెస్ జెండా ఎగురుతుందన్నారు. ఈ భేటీతో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమస్యకు చెక్ పడినట్లేననే టాక్ వినిపిస్తోంది. మరి రేపు చైర్ పర్సన్ ఎంపిక వేళ సజావుగానే సాగుతుందా లేక ఏదైనా ట్విస్ట్ ఉండబోతోందా అనేది వేచి చూడాలి.

# జస్టిస్ సుదర్శన్ రెడ్డికి రాజ్యసభ?

● సీఎం రేవంత్ రెడ్డి మాస్టర్ ప్లాన్ ● ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాల భర్తీకి కాంగ్రెస్ ఫోకస్ ● పరిశీలనలో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ పేర్లు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ రాజకీయాల్లో త్వరలోనే కీలక పరిణామం చోటు చేసుకోబోతోందా? మంత్రి అజారుద్దీన్?ను పదవి గండం నుంచి గట్టెక్కించేందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ వేస్తున్నారా? పొలిటికల్ సర్కిల్స్ లో జరుగుతున్న చర్చ ప్రకారం అవుననే సమాధానం వస్తోంది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యూహ రచన చేస్తున్నారని ఈ దెబ్బతో ఇటు రాష్ట్రంలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ, త్వరలో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి మార్గం సుగమమం కానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తాజాగా ఓ ఆంగ్ల దినపత్రికలో వచ్చిన కథనం ఆసక్తిగా మారింది.

**రాజ్యసభకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి?**

తెలంగాణలో ఈ ఏడాది రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ వచ్చే ఏప్రిల్?లో పదవి విరమణ చేయబోతున్నారు. అసెంబ్లీలో ఉన్న బలాబలాల మేరకు ఈ రెండు స్థానాలు కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవాలనే లక్ష్యంగా పెట్టుకుందని ఈ క్రమలో ఈ స్థానాల భర్తీపై కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ రెండు స్థానాలు ఎవరికి ఇవ్వాలనే విషయంలో హైకమాండ్ పరిశీలనలు చేస్తుండగా ఒకటి జాతీయ స్థాయి, మరొకటి తెలంగాణ మూలాలు కలిగిన వ్యక్తికి ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఒక స్థానానికి గతేడాది ఇండియా కూటమి తరపున రాష్ట్రపతి బరిలో ఉన్న జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మరోక స్థానానికి తిరిగి అభిషేక్ సింఘ్వీ పేర్లను పార్టీ పరిశీలిస్తుండగా ఈ నేపథ్యంలోనే ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వంపై సీఎం అధిష్టానం పెద్దలతో చర్చించారని పేర్కొంది. అయితే సుదర్శన్ రెడ్డి పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నారా లేదా అనే విషయం ఇంకా తెలియాల్సి ఉందని ఈ కథనం స్పష్టం చేసింది. అలాగే సుదర్శన్ రెడ్డితో పాటు సీఎం సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డి పేరు సైతం రాజ్యసభ రేస్?లో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.

**ఎమ్మెల్సీలపై సస్పెన్స్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ 2025 అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే చట్టసభల్లో ఎలాంటి ప్రాతినిథ్యం లేకుండానే అజారుద్దీన్ ను రేవంత్ రెడ్డి తన కేబినెట్ లోకి తీసుకున్నారు. దీంతో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లో అంటే వచ్చే ఏప్రిల్ 30 నాటికి ఎమ్మెల్సీగానో లేదా ఎమ్మెల్యేగానో ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది. అలా చేయకుంటే మంత్రి పదవికి గండం ఏర్పడినట్లే. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా శాసనసభకు ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో ఇక ఎమ్మెల్సీగానే గెలవాల్సిన పరిస్థితి ఉంది. అయితే గవర్నర్ కోటా కింద ప్రొఫెసర్ కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్?ల పదవుల విషయంలో సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. అయితే ప్రొ.కోదండరామ్, అజారుద్దీన్ ను ఎమ్మెల్సీగా నియమించాలని కేబినెట్ నిర్ణయించినా సుప్రీంకోర్టులో కేసు పెండింగ్?లో ఉండటం వల్ల ఈ విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఈ కేసును సుప్రీంకోర్టు వచ్చే మార్చి 19 వరకు వాయిదా వేసింది. ఆలోపు ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని గత విచారణలో సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

**అజారుద్దీన్‌ విషయంలో కీలక నిర్ణయం**

ఎమ్మెల్సీలుగా నియమించుకోవచ్చని సుప్రీం తెలిపినా ఈ విషయంలో తుది తీర్పు ఎలా వస్తుందనే ఆందోళన మాత్రం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఉన్న టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్?లలో ఒకరి చేత కాంగ్రెస్ రాజీనామా చేయించి ఆయన స్థానంలో అజారుద్దీన్ కు మండలికి పంపించేలా కాంగ్రెస్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్సీగా రాజీనామా చేయబోయే వ్యక్తికి రాజ్యసభ ఆఫర్ చేసే అవకాశం లేకపోలేదనే చర్చ కూడా వినిపిస్తోంది. అజారుద్దీన్ కు మంత్రి పదవి అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దీంతో ఆయనకు పదవి గండం తప్పించే అంశంలో సీఎం తీసుకోబోయే నిర్ణయం ఆసక్తిగా మారుతోంది.

## కాంగ్రెస్ హైకమాండ్ ముందు జీవన్ రెడ్డి ఆవేదన



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పార్టీలో జరుగుతున్న పరిణామాలు, పదవుల కేటాయింపుపై ఆయన తన గళాన్ని విప్పారు. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లతో భేటీ అయిన జీవన్ రెడ్డి, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జీవన్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. 'నేను ఎప్పుడూ పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తనే. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటాను. అయితే, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన వారికే పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని ఆయన పేర్కొన్నారు. తన ఆలోచనలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని హైకమాండ్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జరిగిన టికెట్ల కేటాయింపుపై జీవన్ రెడ్డి గణంకాలతో సహా హైకమాండ్‌కు వివరించారు.

# బీసీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలి



● హై కోర్టు తీర్పు తరువాతే ఎన్నికలకు వెళ్లాలి ● బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలి ● ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికలలో 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలి ● 14 బీసీ సంఘాల సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీసీలకు 42% రిజర్వేషన్లతోటే ఎన్నికలకు వెళ్లాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాగానే ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరపాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. నిన్న ముఖ్యమంత్రి "మంత్రుల సమావేశం చర్చలు జరిపినట్లు తెలిసింది. దీనిని 14 సంఘాల త్రివంగా వ్యతిరేకిస్తున్నాం. ఈ రోజున 14 బి.సి. సమావేశానికి బి.సి. భవన్ లో డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ ( జాతీయ బి.సి. సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్) అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఎట్టి పరిస్థితులలో 42 శాతం రిజర్వేషన్ లు పెంచిన తర్వాత చట్ట బద్దంగా ఎన్నికలకు వెళ్ళాలని, లేని పక్షంలో పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గతంలో కేంద్రంలో రావలసిన 3 వేల కోట్లు కోల్పోతున్నామని, సర్పంచ్ ఎన్నికలు జరిపారు. మున్సిపల్ ఏరియాలో బి.సి జనాభా తక్కువ ఉందని వెళ్లారు. ఇక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు జరుపడానికి ఎటువంటి కారణాలు లేవు. పైగా కోర్ట్ లో కేసులు ఉన్నాయి. కోర్ట్ కేసులు ముగిసిన తర్వాతనే ఎన్నికలకు వెళ్ళాలని డిమాండ్ చేస్తున్నాం.ఇప్పుడు ఇక ముందు జరిగే ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో ఎట్టి పరిస్థితులలో 42 శాతం కు పెంచే వరకు వదిలిపెట్టే ప్రశక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా 42 శాతం కు పెంచిన తర్వాతనే ఎన్నికలకు వెళతామని కొన్ని వందలసార్లు ప్రకటించి మోసం చేసి సర్పంచ్ మున్సిపల్ ఎన్నికలకు వెళ్లారు.

బీసీలకు అన్యాయం చేశారు. హై కోర్టులో నడిచే కేసు బలంగా ఉంది రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా న్యాయబద్ధంగా జీవో నెం.9 ఉంది. కాబట్టి పెంచిన రిజర్వేషన్ల కేసు గెలుస్తుంది. ఈ కేసును తొందరగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి-6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అలాగే అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టం చేశారు.

జనాభా లెక్కలు తీసి న్యాయ బద్ధం చేశారు. గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పారు. అన్ని కోణాలలో పెంపుదలకు మద్దతు ఉంది. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయి. కానీ ఆ రాష్ట్రాలలో బీసీలు తిరగబడలేదు. కానీ మన రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల రక్షణ కోసం రాష్ట్ర బంద్ జరపడం అలాగే 40 సార్లు ధర్నాలు ర్యాలీలు జరపడం గర్వించదగిందని అన్నారు.

ఇది మన రాష్ట్రంలోని బీసీల చైతన్యానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికి ఢిల్లీకి 64 సార్లు వెళ్లారు. ఒక్కసారి కూడా బీసీల గురించి ప్రధానమంత్రికి కలవలేదు. కనీసం అఖిలపక్షాన్ని కూడా ఢిల్లీకి తీసుకు వెళ్లలేదు. పార్లమెంట్ లో చర్చ చేయలేదు. ఈ దీపా కోర్టులో కేసులు వాదించాడానికి సీనియర్ ప్రాముఖ్యత గల జాతీయ స్థాయి గుర్తింపులో అడ్వకేట్లను నియమించాలి. హైకోర్టులో వేసిన మొత్తం 62 కేసులను సీనియర్ అడ్వకేట్లతో వాదించాలి. ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. చైర్మన్ల ఎంపికలో బి.సి. లకు జనరల్ స్థానాల్లో 50 శాతం ఇవ్వాలి. కోర్ట్‌లో కేసు గెలువడానికి ప్రభుత్వ పక్షాన వాదించడానికి ఢిల్లీ నుంచి సీనియర్ న్యాయవాధాలను పెట్టి వాదించాలి.

ఈ బి.సి. ఉద్యమాన్ని బలంగా చేద్దాం. పార్టీలకు అతీతంగా అందరు టె9జలకు పోకుండా కలసిరావాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో, నీలం వెంకటేష్, రాజేందర్, జిల్లపల్లి అంది, పగిళ్ళ సతీష్, జి అనంతయ్య అల్లంపల్లి రామకోటి, పల్లగోర్ల మోడిరాందేవ్ యాదవ్, కడారి శివకుమార్ యాదవ్, మొగిలి క్రిషయ్య, మొరాపక సతీష్, దసోజు భాస్కరచారి, అంజి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## మావోలు శాంతి మార్గంలోకి రావాలి

● జనజీవన స్రవంతిలో కలవండి ● లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తాం : తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి




తెలంగాణ బ్యూరోప్రతినిధిః అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మావోయిస్టులు వెంటనే లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి రావాలని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపును మరోసారి తెలంగాణ పోలీసు లు పునరుద్ఘాటించా రు. గత రెండు సంవత్సరాల్లో 588 మంది మావోయిస్టులు లొంగిపోయారని, తెలంగాణాకి చెందిన 15 మంది క్యాడర్‌లు కూడా లొంగిపోవాలని డీజీపీ పిలుపునిచ్చారు. జనజీవన స్రవంతిలోకి వచ్చి శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు లొంగిపోతే తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తామని మావోలకు డీజీపీ హామీ ఇచ్చారు కుటుంబాలతో గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. సమాజంలో గౌరవంతో, స్వేచ్ఛతో, కుటుంబ సభ్యులతో కలిసి జీవించేందుకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని ప్రభుత్వం తరఫున హామీ ఇచ్చారు. శాంతి, అభివృద్ధి, సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అండర్‌గ్రౌండ్ జీవితం విడిచి కుటుంబాలతో కలసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపు ఇచ్చారు.

# కాంగ్రెస్, బీజేపీ సింగరేణిని దోచుకుంటున్నాయి



● కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసేందుకు మద్దతు ఇవ్వండి ● బంజారాలకు కేటీఆర్ పిలుపు ● తెలంగాణ భవన్‌లో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ● పొత్తులో ఉన్న కాంగ్రెస్-సీపీఐ మధ్య ఒప్పందం జరిగితే ఇబ్బందేం లేదని వ్యాఖ్య ● సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామన్నాం కొత్తగూడెం కార్పొరేషన్ రాజకీయాలపై కేటీఆర్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కొత్తగూడెం కార్పొరేషన్ రాజకీయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పొత్తులో ఉన్న కాంగ్రెస్-సీపీఐ మధ్య ఒప్పందం జరిగితే ఇబ్బందేం లేదని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామన్నాం.. కాంగ్రెస్, బీజేపీ సింగరేణిని దోచుకుంటున్నాయని చెప్పాం.. ఏ కారణం చేత పొత్తుకు సీపీఐ ఒప్పుకుందో, ఏం ఒత్తిళ్లు ఉన్నాయో మాకు తెలియదని కేటీఆర్ అన్నారు.హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ నేతలు అరాచకాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఎత్తుకెళ్లి ప్రలోభాలకు గురిచేస్తున్నారు. పోలీసులను, గుండాలన ఇళ్లకు పంపి బెదిరింపులకు గురిచేస్తున్నారు. అయినా ఎక్కడా బెదరకుండా బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ధైర్యంగా ఉన్నారు. రాష్ట్రంలో ఇంకా కొన్ని మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

మరోవైపు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠంపై క్లారిటీ వచ్చిన విషయం తెలిసిందే. కాంగ్రెస్, సీపీఐ ఒక అవగాహనకు వచ్చాయి. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను చెరో రెండున్నరేళ్ల చొప్పున పంచుకోవాలని నిర్ణయించాయి. మొదటి రెండున్నరేళ్లు సీపీఐకి, ఆ తర్వాత కాంగ్రెస్‌కు మేయర్ పీఠం దక్కనుంది. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్-22, సీపీఎం-1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్-8, బీజేపీ-1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందిన విషయం తెలిసిందే. ఈనెల 16న మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

**కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసేందుకు మద్దతు ఇవ్వండి**

మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేందుకు మద్దతుగా నిలవాలంటూ బంజారాలకు బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. గిరిజనులకు రిజర్వేషన్లు పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సేవాలాల్ బంజారా భవన్‌ను బంజారాహిల్స్‌లో నిర్మించారని గుర్తు చేశారు. ఆదివారం నాడు తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా బంజారాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఒకే రోజు నాలుగున్నర లక్షల ఎకరాలకు సంబంధించి గిరిజనులకు పోడు పట్టాలు అందించిన ఘనత కేసీఆర్‌దే అని తెలిపారు. మా తండాలో మా రాజ్యం ఉండాలన్న లాంబాడాల ఆత్మగౌరవాన్ని నిజం చేసింది బీఆర్ఎస్ అధినేత అని గుర్తు చేశారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిందీ కేసీఆర్ అని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు కేటీఆర్. ఇక కాంగ్రెస్, సీపీఐ పార్టీలు అలయన్స్‌లో ఉన్నాయని.. సింగరేణి దోపిడీని అరికట్టడానికి తాను సీపీఐకి మద్దతు ఇస్తానన్నారు. సింగరేణిలో కాంగ్రెస్, బీజేపీలు కలిసి పని చేస్తున్నాయని విమర్శించారు. సీపీఐపైన ఏ ఒత్తిళ్లు వచ్చి కొత్తగూడెంలో కాంగ్రెస్‌తో పొత్తుకు ఒప్పుకుందో తనకు తెలియదని పేర్కొన్నారు. ఎవరు కలిసొచ్చినా, రాకున్నా తాము సింగరేణి అవినీతిపై పోరాటం చేస్తామని కుండబద్దలు కొట్టారు. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేస్తోందంటూ మండిపడ్డారు. తమ కౌన్సిలర్లను బెదిరిస్తున్నారని.. మరికొన్ని చోట్ల కిడ్నాప్ సైతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉన్న అంచనా మేరకు హంగ్ మున్సిపాలిటీల్లో 10 వరకు బీఆర్ఎస్‌కు రావచ్చని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్‌దే తొర్రూరు మున్సిపాలిటీ..!

● ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మెజారిటీతో గెలిచిన ఏకైక స్థానం తొర్రూరు దీనిపైనా ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ ● మాజీ మంత్రి ఎర్రబెల్లి సంచలన వ్యాఖ్యలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మెజారిటీతో గెలిచిన ఏకైక స్థానం తొర్రూరుపై కూడా కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. తొర్రూరులో మొత్తం 16 వార్డులుండగా, బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 చోట్ల విజయం సాధించింది. పాలకుర్తి ఎమ్మెల్యే, వరంగల్ ఎంపీ ఎక్స్ అఫిషియో సభ్యులుగా తొర్రూరు మునిసిపాలిటీలో నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్పందించారు. తొర్రూరు మున్సిపాలిటీ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఎర్రబెల్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. మా సభ్యులు ఎవరూ కాంగ్రెస్ లోకి వెళ్లడం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వార్డు సభ్యులు మా వైపు వస్తున్నారనే భయంతో దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. 16 మంది వార్డు సభ్యులలో మా వాళ్ళు 9 మంది గెలిచారని అన్నారు. ఎక్స్ అఫిషియో ఓట్లతో కూడా కాంగ్రెస్ చైర్మన్ పీఠాన్ని గెలవలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చెప్పుకొచ్చారు.




## ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధికి కృషి

### శివరాత్రి వేళ మంత్రి కోమటిరెడ్డి ప్రకటన



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని చారిత్రాత్మక పానగల్ పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వరాలయాలలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. వందల ఏళ్ల చరిత్రను సాక్షిగా నిలబెట్టుకున్న ఈ ప్రాచీన దేవాలయాలు తెలంగాణ సంస్కృతి, శిల్పకళ వైభవానికి ప్రతీకలు అని కొనియాడారు. 11--12వ శతాబ్దాలకు చెందిన ఈ ఆలయాల్లో అద్భుతమైన శిల్ప సంపద ఉట్టిపడుతుందని చెప్పారు. ముఖ్యంగా ఛాయా సోమేశ్వరాలయం గర్భగుడిలో ఎల్లప్పుడూ ఒకే విధంగా కనిపించే నీడ విశేష ఆకర్షణ అని గుర్తుచేశారు. ఈ ఆలయాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యునెస్కో గుర్తింపు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శైవక్షేత్రాలకు పోటెత్తారు. పరమేశ్వరుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి.

## నేడే మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నిక

- 7 కార్పొరేషన్లలో కొలువుదీరనున్న మేయర్లు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆరు మున్సిపల్ పీఠాలపై ఉత్కంఠ




తెలంగాణ బ్యూరోప్రతినిధిః ఉమ్మడి మెదక్ జిల్లాలోని మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన మలుపులు తిరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 18 మున్సిపాలిటీలు ఉండగా, ప్రధానంగా ఆరు కీలక పట్టణాల్లో ఏ పార్టీకి కూడా స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో 'హంగ్' పరిస్థితి నెలకొంది. మున్సిపల్ చైర్మన్ సీట్లను ఎలాగైనా దక్కించుకోవాలనే పట్టుదలతో కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీలు ముమ్మరంగా వ్యూహప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. అభ్యర్థులను కాపాడుకునేందుకు , ఇతర పార్టీల మద్దతు కూడగట్టేందుకు ఇప్పటికే రహస్య ప్రాంతాల్లో క్యాంపు రాజకీయాలు కూడా మొదలయ్యాయి. ఇంద్రేశం వంటి చోట్ల స్వతంత్రులు బీఆర్ఎస్‌లో చేరడంతో కొన్ని పీఠాలు ఖరారైనప్పటికీ, మిగిలిన చోట్ల మాత్రం రేపు జరగబోయే ఎన్నిక వరకు ఉత్కంఠ కొనసాగేలా ఉంది. ఈ రాజకీయ చదరంగంలో బీజేపీ ఊహించని విధంగా 'కింగ్ మేకర్'గా అవతరించింది. ముఖ్యంగా నర్సాపూర్ , జిన్నారం మున్సిపాలిటీల్లో బీజేపీ మద్దతు లేనిదే ఏ పార్టీ కూడా పీఠాన్ని దక్కించుకోలేని పరిస్థితి ఉంది. నర్సాపూర్‌లో కాంగ్రెస్‌కు ఆరు, బీఆర్ఎస్‌కు ఐదు, బీజేపీకి నాలుగు సీట్లు రాగా, బీజేపీ తమకు చైర్మన్ పదవి ఇస్తేనే మద్దతు ఇస్తామనే గట్టి ఆఫర్‌ను రెండు ప్రధాన పార్టీల ముందు ఉంచింది. జిన్నారంలో కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో, ఇక్కడ చైర్మన్ పీఠం దక్కాలంటే బీజేపీ కౌన్సిలర్ల మద్దతు తీసుకోవడం కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ పార్టీలకు తప్పనిసరిగా మారింది. దీంతో కమలం పార్టీ ఇప్పుడు నిర్ణయాత్మక శక్తిగా మారి రెండు పార్టీలకు షాక్ ఇస్తోంది. మరోవైపు జహీరాబాద్ , ఇస్నాపూర్‌లో రసవత్తర పోరు సాగుతోంది. జహీరాబాద్‌లో బీఆర్ఎస్ 15, కాంగ్రెస్ 14 స్థానాల్లో గెలిచాయి, అయితే అక్కడ గెలిచిన ముగ్గురు స్వతంత్రులు కాంగ్రెస్ రెబెల్స్ కావడంతో వారిని తిరిగి బుజ్జగించే పనిలో హస్తం పార్టీ ఉంది. ఇస్నాపూర్‌లో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారనున్నాయి, ఇక్కడ మెదక్ ఎంపీ రఘునందన్ రావు మద్దతు ఎవరికి ఉంటుందనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేపుతోంది. జిన్నారంలో బీజేపీకి చైర్మన్ పదవి ఆఫర్ చేస్తే, ఇక్కడ వారు ఏ పార్టీకి ఓటు వేస్తారనేది మిస్టరీగా మారింది. ఇప్పటికే సంగారెడ్డి, సదాశివపేట వంటి చోట్ల కాంగ్రెస్ పట్టు సాధించగా, సిద్దిపేట పరిసరాల్లో బీఆర్ఎస్ తన పీఠాలను కాపాడుకుంది. నేడు జరగనున్న చైర్మన్ ఎన్నికలతో ఈ అనిశ్చితికి తెరపడనుంది.

## బీఆర్ఎస్‌లో కొత్త ఊపు..

- ఇప్పటికే గ్రామపంచాయతీల్లో ఊహించని విధంగా ఫలితాలు
- మున్సిపాలిటీల్లోనూ చెప్పుకోదగిన స్థానాలు కైవసం
- తాజాగా జరిగిన మున్సిపోల్స్‌లోను బీఆర్ఎస్‌ను ఆదరించిన పట్టణ ప్రజలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఇప్పటికే గ్రామపంచాయతీల్లో ఊహించని విధంగా ఫలితాలు రావడం.. మున్సిపాలిటీల్లోనూ చెప్పుకోదగిన స్థానాలను కైవసం చేసుకోవడంతో బీఆర్ఎస్ పార్టీలో కొత్త ఊపు కనిపిస్తున్నది. తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీని పట్టణ ప్రజలు ఆదరించారు. దీంతో ఇప్పుడు పార్టీ రాబోయే గ్రేటర్ ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నట్లు తెలుస్తున్నది. ప్రతిపక్షంలో ఉన్నా రాజకీయంగా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ హైదరాబాద్‌పై పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరించేందుకు సిద్ధమైంది. ప్రధానంగా మున్సిపల్ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల నియోజకవర్గాల్లో వచ్చిన పాజిటివ్ సంకేతాలు గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపాయి. ఈ ఊపుతోనే జీహెచ్ఎంసీపై గులాబీ జెండా ఎగరవేయాలన్న లక్ష్యంతో పార్టీ ప్లాన్ చేస్తున్నది. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో గులాబీ జెండాలు రెపరెపలాడాయి. పట్టణ విస్తరణ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లోనూ తమ ఓటు బ్యాంక్ గణనీయంగా నిలకడగా ఉండటం నాయకత్వానికి ధైర్యం ఇచ్చినట్లయింది.

**ఆంధ్రా ఓటర్లు బీఆర్ఎస్ వైపే!**

నగర పరిసరాల్లో మధ్యతరగతి, ఐటీ ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, కొత్తగా స్థిరపడిన కుటుంబాలతో పాటు ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓటర్లు సైతం ఉన్నారు. అలాంటి మిశ్రమ వాతావరణంలోనూ బీఆర్ఎస్‌కు మద్దతు లభించిం ది. అయితే.. ఈ మద్దతు ఎప్పటి నుంచో బీఆర్ఎస్‌కు ఉన్నప్పటికీ.. అది ఈ ఎన్నికల్లోనూ కొనసాగిందని చెప్పాలి. ముఖ్యంగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓటర్లు సైతం గులాబీ పార్టీకే జై కొట్టారన్న టాక్ నడుస్తున్నది. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మూడు కార్పొరేషన్లుగా విభజించారు. దాంతో ఈ మూడు కార్పొరేషన్లపైనా గులాబీ జెండా ఎగరవేస్తామని పార్టీ భరోసాతో ఉన్నది.



### గెలుపు కోసం కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతోంది

**బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్**

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఇటీవలే రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను హస్తగతం చేసుకుంది. ఇది తమ పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అంటూ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దీంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు వ్యూహ, ప్రతి వ్యూహాలు రచిస్తున్నాయి. గెలుపు కోసం కాంగ్రెస్ అరాచకాలకు పాల్పడుతోందని తాజాగా బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శించారు. ఆదివారం ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ..' మున్సిపల్ ఎన్నికల్లో 30శాతం ఓట్లను బీఆర్ఎస్ గెలుచుకుంది. ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందనడానికి ఇదే ఉదాహరణ. కనీసం 15 రోజుల ముందే షెడ్యూల్ ఇవ్వాలి. వారం రోజుల్లోనే అన్నీ పూర్తి చేసి ఎస్ఈసీ మమ అనిపించింది. కాంగ్రెస్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా.. ఈసీ నోటీసులు ఇవ్వలేదు. రేవంత్‌కు అనుకూలంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోంది' అంటూ ఆర్ఎస్ ప్రవీణ్ ఫైర్ అయ్యారు.

# గద్వాల పీఠంపై ఉత్కంఠ..

### ఇరు పార్టీలకు ఎక్స్ అఫీషియో ఓట్లే కీలకం




గద్వాల : గద్వాల చైర్మన్ పీఠం ఏ పార్టీకి దక్కనుందనే విషయంలో ఉత్కంఠ నెలకొంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్ మున్సిపాలిటీలలో వార్డ్ కౌన్సిలర్ల ఫలితాలలో ఓటర్ల విలక్షణమైన తీర్పుతో కాంగ్రెస్ ,బీఆర్ఎస్ లకు మ్యాజిక్ ఫిగర్ దక్కలేదు. దీంతో స్వతంత్రుల మద్దతుతో పాటు ఎక్స్ అఫీషియో ఓట్లే కీలకంగా మారాయి. ఆ ఓట్లే కీలకంగా మారడంతో కాంగ్రెస్ , బీజెపితో కలిసి బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు వారు కీలకం కావడంతో వ్యూహ ప్రతి వ్యూహాలలో తల మునుకలయ్యాయి. వేర్వేరు క్యాంప్ లలో ఉన్నప్పటికీ ఒక పార్టీ నుంచి గెలిచిన వారికి స్వతంత్రులకు, రెబల్స్ కు మరో పార్టీ నేతలు వల వేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ , బీఆర్ఎస్ ,బీజెపి పార్టీలు అప్రమత్తమయ్యాయి. తమ పార్టీ తరపున గెలిచిన విజేతలను ఫలితాలు ప్రకటించిన వెంటనే ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యాంపులకు తరలించారు. గద్వాల మున్సిపాలిటీలో మెజార్టీ రాక హాంగ్ వచ్చిన నేపథ్యంలో మెజార్టీ కోసం కాంగ్రెస్ నేతలు ఇతర స్వతంత్రులు, ఒక ఎంఐఎం కౌన్సిలర్ తో కలిపి క్యాంపు రాజకీయాలు నిర్వహిస్తూ నేడు ఎన్నికకు రానున్నారు.

**ఎక్స్ అఫీషియో మెంబర్ల ఓటు కీలకం**

చైర్మన్ పీఠం ఐజ మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను 13 వార్డులలో బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ రావడంతో అక్కడ ఆ పార్టీ నాయకత్వం నిర్ణయం మేరకు సీఎం సురేష్ చైర్మన్ కానున్నారు. వడ్డేపల్లి లో సైతం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి 10 వార్డులకు 8 వార్డులలో విజయం సాధించి ఆ పార్టీ తరపున మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకోనున్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ , బీఆర్ఎస్ కు తలో ఐదు సీట్లు రావడంతో అక్కడ ఎక్స్ అఫీషియో మెంబర్ల ఓటు కీలకము కావడంతో ఎమ్మెల్యే విజయుడు తన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**బీసీలకే చైర్మన్ పదవి**

గద్వాల కోటలో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో రాజకీయ సమీకరణాల కారణంగా మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీలకే కేటాయించే అవకాశం ఉంది. మున్సిపల్ రిజర్వేషన్లలో భాగంగా జనరల్ మహిళకు ఈ చైర్మన్ స్థానం ఖరారు కాగా అనూహ్యంగా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేందుకు బీసీ మహిళకు చైర్ పర్సన్ స్థానాన్ని కేటాయించనున్నారు.

**ఎక్స్ అఫీషియో ఓట్లే కీలకము**

గద్వాల, అలంపూర్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ ,బీఆర్ఎస్ ఎక్స్ అఫీషియో ఓట్లే కీలకంగా మారాయి. గద్వాలలో 37 వార్డులలో మ్యాజిక్ ఫిగర్ 19 కి కాంగ్రెస్ పార్టీ 16 గెలువగా మరో మూడు స్థానాలు మెజార్టీకి అవసరమవుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు స్వతంత్రులు ఒక ఎంఐఎం కౌన్సిలర్ మద్దతు కూడా కడుక్కొని క్యాంపు నిర్వహిస్తున్నారు. అదనంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, ఎంపీ మల్లురవి సైతం తమ ఎక్స్ అఫీషియో ఓట్లను వినియోగించుకోనున్నారు.బిఆర్ఎస్ సైతం 11 సీట్లు సాధించగా 7 సీట్లు సాధించిన బీజెపితో కలిసి క్యాంప్ రాజకీయాలు నిర్వహిస్తూ స్వతంత్రులకు చైర్మన్ స్థానాన్ని ఆఫర్ చేయడం ద్వారా పుర పీఠాన్ని కైవసం చేసుకోవాలని బిఆర్ఎస్ బిజెపి ఎత్తులు వేస్తున్నాయి.

**చైర్మన్ పీఠాన్ని కైవసం**

ఇదిలా ఉండగా బీఆర్ఎస్ తరపున ఎలాంటి విప్ జారీ చేయలేదని జిల్లా అదనపు నర్సింగరావు తెలిపారు. నిబంధనల ప్రకారం ఉదయం 11 గంటలలోపు ఇవ్వాల్సి ఉండగా వారు ఆ సమయంలో ఇవ్వలేకపోయారు. దీంతో ఆ లెటర్ ని వారి వెంటే తీసుకపోయారని తెలిపారు. కేవలం ఎమ్మెల్యే విప్ ధిక్కరిస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకునే అవకాశం లేదు.కేవలం తదుపరి ఎన్నికల్లో ఎక్స్ అఫీషియో ఓటును వేసే అవకాశాన్ని కోల్పోతారు. రేపు జరగబోయే మున్సిపల్ ప్రమాణస్వీకారం చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలలో ప్రధాన పార్టీల వివరాలు ఎక్స్ అఫీషియల్ ఓట్లే కీలకం కావడంతో ఏ పార్టీ ఏ విధంగా వ్యూహాత్మకంగా వ్యవహరించి చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటుందోననే ఉత్కంఠ ప్రజల్లో ఉండగా నేడు ఆ ఉత్కంఠకు తెరపడే అవకాశం ఉంది.



# "కోవా బన్" వ్యవహారంపై అసదుద్దీన్ ఒవైసీ ఫైర్

### "కోవా బన్" వ్యవహారానికి మతం రంగు పూయడం సరైంది కాదని వెల్లడి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మేడారం జాతర సందర్భంగా చెలరేగిన "కోవా బన్" వివాదంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు నుంచి వచ్చిన వలీ అనే ముస్లిం చిన్న వ్యాపారిని లక్ష్యంగా చేసుకొని కొందరు యూ ట్యూబర్లు "ఫుడ్ జిహాద్" అంటూ వీడియోలు చేయడం, అన్ హైజీన్ ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం పట్ల ఆయన స్పందించారు. ఒక చిన్న వ్యాపారి జాతర సమయంలో తన కుటుంబ పోషణ కోసం వస్తువులు అమ్ముకుంటుంటే, అతనిపై మతరంగు పులిమి వీడియోలు తీయడం అన్యాయమని ఒవైసీ పేర్కొన్నారు. "ఇది ఏమిటి? ఒక మనిషి పొట్టకూటి కోసం కష్టపడుతున్నాడు. ఇలాంటి వీడియోల వల్ల అతని కుటుంబమే కాదు, లక్షల మంది చిన్న వ్యాపారుల జీవనోపాధి దెబ్బతింటుంది. ఫుడ్ సేఫ్టీ సమస్య ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి గానీ, యూట్యూబ్‌లో డ్రామా చేసి మత విద్వేషం రెచ్చగొట్టడం ఎందుకు?" అని తన సోషల్ మీడియా ఖాతా వేదికగా ప్రశ్నించారు. నిజంగానే ఫుడ్ హైజీన్ సమస్య అయితే ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కు నివేదించాలని, కానీ వ్యూస్ కోసం సోషల్ మీడియాలో మతపరమైన వివాదాలకు పూనుకోవడం సమాజానికి మంచిది కాదని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి కంటెంట్ సృష్టించే యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, చిన్న వ్యాపారులను టార్గెట్ చేసి మత విద్వేషం పెంచే ప్రయత్నాలను ఆపాలని డిమాండ్ చేశారు.

ఒవైసీ ప్రకటనతో కోవా బన్ వివాదం మరింత చర్చకు దారితీసింది. సోషల్ మీడియాలో కూడా సామాన్య ప్రజలు పెద్దఎత్తున స్పందిస్తున్నారు. ఓ చిరు వ్యాపారిని ఇబ్బంది పెట్టడం ఏమిటని సదరు యూట్యూబ్ ఛానెల్ పై మండిపడుతున్నారు. అంతేకాదు ఏపీ మంత్రి నారా లోకేష్ కోవా బన్ చిరు వ్యాపారి షేక్ షావలికి మద్దతు తెలిపారు. త్వరలోనే వలిని కలిసి, కోవా బన్ టేస్ట్ చేస్తానని హామీ ఇవ్వడం గమనార్హం. అభివృద్ధి

# పరిషత్ ఎన్నికలకు పరీక్షల గండం!

- ఎన్నికల నిర్వహణకు విద్యార్థుల పరీక్షల షెడ్యూల్ అడ్డంకి
- ఫిబ్రవరి చివరి వారం, మార్చి, ఏప్రిల్‌లో వరుస పరీక్షలు
- ఈ కారణంగా పరిషత్ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణలో ఎన్నికల జాతర కొనసాగుతోంది. గత డిసెంబర్ లో పంచాయితీ ఎన్నికలు 3 దశల్లో జరగగా.. ఇటీవల ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎలెక్షన్స్ కూడా ముగిసాయి. అయితే తరువాత జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. ఫిబ్రవరి చివరి వారం, మార్చి, ఏప్రిల్ లో వరుస పరీక్షల కారణంగా పరిషత్ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. కాగా సాధారణంగా రాష్ట్రంలో పంచాయితీ ఎన్నికలతో పాటే పరిషత్ ఎన్నికలు కూడా జరగడం ఆనవాయితీ. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లపై ఇచ్చిన ఎన్నికల హామీ పెండింగ్ లో ఉండటం. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే 42% బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షాలు, బీసీ సంఘాలు 42% బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చాయి. మరోవైపు బీసీ రిజర్వేషన్లు ఇచ్చాకే గ్రామపంచాయితీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలకు వెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు.ఈ మేరకు విపక్షాల సహాయంతో అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందింది. అయితే అది అక్కడితోనే ఆగిపోయిందని చెప్పుకోవాలి. బిల్లు ఆమోదం కోసం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వద్దకు ఫైలును పంపగా.. న్యాయసలహా అంటూ.. గవర్నర్ కేంద్రానికి పంపించారు. అసెంబ్లీలో ఆమోదం పొందిన ఆ బిల్లు పార్లమెంటులో కూడా ఆమోదం పొందాల్సి ఉండగా.. ఇప్పటివరకు అది ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది. ఈలోపు రాష్ట్రంలో పంచాయితీ ఎన్నికల సమయం మించిపోవడంతో సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు నిర్వహించమని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు 42% బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులోనూ సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలైంది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయని దాఖలైన పిటిషన్లపై కూడా విచారణ ఇంకా కొనసాగుతోంది. ఇక తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాల్సి రావడంతో.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇరుకున పడింది.న్యాయసలహా అనంతరం.. తమ పార్టీ తరపున బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించుకొని.. పంచాయితీ ఎన్నికలు, తర్వాత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది సర్కారు. ఇంకా పరిషత్ ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికలు మిగిలి ఉండగా.. వాటిని కూడా మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. లేదంటే 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.498 కోట్ల నిధులు ఆగిపోయే అవకాశం కూడా ఉంది. అయితే ఇక్కడే అసలు చిక్కంతా ఉంది. పరిషత్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చి, ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం 20 రోజుల సమయం అయినా పడుతుంది. కానీ ఈనెల 25 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు, మార్చి 14 నుంచి 10వ తరగతి పరీక్షలు.. ఆ తరువాత పలు పోటీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో మార్చి 31లోగా ఎన్నికలు నిర్వహించడం దాదాపు అసాధ్యం అనే అనిపిస్తోంది.ఈ సమయంలో ఎన్నికల షెడ్యూల్ రూపొందించడం అత్యంత కష్టమైనదిగా కూడా ఎలెక్షన్ అధికారులు భావిస్తున్నట్టు సమాచారం. మరి జిల్లా, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని సర్వత్రా ఆసక్తి వ్యక్తం అవుతోంది. త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో పరిషత్ ఎన్నికలే కీలక చర్చాంశనీయంగా మారనున్నట్టు సమాచారం. మరోవైపు పరిషత్ ఎన్నికల ఆశావాహులు కూడా తమ సాధ్యాసాధ్యాలపై లెక్కలు వేసుకుంటూ ఇప్పటి నుంచే ఓటర్లను మచ్చిక చేసుకుంటున్నట్టు తెలుస్తోంది.

# శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిట

- ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల కోలాహలం
- కీసరగుట్టకు భక్తుల రద్దీ
- శంభు లింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఉత్తమ్
- యాదగిరిగుట్ట శివాలయంలోనూ భక్తుల ప్రత్యేక పూజలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. కీసర గుట్టకు భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే రాష్ట్రంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణలతో ఆలయాల ప్రాంగణాలు మార్మోగాయి. పరమేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మహాశివుడిని ప్రార్థిస్తున్నానన్న సీఎం, ఉపవాస పూజలు చేస్తున్న భక్తులకు శివయ్య ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు.ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల కోలాహలం : రాష్ట్రవ్యాప్తంగా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖ శైవ క్షేత్రం వేములవాడలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. భీమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామివారికి ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. భీమన్నను దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. నల్గొండ జిల్లా పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. మేళ్లచెరువు శ్రీ ఇష్ట కామేశ్వరి సమేత స్వయంభూ శంభు లింగేశ్వర స్వామిని మంత్రి ఉత్తమ్ దర్శించుకున్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.శంభు లింగేశ్వర స్వామిని **దర్శించుకున్న ఉత్తమ్** : మేళ్లచెరువు శ్రీ ఇష్టకామేశ్వరి సమేత స్వయంభూ శంభు లింగేశ్వర స్వామిని మంత్రి ఉత్తమ్ దర్శించుకున్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అనుబంధం ఆలయమైన శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శివాలయంలోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఆలయ ఈవో భవాని శంకర్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అనుబంధ ఆలయమైన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శివాలయంలోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వరంగల్ వేయిస్తంభాల ఆలయంలోనూ భక్తుల కోలాహలం నెలకొంది. హనుమకొండలోని సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబ సమేతంగా గరళాకంఠుడిని దర్శించుకుంటున్నారు.స్వామివారిని **స్వహస్తాలతో తాకే అదృష్టం** : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం కేతకి సంగమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. శివ స్వాములు ఇరుముడితో తరలివచ్చి దీక్ష విరమణ చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలోని అమృత గుండంలో స్నానాలు ఆచరించి కేతకి సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని పలు శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

శివరాత్రి సందర్భంగా జగిత్యాల జిల్లాకు చెందిన సూక్ష్మ కళాకారుడు గుర్రం దయాకర్ అతి సూక్ష్మంగా సూదిపై నాగుపాము పడగ నీడలో కూర్చుని ఆశీర్వదిస్తున్నట్లు శివయ్య విగ్రహం తయారు చేశాడు. మహా శివరాత్రిని పురస్కరించుకొని హైదరాబాద్ వనస్థలిపురంలోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. స్వామివారిని స్వహస్తాలతో తాకే అదృష్టం భక్తులకు కల్పించారని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అగ్రి వర్సిటీ పరీక్షల్లో అక్రమాలపై దర్యాప్తులో కీలక ఆధారాలు

- అగ్రి వర్సిటీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో కీలక పరిణామం
- సీఐడీ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల్లో అక్రమాలపై పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై వర్సిటీ అంతర్గత విచారణతోపాటు సీఐడీ ప్రాథమిక దర్యాప్తులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. పీజేటీఏయూ పరిధిలోని మూడో సంవత్సరం విద్యార్థుల మొదటి సెమిస్టర్ 2025-26 పరీక్షలకు సంబంధించిన ఈ లీకేజీలో ఇంటిదొంగల నిర్వాకంపై కీలక సమాచారం లభించింది.

**ప్రశ్నపత్రాలు జిరాక్స్ తీసే సమయంలో**

ఈ పరీక్షపత్రాల లీకేజీలో వరంగల్ వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కార్తిక్ కీలకపాత్ర వహించినట్లు సీఐడీ గుర్తించింది. ఇన్సర్వీస్ విద్యార్థులకు పరీక్ష పత్రాలను అతనే లీక్ చేసినట్లుగా గుర్తించారు. ప్రశ్నాపత్రాల్ని జిరాక్స్ తీసే సమయంలోనే అతను తన సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసినట్లుగా బయటపడింది. ఇలా చేయాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో పూర్వ ఇన్సర్వీస్ విద్యార్థిగా పనిచేసిన శ్రీకాంత్ ఒత్తిడి చేసినట్లు విచారణలో గుర్తించారు. ఈక్రమంలోనే కార్తిక్ బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పెద్దఎత్తున నగదు లావాదేవీలు జరిగినట్టు గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. అంతేకాకుండా మరికొన్ని ప్రశ్నాపత్రాల లీకేజీకి సంబంధించిన సమాచారం వెల్లడి కావడం విస్తుగొలిపే అంశంగా మారింది.

మూడో ఏడాది మొదటి సెమిస్టర్ మిడ్ ఎగ్జామ్స్ ప్రశ్నాపత్రాలను సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాలలో పొరుగు సేవల సిబ్బంది అజయ్ లీక్ చేసినట్లుగా తేలింది. అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా గతంలో జరిగిన మరికొన్ని సెమిస్టర్ల ప్రశ్నాపత్రాలను గుర్తించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొన్నేళ్లుగా ఇన్సర్వీస్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ కొనసాగి ఉంటుందనే అనుమానాల నేపథ్యంలో సీఐడీ దర్యాప్తు మరింత ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ దర్యాప్తు కొలిక్కివస్తే మరికొందరి పాత్ర బయటపడే అవకాశాలు ఉన్నాయి.

అసాధారణ రీతిలో మార్కులు రావడంతో : క్లిష్టంగా భావించే ఓ పరీక్షలో ఇన్సర్వీస్ స్టూడెంట్లు అసాధారణ రీతిలో మార్కులు సాధించడం అనుమానాలకు దారి తీసింది. దీంతో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, డీన్ ఝాన్సీరాణి గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన జగిత్యాలలోని వ్యవసాయ కళాశాలలో తనిఖీలు నిర్వహించారు. నవంబర్ 17వ తేదీన జరిగిన ఆ పరీక్షకు సంబంధించి సీసీ కెమెరాలను పరిశీలించడంతో రమేశ్ అనే విద్యార్థి కదలికలు అనుమానస్పదంగా కనిపించాయి. ఈనేపథ్యంలోనే ఎంటమాలజీ హెచ్‌వోడీ నరేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అంజయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎన్.పి.రవికుమార్, సంపత్‌లతో కలిపి విచారణ బృందాన్ని నియమించింది.

ఈ బృందం జనవరి 5న జగిత్యాలకు వెళ్లి విద్యార్థి రమేష్‌ను విచారించింది. అదే కళాశాలకు చెందిన ఇన్సర్వీస్ విద్యార్థి శ్రీనివాస్ తనకు ప్రశ్నాపత్రాల్ని వాట్సప్‌లో పంపించినట్లు రమేశ్ వెల్లడించినట్టు సమాచారం. శ్రీనివాస్ను విచారించగా అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థి దుర్గారావు వాటిని తనకు పంపినట్లు తేలింది. అశ్వారావుపేట కళాశాలకే చెందిన విద్యార్థిని నుంచి తనకు వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలు అందినట్లు దుర్గారావు వెల్లడించారు.

**కేసు దర్యాప్తు ముమ్మరం చేసిన సీఐడీ**

అశ్వారావుపేట విద్యార్థినిని విచారించగా వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన మరో విద్యార్థిని వాట్సప్ లో పంపినట్లు తేలింది. ఇందుకోసం అశ్వారావుపేట కళాశాలలోని పలువురు విద్యార్థుల నుంచి తాను రూ.1.4 లక్షలను వసూలు చేసినట్లు అంగీకరించారు. అందులో నుంచి రూ.80వేలను వరంగల్ కళాశాల విద్యార్థిని బదిలీ చేసినట్లు చెప్పారు. వరంగల్ కళాశాల విద్యార్థినిని విచారించడంతో కార్తిక్ నిర్వాకం బట్టబయలయింది. కార్తిక్ సదరు విద్యార్థినికి వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలను పంపినట్లు తేలింది. వరంగల్ విద్యార్థిని ద్వారానే ప్రశ్నాపత్రాలు వరంగల్, జగిత్యాల, పాలెం, ఆదిలాబాద్, రాజేంద్రనగర్, సిరిసిల్ల, అశ్వారావుపేట కళాశాలల్లోని ఇన్సర్వీస్ విద్యార్థులకు చేరినట్లు అనుమానిస్తున్నారు. మొత్తంగా సీఐడీ ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. త్వరలోనే ఈ వ్యవహారంలో అరెస్టులు చేసే అవకాశం ఉంది.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

# అక్షరం

సోమవారం 16 ఫిబ్రవరి 2026

4

suryaeditpage@gmail.com

## ఆకాశవాణి మన రేడియో




ఆ వాణి ఆకాశవాణి
ఆ వాణి అశరీర వాణి
ఆ వాణి శుభ సుప్రభాత వాణి
దూర వాణి దగ్గరైన వాణి!
ఒకప్పుడు ఆకాశవాణి పలికిందట
జాగ్రత్త పడమని హెచ్చరికలట
పాటించి దుష్యంతుడు ధన్యుడాయే
పాటించక కంసుడు హతుడాయే!
ఆకాశవాణి శ్రవణ యంత్రం
ఆకాశవాణి యంత్రపు ఇచ్ఛంత్రం
ఆకాశవాణి తంత్రులు లేని నిస్తంత్రీ
ఆకాశవాణి నిరంతర ప్రసార స్రవంతి !
ఆకాశవాణి అవని ఆకాశమంత
ఆదిలో ఆకాశవాణి వింత వింత
అందరికీ విజ్ఞానం అందించే వాణి
ఆకాశవాణి ఆదర్శ వాణి !
కనిపించని వారికైనా వినిపించు
కాలాహరణం లేక అనుగ్రహించు
మంచి చెడు విపత్తులు తెలియజేయు
వాతావరణం చెప్పి అప్రమత్తంచేయు!
అప్పటికి ఇప్పటికీ ఎప్పటికీ
అవనిలో అవసరం మనిషి కి
ఆ మార్కోపోలో అందించిన రేడియో
ఆకాశవాణి మన రేడియో !

**పట్లోళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

## మత్తు సంకెళ్లు

కొండల్ని పిండి చేసే పిడికిళ్లవి
అమ్మానాన్నల ఆశల్ని
సాకారం చేసే లేత గుండెలవి
బడి పాఠాలతో బాటు
బతుకు పాఠాలు నేర్చుకునే
భవిష్యత్ భావి తరాలవి...!!
లక్ష్యం కోసం పడాల్సిన అడుగులు
నెమ్మదిగా కదలడం మానేస్తున్నాయ్
పట్టాలు తప్పిన బోగీలా
మరెక్కడికో పరుగులు తీస్తానంటోంది
మస్తిష్కాన్ని శాసిస్తున్న మహమ్మారితో..!!
రంగులు మార్చుకుని మరీ
రంగుల లోకం చూపిస్తానంటూ
మత్తు వలయంలోకి లాగేసుకుంటోంది
విలువలు నేర్పే విద్యాలయాల్లోకి
చాపకింద నీరులా ప్రవేశిస్తోంది...!!
నవ సమాజ నిర్మాణానికి
నాంది పలకాల్సిన యువతరం చుట్టూ
మాదకద్రవ్యాల ఉచ్చు బిగుసుకుంటోంది
అక్షర దివిటీలు పట్టాల్సిన ఆ చేతులు
చీకటి ప్రపంచానికి స్వాగతమంటున్నాయ్...!!
మాష్టార్లు వదిలేసిన బెత్తం
మళ్లీ వెదికి తెచ్చుకుంటామో
తల్లిదండ్రులుగా మన కర్తవ్యాన్ని
మరోసారి గుర్తుచేసుకుంటామో
బిడ్డల చుట్టూ క్రమశిక్షణా
కంచె బిగించాల్సిందే..!!
మత్తు సంకెళ్లు యువతకు పడకముందే
విడుదల నినాదాలతో అడుగులు పడాల్సిందే
భవిష్యత్ తరాలు బాగుండాలంటే
మత్తు వదిలే దాకా యుద్ధం చేయాల్సిందే..!!

**యు.ఎల్.ఎన్.సింహా 7702280542**

## తనయుడు - తలకొరివి



నిలువ నీడ లేకుండా తరిమి
అమ్మను ఇంట్లోంచి గెంటేస్తాడు
తల్లి శవానికి గొడుగు పడతాడు !
కన్నతల్లికి అన్నం పెట్టని పుత్రుడు..
కర్మకాండలకు ఊరంతా పిలిచి
తిండి తాగుడు వరద పారిస్తాడు !
అవ్వకు చిల్లిగవ్వ కూడా ఇవ్వనోడు
శవయాత్రలో నోట్లు కుమ్మరిస్తాడు
డప్పు శ్రామికులకు అడిగినంత ఇచ్చేస్తాడు !
అమ్మకు నరకం చూపిన కొడుకు
అట్టహాసంగా గుంపుగా కదిలి..
అస్తికలను కాశీలో కలుపుతడు !
జనని కాళ్లకు దండం పెట్టనోడు
తల్లి ఫోటోకు గొప్ప దండ వేస్తాడు
అగరోత్తుల ధూపదీపం వెలిగిస్తాడు !
అమ్మంటే కన్న పేగని మరిచి..
తల్లంటే తొలి దైవమని మరిచి..
పాలు తాగిన రొమ్ముల్ని తన్నేస్తాడు !
బతికుండగానే మాతృమూర్తికి
తలకొరివి పెట్టినంత పని చేస్తాడు..
నడవంత్రపు డిజిటల్ ఏఐ నరుడు !

**మధుపాళీ 9949700037**

## మౌనానికీ భాష ఉన్నదని గుర్తుచేసే 'ఆనందమాయే సఖి'

**(సంభాషణల నేపథ్యంగా స్త్రీ అంతర్ముఖ జీవితం.)**




సృజన వావిలపల్లి రచించిన 'ఆనందమాయే సఖి' నవల మైథిలి జీవితాన్ని కేంద్రంగా చేసుకుని సాగుతుంది. ఆమె చుట్టూ ఉన్న అనన్య, నేత్రలతో ఏర్పడే స్నేహ సంబంధాలు, వాటి మధ్య చోటు చేసుకునే మాటలు--మౌనాలే ఈ కథకు ఆధారం. ఇది స్పష్టమైన ఆరంభం-ముగింపు ఉన్న సంఘటనల కథ కాదు. జీవితం అనుభవంగా ఎలా రూపుదిద్దుకుంటుందో అలా ప్రవహించే కథ.స్త్రీ తనను తాను అర్థం చేసుకునే ప్రయాణమే ఈ నవల ప్రధాన కథాంశం.

ఈ కథను రచయిత నాటకీయ మలుపులతో కాకుండా, సంభాషణల సహజ ప్రవాహంతో నిర్మించారు. మైథిలి--అనన్య--నేత్రల మధ్య జరిగే మాటలే కథగా మారుతాయి. మాటలతో పాటు మాటల మధ్య మిగిలే నిశ్శబ్దం కూడా ఇక్కడ భావవ్యక్తీకరణలో భాగమవుతుంది.మైథిలి పాత్ర నవలకి భావాత్మక కేంద్రం. ఆమె మాటలు తక్కువ, మౌనం ఎక్కువ. అనన్య అడిగే ప్రశ్నలకు ఆమె నేరుగా సమాధానం ఇవ్వదు. కానీ ఆ మౌనమే ఆమె జీవన దృక్కోణాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. ఇది లొంగుబాటు కాదు; అనుభవం నేర్పిన ఒక రకమైన అవగాహన. స్త్రీ బలం ఎప్పుడూ ఘోషగా ఉండనక్కర్లేదన్న భావాన్ని ఈ పాత్ర మృదువుగా ప్రతిపాదిస్తుంది.

అనన్య సంభాషణలు ప్రశ్నలుగా నిలుస్తాయి. "ఎందుకు?" అనే ప్రశ్న ఆమె మాటల్లో ప్రత్యక్షంగా వినిపించకపోయినా, ప్రతి సంభాషణలో అంతర్లీనంగా ఉంటుంది. స్త్రీ తన భావాలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఎందుకు?తన జీవితాన్ని సమర్థించుకోవాల్సిన అవసరం ఎందుకు ? అనే సందేహాలు ఆమె మాటల ద్వారా పాఠకుడి ముందుకు వస్తాయి. అయితే ఈ పాత్రను రచయిత అతివాద పాత్రగా మలచరు; ఆమె మాటల్లో సందిగ్ధత, ఆత్మపరిశీలన సహజంగానే కనిపిస్తాయి. నేత్ర పాత్ర ఈ రెండు ధ్రువాల మధ్య సమతుల్యతను సూచిస్తుంది. ఆమె సంభాషణల్లో రాజీ ఉంది; కానీ ఆ రాజీ వెనుక ఉన్న అలసట కూడా స్పష్టమే. మైథిలితో మాట్లాడేటప్పుడు ఆమె మౌనాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే, అనన్యతో మాట్లాడేటప్పుడు ప్రశ్నల తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేస్తుంది. ఈ ద్వంద్వ స్వభావమే నేత్ర పాత్రను సహజంగా నిలబెడుతుంది. నవలలోని పురుష పాత్రలు కేంద్రంగా నిలబడవు.వారు సంఘటనలను నడిపించే శక్తులుగా కాక, స్త్రీల జీవితాలను ప్రభావితం చేసే నేపథ్య స్వరాలుగానే కనిపిస్తారు. సంబంధాల్లోని అపార్థాలు,ఆశలు, పరిమితులను అవి సూచిస్తాయి గానీ, కథను ఆక్రమించవు.ఈ పరిమిత హాజరే స్త్రీల అంతర్ముఖ ప్రపంచానికి నవలలో ఉన్న ప్రాధాన్యాన్ని మరింత స్పష్టం చేస్తుంది. రచనా శైలిలో సృజన వావిలపల్లి సరళమైన భాషను, సంక్షిప్త సంభాషణలను ఎంచుకున్నారు. ఉపదేశానికి పోకుండా, చిన్న మాటలతోనే లోతైన భావాన్ని వ్యక్తపరచడం ఆమె శైలిలో ముఖ్య లక్షణం. అవసరమైన చోట కథను క్షణకాలం ఆపి, పాత్రల అంతర్ముఖ స్థితిలోకి పాఠకుడిని తీసుకెళ్లగలగడం ఈ నవల ప్రత్యేకత.

'ఆనందమాయె సఖి'లో స్త్రీవాదం ప్రధానంగా రాదు.అది సంభాషణల సహజ ప్రవాహంలో అంతర్లీనంగా వ్యక్తమవుతుంది.మైథిలి మౌనం,అనన్య ప్రశ్న, నేత్ర రాజీ- ఈ మూడూ కలిసి స్త్రీ అనుభవానికి ఒక సమగ్ర సాహిత్య రూపాన్ని ఇస్తాయి.

మొత్తంగా, 'ఆనందమాయే సఖి' శబ్దం చేసే నవల కాదు. మెల్లగా చదవాల్సిన, ఆలోచనకు ఆహ్వానం పలికే నవల. సమకాలీన తెలుగు నవలా సాహిత్యంలో ఒక సున్నితమైన, ఆత్మపరిశీలనాత్మక రచనగా ఇది తన స్థానాన్ని సంపాదించుకుంటుంది.

**-మర్రాపు వసుంధరా దేవి, టీచర్,7901355395.**

# శివకేశవుల జీవాయుధ పోరాటం- బాణాసుర ఘట్టం

## శ్రీ మహాభాగవత కథ-73



**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**

**కం॥ చదివెడిది భాగవతమిది,**
**చదివించును కృష్ణు, దమృతఝరి పోతనయున్**
**చదివినను ముక్తి కలుగును,**
**చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై**



శ్రీ మహాభాగవతం, దశమ స్కందం ఉత్తర భాగంలో బాణాసుర ఘట్టం అత్యంత మనోహరంగా, ఆహ్లాదకరంగా రచించారు పోతన. ఈశ్వర వరప్రసాది అయిన బాణాసురుడి కథ అత్యంత కమనీయంగా ఉంటుంది భాగవతంలో. ఇందులో శ్రీకృష్ణుడు (విష్ణువు, శ్రీహరి, కేశవుడు), శివుడు ఒకానొక సందర్భంలో 'శివజ్వరం', 'వైష్ణవజ్వరం' అనే రెండు జీవాయుధాలను ఒకరి మీద మరొకరు ప్రయోగించుకుంటారు. చివరకు కథ సుఖాంతం అవుతుంది.

బలి చక్రవర్తి నూర్గురు కుమారులలో మొదటివాడు బాణుడు. అతడు అఖండ శివ భక్తుడు. అతడు శివుడిని ప్రార్థించి, ఆయన వరం కోరుకొమ్మంటే, తన పురం కోట వాకిటి ముందు కావలిగా ఉండి, తనను అహర్నిశరక్షించాలని అడిగాడు. బాణుడి కోరిక మన్నించిన పరమ శివుడు,పార్వతీదేవితో సహా, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి వెంటరాగా, ప్రమథ గణాలను తీసుకుని బాణుడి నివాస స్థలమైన శోణపురం కోటవాకిటిలో రక్షకుడిగా నివాసం ఏర్పరుచుకున్నాడు. తనతో పోరాడగలిగే శక్తి సామర్థ్యాఉన్నవారెవ్వరైనా వున్నారా అని అహంకారంతో శివుడిని అడిగాడు బాణుడు ఒకనాడు. బాణుడి జెండా ఎప్పుడైతే అకారణంగా నేలకూతుందో అప్పుడు జరగబోయే యుద్ధంలో అతడి వేయి చేతునరకబడుతాయని, ఆయన గర్వం కూడా అణగారుతుందని చెప్పాడు శివుడు. అప్పటి నుంచీ ఆ సమయం కోసం ఎదురు చూడసాగాడు బాణుడు. బాణుడికి ఉషాకన్య అనే కూతురు ఉన్నది. ఆమె అతిలోక సౌందర్యవతి. ఆమెకు ఒకనాడు నిద్రలో ఒక మంచి కల వచ్చింది. ఆ కలలో అసమాన సౌందర్య వంతుడైన రుక్మిణీ-శ్రీకృష్ణుడి మనుమడు, ప్రద్యుమ్నుడి కుమారుడు, అనిరుద్ధుడు ఆమెను కలిసి సుఖించినట్లు ఆమె భావించింది. అతడి కోసం తపించ సాగింది. ఆమె స్నేహితురా, బాణుడి మహామంత్రి కూతురు చిత్రరేఖ తన నేర్పరితనంతో ఎందరివో రూపురేఖా చిత్రాలను గీచి ఆమెకు చూపించింది. అందులో అనిరుద్ధుడి చిత్రాన్ని గుర్తుపట్టింది ఉషాకన్య. అతడే తన మానధనాన్ని దోచుకున్న దొంగ అని చెప్పింది. చిత్రరేఖ తనకు తెలిసిన విద్యతో అతడి గురించిన వివరాలన్నే చెప్పింది స్నేహితురాలికి. తను త్వరగా వెళ్లి అనిరుద్ధకుమారుడిని ఉషాకన్య దగ్గరికి తీసుకువస్తానని హామీ ఇచ్చింది.

ఇలా చెప్పిన చిత్రరేఖ ఆకాశగమనంలో శ్రీకృష్ణుడి పట్టణానికి వెళ్లింది. మారువేషంలో రాత్రివేళ ద్వారకా నగరంలో ప్రవేశించింది. అనిరుద్ధుడు తన గదిలో హంసతూలికా తల్పం మీద అలసిపోయి నిద్రపోవడం చూసి అతడిని సమీపించింది. తన యోగమహిమతో అతడిని ఎత్తుకుని మనోవేగంతో ఉషాకన్య నివసించే మందిరానికి చేరుకొని ఆమె పాన్పుమీద అనిరుద్ధుడిని పడుకోబెట్టి వెళ్లిపోయింది.

కొంతసేపటికి అంతఃపురంలో, ఉషాకన్య మందిరంలో నిద్రిస్తున్న అనిరుద్ధుడు నిద్ర మేల్కొని ఉషాకన్యను చూశాడు. విషయం అర్థమైంది. ఆమెను కౌగలించుకుని, సరసమైన మాటలతో వినోదపర్చి, మదన క్రీడలో ఆమెతో సుఖించాడు. రాత్రి-పగఅనేది తెలియకుండా వారిద్దరూ భోగాలాలసులై కొంతకాలం సుఖించారు. వారి సంతోషానికి చిహ్నంగా ఉషాకన్య గర్భం దాల్చింది. పరిచారికలకు విషయం అర్థం కాలేదుకాని, ఆమె గర్భందాల్చిన సంగతి అర్థమైంది. బాణాసురుడికి ఈ విషయం చెప్పారు. కోపోద్రిక్తుడైన బాణాసురుడు అనిరుద్ధుడిని నాగాపాశంతో బంధించాడు. కారాగారంలో పెట్టాడు. సరిగ్గా అదే సమయంలో పెద్ద సుడిగాలి వీచి బాణుడి విశాలమైన ధ్వజం కూలి నేలమీద పడింది. తనకు సరైన జోడీతో యుద్ధం జరగ బోతున్నదని బాణుడు సంతోషించాడు.

నారదుడి ద్వారా ఈ విషయమంతా తెలుసుకున్న కృష్ణుడు ఒక శుభ ముహూర్తాన బాణాసురుడి మీదికి దండయాత్రకు బయల్దేరాడు. వెళ్లీ-వెళ్లగానే శోణపురం నగరాన్ని ధ్వంసం చేసింది యాదవ సైన్యం. శ్రీకృష్ణుడి దండయాత్ర తెలుసుకున్న బాణాసురుడు ఆయనమీదకు యుద్ధానికి వెళ్లాడు. ఆయన నగరానికి రక్షకుడుగా కాపలా వున్న పరమ శివుడు బాణుడు యుద్ధానికి వెళ్లడం చూశాడు. బాణుడికి సహాయంగా ఆయన కూడా రణరంగానికి తరలి వెళ్లాడు. శివుడు, కృష్ణుడు ఒకరితో మరొకరు తలపడ్డారు. అయితే కృష్ణుడి శౌర్య ప్రతాపాలను శివుడు సహించలేకపోయాడు. చివరకు బ్రహ్మాస్త్రాన్ని కూడా శ్రీకృష్ణుడి మీద ప్రయోగించాడు శివుడు. దాన్ని శ్రీకృష్ణుడు అద్భుతంగా ఉపశమింప చేశాడు. వెంటనే శివుడు వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. దాన్ని పర్వతాస్త్రంతో తుంచి వేశాడు కృష్ణుడు. ఆ తరువాత వేసిన ఆగ్నేయాస్త్రాన్ని కూడా ఐంద్ర బాణంతో రూపుమాపాడు. మహేశ్వరుడు కోపం ఆపుకోలేక శ్రీకృష్ణుడి మీద పాశుపతాస్త్రాన్ని సంధించి ప్రయోగించాడు. నారాయణాస్త్రాన్ని వేసి పాశుపతాస్త్రాన్ని వెనుకకు మరలించాడు శ్రీకృష్ణుడు. తన అస్త్రాలన్నీ నిష్ఫలం కావడంతో ఉత్సాహాన్ని కోల్పోయిన శివుడి మీద శ్రీకృష్ణుడు సమ్మోహనాస్త్రాన్ని వదలడంతో ఆయన సోలిపోయాడు. నందీశ్వరుడి మూపురం మీద వాలిపోయాడు శివుడు. తక్షణమే శ్రీకృష్ణుడు వీరవిహారం చేస్తూ బాణాసురుడి సమస్త సైన్యాన్ని పరిమార్చాడు. ఇలా జరగడంతో క్రోధావేశంతో బాణాసురుడు తన రథాన్ని కృష్ణుడి మీదకు తోలాడు. కృష్ణుడితో గర్వం కొద్దీ తలపడ్డాడు తన వేయి చేతులతో. అయితే అతడు బాణ ప్రయోగం చేసే లోపునే కృష్ణుడు బాణుడి రథసారథిని చంపి, రథాన్ని ముక్కముక్కగా చేశాడు. కృష్ణుడి అఖండ పరాక్రమానికి బాణాసురుడు భయపడిపోయాడు. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. తనకు జరిగిన అవమానానికి రాచనగరులోకి పారిపోయాడు.

సరిగ్గా ఆ సమయంలోనే శివ-కేశవుల మధ్య 'జీవాయుధ యుద్ధం' చోటు చేసుకుంది. మూడు తలల, మూడు పాదాల, భయంకరాకారం కలిగి, కోపావేశంతో 'శివజ్వరం' (శివుడి జీవాయుధం) కృష్ణుడి దగ్గరకు వచ్చింది. అలా వచ్చిన దాన్ని చూసిన కృష్ణుడు ఒక నవ్వు నవ్వాడు. వెంటనే (తన జీవాయుధమైన) 'వైష్ణవజ్వరాన్ని' 'శివజ్వరం' మీదికి ప్రయోగించాడు. శివవైష్ణవ జ్వరారెండూ తమ బలాన్ని, శక్తిని, శౌర్యాన్ని, ప్రతాపాన్నీ ప్రదర్శిస్తూ ఘోరంగా యుద్ధం చేశాయి. భయంకరమైన వైష్ణవజ్వరం ముందు శైవజ్వరం ఓడిపోయి పారిపోయింది. వైష్ణవజ్వరం అంతటితో ఆగకుండా శైవజ్వరం వెంట పడి మరీ తరిమి కొట్టింది.

అలా తరుముతుంటే శివజ్వరానికి పారిపోవడానికి ఏ దిక్కూ కనబడలేదు. దాంతో దానికి ప్రాణభీతి పట్టుకుని, కృష్ణుడి పాదాలమీద పడి తన్ను కాపాడమని వేడుకుంది. కృష్ణుడిని అనేక విధాల స్తుతించింది. అవ్యయుడివి అనీ, పాపరహితుడివి అనీ, ఈశ్వరుడివి అనీ, సృష్టి-స్థితి-లయ కారకుడివి అనీ, పరబ్రహ్మ స్వరూపిడివి అనీ, ఆదిమధ్యాంతరహితుడివి అనీ అనేక విధాల స్తుతించి 'నీవే శరణు నాకు' అని వేడుకుంది శివజ్వరం. ఆ స్తోత్రానికి కృష్ణుడు-విష్ణుమూర్తి-శ్రీహరి ప్రసన్నమైనాడు. తన శరణు జొచ్చింది కాబట్టి తన వైష్ణవజ్వరం దాన్ని బాధించదని చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు: "ఎవరైనా ఈ శైవ-వైష్ణవ జ్వర వివాదాన్ని, శివజ్వరం శరణు కోరిన విధానాన్ని, మనస్సులో తలిస్తే వారికి చలిజ్వరం కాని, ఉష్ణజ్వరం కాని రావు". ఇలా శ్రీకృష్ణుడు చెప్పగానే ఆ శివజ్వరం అనే జీవాయుధం పరమానందంతో పరమాత్ముడికి సాష్టాంగ నమస్కారం చేసి వెళ్లిపోయింది.

"ఇక్కడ శివకేశవ భేదాచూపించారని అనుకోవడం పొరపాటు. 'శివాయ విష్ణురూపాయ' అనే మాట యజుర్వేదంలో కనిపిస్తుంది. ఇది శివకేశవుల అభేదాన్ని తెలియచేస్తుంది. 'శివ' శబ్దానికి త్రిగుణాతీతుడు, శుభస్వరూపుడు అనే అర్థాలు. 'విష్ణు' అంటే వ్యాపించినవాడు. త్రిగుణాతీతమైన, మంగళకరమైన ఈశ్వర చైతన్యం 'శివుడు' కాగా, విశ్వమంతా వ్యాపించితే 'విష్ణువు' అవుతుంది. అదే 'శివాయ విష్ణురూపాయ'. శివకేశవులకు, శివపురాణం అనీ, విష్ణుపురాణం అనీ ప్రత్యేక పురాణాఉన్నప్పటికీ వారిరువురి అర్థం తెలిస్తే భేదభావం ఉండదు. భగవంతుడు కలహించడు. కలహం మతవాదుల మధ్యనే. 'చేతులారంగ శివుని పూజించడేని', 'నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని' అని అంటారు.

అంటే: చేతులారా శివుని పూజించి, నోటితో హరికీర్తన చేయమంటూ పోతన పద్యకవితలోని అంతరార్థం ఇదే. శివుడు శ్రీరామనామరసికుడు, విష్ణు వల్లభుడు. ఒకరినొకరు గౌరవిం చుకున్నారంటే అర్థం, ఒకరికంటే ఇంకొకరు తక్కువనీ, ఎక్కువనీ కాదు. ఇద్దరూ సమానమేననీ, లోక నిర్వహణ కోసం రెండుగా వ్యక్తమైన ఒకే తత్త్వమని అర్థం".

ఇదిలా వుండగా యుద్ధరంగం నుండి పారిపోయిన బాణాసురుడు మరింత బలం చేకూర్చుకుని దివ్యాయుదాలను ధరించి, మళ్లీ యుద్ధం చేయాలన్న ఆలోచనతో, పట్టుదలతో కదన రంగానికి వచ్చాడు రెండో సారి. వచ్చీరావడంతోనే కృష్ణుడితో తలపడ్డాడు. కృష్ణుడు ఆలశ్యం చేయకుండా తన సుదర్శన చక్రాన్ని బాణాసురుడి మీద ప్రయోగించాడు. అది పోయి బాణుడు వేయి చేతులలో నాగు మాత్రం మిగిల్చి మిగిలిన వాటన్నింటినీ నరికి వేసింది. సుదర్శన చక్రం అలా బాణుడి చేతునరికి వేయగానే అతడి మీద వాత్సల్యం వున్న పరమేశ్వరుడు కృష్ణుడి దగ్గరకు వచ్చి, ఆయన్ను స్తోత్రం చేశాడు పలువిధాగా. శ్రీహరి-శ్రీకృష్ణుడు శివుడిని అభినందించి, ఆయన కోరికేదో చెప్పమన్నాడు. ఆయన ప్రియ భక్తుడైన బాణుడిని చంపడం లేదన్నాడు. అదే తన కోరికగా శివుడు చెప్పాడు. తదనంతరం బాణాసురుడు శోణపురానికి పోయి తన కుమార్తె అయిన ఉషాకన్యకు, అనిరుద్ధుడికి బంగారు ఆభరణాఇచ్చి,ఇద్దరినీ తీసుకువచ్చి శ్రీకృష్ణుడికి అప్పగించాడు.

ఆ తరువాత శ్రీకృష్ణుడు ద్వారకానగరానికి బయల్దేరాడు. అనిరుద్ధుడిని ముందు పెట్టుకుని ద్వారకకు చేరాడు. వారందరికీ బ్రాహ్మణోత్తముశు భాశీస్సులందించారు. శ్రీకృష్ణుడు నిజనివాసంలో సుఖంగా కాలం గడిపాడు.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం, రామకృష్ణ మఠం ప్రచురణ ఆధారంగా)**

## మనోహరం మార్మికం- కబీర్ కవిత్వం




కవి కథకుడు లలిత గీతాల రచయిత గాయకుడు అయిన తిరువాయిపాటి రాజగోపాల్ బ్యాంకు ఉద్యోగిగా ఉద్యోగ విరమణ చేసిన సారస్వతాభిమాని. ఆంగ్లంలో స్నాతకోత్తర విద్యను అభ్యసించినా, మాతృభాష తెలుగుపై మమకారం, ఆ నుడికారపు సొంపు సొబగులు తెలిసిన వాడిగా వివిధ ప్రక్రియలలో రచనలు చేస్తూ ఇప్పుడు 100 కబీర్ కవితలు శీర్షికన వెలువరించిన పుస్తకం ఇది. ఇవి రవీంద్రనాథ్ టాగోర్ ఆంగ్ల అనువాదానికి తెలుగు సంస్కరణ. అటు కబీర్-ఇటు టాగూర్ ఇద్దరూ జగత్ప్రసిద్ధులైన కవులే. రవీంద్రుని ఆంగ్లానువాదం పట్ల ముచ్చటపడిన రాజగోపాల్ వీటిని మనోహరం మార్మికం అనే ఉపనామంతో తెనిగించి ఆ ఇరువురి కృతులను మరొకసారి ఇప్పటి తరం సాహితీ ప్రియులకు అందజేశారు,చేరువ చేశారు.

ఊరూరా సంచరిస్తూ పదాలు పాడుకునే సాధువుల నుండి కబీర్ తత్వ గీతాలు సేకరించమని తన మిత్రుడైన క్షితిమోహన్ సేన్ ను కోరి, అందు నుంచి తనే ఎంచుకున్న 100 కబీర్ దోహాలను ఆంగ్లంలోకి అనువదించడం ద్వారా కబీర్ ను విశ్వసాహితీ ప్రియులకు చేరువు చేశారు టాగోర్. పరిశీలన చేసి చూస్తే వీరిరువులోని భక్తితత్వం సామీప్యంగా ఉండడం చేతనే గీతాంజలి లోనూ, పోలిక కలిగిన భావాలు పాఠకులకు కనిపిస్తాయి. లౌకిక ప్రపంచంలో జీవిస్తున్న సామాన్య జనంతో కలిసి జీవిస్తూ తమ తమ వృత్తులను కొనసాగిస్తూ శిష్యులకు తత్వ బోధ చేయగా వారు ఆ బోధనలను జనంలోకి తీసుకువెళ్లి, బహుళ ప్రచారం కల్పిస్తారు. వారే అప్పటి సమాచార మాధ్యమ సారథులు.

ఎప్పటినుంచో చర్చించబడుతున్న విషయాలు.. మనిషి జన్మ పునర్జన్మ, ఆత్మ పరమాత్మ, స్వర్గం నరకం వంటి భావనలు మనిషి మేథ నుండి ఉత్పన్నమైన వాటిని, అప్పటి సమాజంలో మనిషి జీవితాన్ని నియబద్ధం చేయడానికే మతాలు పుట్టాయని ముందుమాట రాసిన దుర్గెంపూడి చంద్రశేఖర్ రెడ్డి (ఎమెస్కో) అభిప్రాయాన్ని అందరూ సమర్థిస్తారు. జీవితం, శరీరం, నశించిపోయే వాటి పట్ల మమకారం కూడదని తత్వవేత్తలు పదేపదే చెప్తుంటారు. అందుకే వారి రచనల్లో వేదాల నుంచి.. వివిధ ప్రవక్తల సిద్ధాంతసూత్రీకరణల సారాన్ని, అందులోని ఏకరూపకతను సారమతులు స్వీకరిస్తూ ఉంటారు.

1913లో నోబెల్ పురస్కారం పొందిన టాగూర్ 1915లో ఆంగ్లంలోకి అనువదించిన 100 కబీర్ కవితలను రాజగోపాల్ తెలుగులోకి అనువదించిన సందర్భంలో వారి ఇరువురిలోని నిగూఢ సంకేతాత్మక వ్యక్తికరణలో.. ఏ భావం కబీర్ ది,ఏది టాగోర్ ది అనే సన్నని విభజన రేఖ పలుచోట్ల కనుమరుగు కావడం కనిపిస్తుంది. ప్రధానంగా టాగోర్ అనువాదాన్నే తన తెలుగు అనువాదానికి ఎంపిక చేసుకున్నాడు రాజగోపాల్. అందుకే ఆ సృజన, సంయోజనల భావ ప్రకటన మరింత సరళంగా తెలుగు పాఠకులను ఈ పుస్తక రూపంలో అలరిస్తుంది. కబీరు తెలియకపోయినా రవీంద్రుని రచనలు చదవకపోయినా, ఈ తెలుగు కవితానువాదం ద్వారా అదే స్వారస్యాన్ని పాఠకులు పొందుతారు. మొదట కబీర్ మూల రచన, ఆ తరువాత తన తెలుగు అనువాదం చివరగా టాగోర్ ఆంగ్లనువాదాన్ని ఇవ్వడం ద్వారా అవసరమైన సందర్భాలలో అటు ఇటు పరికిస్తూ పరిశీలన చేస్తూ రాజగోపాల్ అనువదించిన సరళమైన శైలిలో నిరాటంకంగా చదువుతూ ముందుకు వెళ్తారు పాంకులు. అందువల్లనే మద్యయుగపు కబీర్ మండలిక హిందీలోని మార్మికతను పరిహరించి సాగిన ఆంగ్ల అనువాదం.. తెలుగులో మరింత సరళతరంగా శుభోదకంగా తయారుకావడంతో పాటు ఎక్కడా వెతుక్కోవలసిన అవసరం రాదు. రవీంద్రనాథ్ టాగోర్ తన అనువాదంలో కవిత్వ బద్ధంగాను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అనుసృజన చేశారు. కబీర్ అంతరాత్మ దేన్నయితే పలికిందో దాన్ని అక్షరబద్ధం చేశారు. అసలు కబీర్ కవిత్వమే మట్టి వాసనతో ప్రాంతీయ హిందీ పలుకుబడితో మద్యయుగపు భారతీయ సమాజాన్ని తన దోహాలలో ప్రతిధ్వనింప చేశాడు టాగోర్. దాన్నే విశ్వాధ్యాత్మిక భాషలోకి తర్జుమా చేసాడు. స్థానికమైన ఉదాహరణలు తొలగించి కాలంతో నిమిత్తం లేని అహం, మాయ, ఆంతరికమైన స్వచ్ఛ భక్తి, ఏకేశ్వర వాదంతో నింపి, కబీర్ ఇప్పటి ఆధునిక చదువరితో నేరుగా మాట్లాడుతున్నట్లు రాశారు. ఉపనిషత్తులచే ప్రభావితమైన దృక్పథంతోనే ఆత్మ లోపలి కాంతిని దర్శించాలని, సంప్రదాయికతలోని డొల్లతనాన్ని తిరస్కరించాడు. దీనివల్ల అటు కబీర్ నిర్గుణ భక్తిని ఇటు ఉపనిషదాత్మతో సంధానపరిచాడు టాగోర్. కబీర్ దోహాలలోని క్లుప్తత, లయాత్మక ధారా ప్రవాహకతకు భంగం రాకుండా జాగ్రత్త వహిం చాడు. అందువల్లనే అనువాదాన్ని కూడా పాటలా పాడుకునే తీరుని విడిచిపెట్టలేదు టాగోర్.

కబీర్ లోని మానవతాయోగిని ప్రేమ సహానుభూతులను, మతపరంగా విడిపోవడాన్ని ఖండిస్తూ మతానికతీతమైన మానవ ఆత్మగౌరవాన్ని సమర్థిస్తూ కబీర్ ఆధ్యాత్మిక ప్రజాస్వామ్య గొంతుకను అనువాదంలో ప్రతిఫలించేలా రాశారు టాగోర్. అందువల్లే కబీర్ దోహాల్లోని కటువైన వ్యంగాన్ని, ముతక బారిన జానపద ప్రయోగాల్ని మార్చడం వల్ల.. అది మృదువుగా ఉండి సంఘర్షణ ధోరణికి భిన్నంగా ఉంటాయి. తన అనువాదం ద్వారా, కబీర్ ఆధ్యాత్మిక భావాలకు విశ్వసాహిత్యంలో చోటు కల్పించారు టాగోర్. ఇప్పుడు రాజగోపాల్ అనువాద శైలిని పరిచయం చేస్తూ కబీర్ ని కూడా ఈ అనువాద సులోచనాల సహాయంతో అతడి మార్మిక తాత్విక సారాన్ని కూడా వడగొట్టబడిన పళ్ళరసంగా కొంత రుచి చూద్దాం.

అనువాదం అనుసృజనగా రాణించాలంటే భాషపై పట్టు అభివ్యక్తీరణలో సహజత్వం, ప్రాస లేదా రిథమ్ ఉంటే.. తప్పక అది చదివిస్తుంది, గుర్తుపెట్టుకునేలా చేస్తుంది. రాజగోపాల్ అనువాదానికి కొన్ని ఉదాహరణలు మచ్చుతునకలుగా.. ,/యావత్ శ్వాసకు శ్వాస దైవం./పురాణాలైనా, కురాన్ అయినా కేవలం పదకోశాలవి. యవనికలు తొలగించి నేను దర్శించాను. /అనుభవాల పదాలకు కబీర్ శబ్ద రూపం ఇస్తున్నాడు.. తక్కినవన్నీ సత్యదూరాలని అతడికి తెలుసు. /ప్రేమ త్యాగం చవిచూసిన వాడు మృత్యువుకేసి దిగిరాడు.

తెలుగు భాష పై ఉన్న మమకారాన్ని ఆంగ్లభాషపై కూడా ఆపాదించుకొని రెంటి మధ్య సమన్వయం సమకూర్చుకుని అన్వయ క్లిష్టత రాకుండా చూసుకోవడం తెలిసిన కవి.. ఆంగ్లంపై, రవీంద్రునిపై ఉన్న ప్రేమను అభిమానాన్ని కలగలిపి కబీర్ ఆంగ్లానువాదానికి తెలుగు చేసి రాజగోపాల్ తన కవిత్వాభిరుచిని అనుసృజన లోనికి పంపి పాఠకుడికి ఆధ్యాత్మిక అమృత రసాస్వాదనకు వీలు కల్పించాడు రాజగోపాల్. ప్రవాహ వాలులో సులభంగా సాగిపోయినట్లు 100 కవితలు సునాయాసంగా చదువుతారు పాఠకులు. భాష మనోహరంగా ఉంటే భావం హృదయ పీఠికపై తిష్ట వేస్తుంది. కబీర్ కు రవీంద్రుని అనువాదం రాజగోపాల్ అనుసృజన ధార్మిక మార్మికతను అనావరణం చేసి తాదాత్మ్యానికి చేరువ చేస్తుంది.

**మల్లేశ్వరరావు ఆకుల**
**79818 72655.**

## మానవీయ విలువలకు మాగాణి జగమంత కుటుంబం

**(శారద కావూరి గారి కథలు – సమీక్ష)**

కొత్త పుస్తకం అంటే కొత్త స్నేహం దొరికినట్టే భావన కలిగే పుస్తకాల ప్రియులకు విరివిగా వస్తున్న కొత్త పుస్తకాల ఆవిష్కరణలు మరింత ఉత్సాహం తెప్పిస్తున్నాయి ఇటీవల బుక్ ఫెయిర్ పండగకు వెళ్లిన నేను 'శారద కావూరి' గారి జగమంతా కుటుంబం (కథలు) అనే కొత్త పుస్తకంతో పాటు మరికొన్నిపుస్తకాలు కొనడం జరిగింది ఇకపోతే ఈ 'జగమంత కుటుంబం' కథల పుస్తకంలో మొత్తం పన్నెండు ఆణి ముత్యాల్లాంటి నేటి సమాజానికి పనికొచ్చే అద్భుతమైన కథలను రచయిత్రి తన అనుభవసారం నుండి సమాజం లోతులకు వెళ్లి ఆచితూచి రాసిన అక్షరాల సమాహారంగా అనిపించింది ఈ మధ్య కాలంలో ఏకబిగిన నాతో చదివించిన మంచి పుస్తకం ఇది. ఇకపోతే కథల్లోకి వెళితే మొదటి కథ 'క్షమాచాయ'లో ఒక దొంగను మార్చడానికి మానవత్వంతో 'కొండా' తీసుకున్న నిర్ణయంతో ముడిపడి రచించిన ఈ కథలో 'కొండా' లాంటి వారు సమాజానికి ఎంత అవసరమో చూపిస్తూ రాసిన కొన్ని వాఖ్యాలు హృదయాన్ని చలింపచేస్తాయి.

'మెరుపు ఎప్పుడూ ఒక సరళరేఖలా భూమిని తాకదు...' అంటూ మొదలయ్యే 'అబ్బా' కథలో కులమతాలు ఏవైతేనేమి ప్రేమలు, బంధాలు, రాగద్వేషాలు, స్వార్థం మొదలైనవి కుటుంబంలో సమానంగానే ఉంటాయి తండ్రి కొడుకుల మధ్య అనుబంధంతో పాటు కుటుంబ విలువలు, అసూయలు, పొరపొచ్చాలు ఎలా వుంటాయో తెలియజేస్తూ చివరకు అనారోగ్యంతో మంచాన పడ్డ తండ్రి ఆరోగ్యం క్షీణిస్తుంటే పెరుగుతున్న భయాలు భారంగా మారకూడదన్న తపన, కొంచెం సమయం, ఒక మాట, ఒక స్పర్శ కోసం ఎదురుచూసే తండ్రి కోసం కొడుకు తీసుకున్న కీలక నిర్ణయాలు ఈ కథలో తనదైన శైలిలో వినూత్నంగా ఆవిష్కరించారు 'శారద కావూరి' గారు, అలాగే ఇక 'సమ్మయ్య...' కథలో మా ఊరు గోదావరిఖని నేపథ్యంలో సింగరేణి బొగ్గుగని కార్మికుల బండకింది బతుకులను వారి మనోభావాల్ని, కుటుంబ పరిస్థితులను, పని స్థలాలను, యాజమాన్య తీరుతెన్నులు, కార్మిక కష్టాలను క్లుప్తంగా అయినా కళ్ళకు కట్టినట్టుగా సుత్తి లేకుండా సూటిగా చెప్పడం ప్రత్యేకంగా అనిపించింది.

కరోనా కాలంలో హాస్పటల్ వాతావరణంతో కూడిన 'గ్రేస్' కథలో అమ్మకు అనారోగ్య చికిత్సలో తోడుగా వున్న 'గ్రేసియానా' సిస్టర్ సేవలను కొనియాడుతూ వస్తువుల కంటే విలువైన మాటలు ఎంత ముఖ్యమో తెలియజేస్తూ మానవీయ కోణంలో సాగే 'గ్రేస్' కథ మంచి సందేశంతో ముగుస్తుంది. జీవితంలో ఎన్ని కష్టాలు, ఆవేశాలు, వేదనలు ఉన్నా, చీకటిగా అనిపించే ఏకాంతంలో కూడా తోడుగా ఒకరు (భౌతికంగా లేకపోయినప్పటికీ) ఉంటే అదొక గొప్ప భాగ్యం అది జీవితానికి అసలైన ఆనందం, రెండు మనసుల మధ్య మూగ ప్రేమలో సోమయ్య అనుభవాలతో కూడిన కథ 'చీకటి మూసిన ఏకాంతం లో...' జీవితం చేసే రణగొణధ్వనుల్లో మృదుమధురమైన ప్రేమధ్వని వినిపించడమే గొప్ప అదృష్టం అంటూ రచయిత్రి 'ప్రేమ'ను సున్నితంగా స్పృశించారు.

టీనేజ్ కుర్రాళ్లలో అలజడి, వాళ్ళు తప్పటడుగులు వేయకుండా ఉండేలా వాళ్ళ చిరాకుకు ఓపికగా బాధ్యత వహించి సమాజం పట్ల మంచి చెడును అవగాహన చేసుకునేలా ఓర్పుతో ప్రేమతో, సహనంతో కూడిన తల్లి పాత్ర ఒక సింగల్ పేరెంట్ (మదర్) అందులోను ఉద్యోగం చేస్తూ తల్లి బాధ్యతలను నెరవేర్చిన తీరుతెన్నులు కొడుకును సరిదిద్దుకోవడంలో ఆమె ఆలోచన విధానం లాంటివి 'కాస్త విరామం' కథలో వ్యక్తీకరించడం నేటి సమాజంలో ప్రతి పేరెంట్ కి అవసరం కూడా. 'ఇకపోతే గనిలో...పనిలో' కథ రిపీటేషన్ గా అనుకోవడానికి వీలు కల్పించకుండా 'సమ్మయ్య...' కథకు దీనికి పొంతన లేకుండా రెండు వేరు వేరు కథాంశాలతో తెలంగాణ యాస, బాసలో రాసినవి సింగరేణి బొగ్గుగని కార్మికుల జీవిత వెతలకు దర్పణం లాంటివి. 'కిటికీలు చుడనిస్తాయి కానీ బయటపడనివ్వవు బయటకు పడేయలేవు కూడా' అంటూ మొదలయ్యే 'అమ్మా ...కూతురు' కథలో స్త్రీకి కుటుంబం కల్పించే భద్రతనే కొన్నిసార్లు వికటించి కూతురుకి పంజరంగ మారుతుందన్న వాస్తవాన్నికథలో రచయిత్రి సహజంగా చూపించారు.

ఎదుగుదల లోపంతో పుట్టిన బాబు గురించి తల్లిగా ప్రజ్వల మనోవేదన, బాధ్యత బాబుకు తండ్రిగా సహకారం, సహనం లేని భర్తతో వేగుతూ చివరకు బాబు చెంత ఉండేలా సర్దుబాటు జీవితాల గురించి 'ఒక మనోజ్' కథలో స్త్రీలు ఎదుర్కునే భావోద్వేగ, శారీరక,




సామాజిక ఒత్తిళ్లు వాస్తవికంగా ప్రతిబింబించాయి, పచ్చని పంట పొలాల నేపథ్యంలో పల్లెటూరు రైతు కుటుంబాల గురించి 'బతుకు' కథలో 'బాధపెట్టే గతాన్ని, భయపెట్టే భవిష్యత్తు గురించి ఆలోచించనప్పుడే ఇష్టంతో కూడిన సవాలుగా ఉంటుంది జీవితం' అన్న వాక్యాలు అక్షర సత్యాలు. 'సావు డప్పు' కథలో నిరుపేద కుటుంబాలు అనుకోని అవాంతరాలు ఎదురైనపుడు వాళ్ళ పిల్లల చదువులు అర్థాంతరంగా ఆగి పోవడానికి కారణాలు – అవి చదువు చెప్పే టీచర్లను ఎంతగా వేదిస్తాయో 'పిల్లల చదువుకు ఆటంకంగా ఈ దుర్మార్గపు సావు డప్పు ఒకటి' లాంటి వాక్యాలతో కథ ముగుస్తుంది. 'కొంచెం దయ చూడు సారూ మా కష్టార్జితంలో నువ్వు వాటా అంటే ఎట్లా?' చాపలు, పీతల వ్యాపారంలో దళారుల కమీషన్ల కక్కుర్తికి రాజీపడుతూ బతుకు వెళ్లదీస్తున్న మత్స వ్యాపారస్తుల దగ్గర పనిచేసే కార్మికుల జీవితాలకు నిదర్శనంగా రాసిన 'ఎర'కథతో ఈ కథా సంపుటి ముగుస్తుంది.ప్రతి కథలో భావోద్వేగాల లోతు, కుటుంబ సామాజిక ఒత్తిళ్లు, తీసుకున్న కథాంశానికి తగ్గట్టుగా ప్రాంతీయ బాష ఈ పుస్తకంలో స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా ఇందులో కొన్ని నిశ్శబ్దంలో దాగిన స్త్రీల జీవన సత్యాలను మరికొన్ని శ్రామికుల జీవన సమస్యలను కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తాయి అతిశయానికి పోకుండా సాధారణ దృశ్యాల ద్వారానే అన్ని వర్గాల పాఠకుల మనసుకు హత్తుకునేలా లోతైన భావోద్వేగాన్ని పండిస్తారు, సమస్యల పరిస్కారం, భయాల నుంచి విముక్తి మానవ సంబంధాల లోతును గుర్తు చేస్తాయి. స్పష్టమైన భాషలో లోతైన భావాలతో ఆవిష్కరించిన కధాసంపుటి ఈ 'జగమంత కుటుంబం' – ఇంతమంచి కథలను సమాజానికి అందించిన రచయిత్రి 'శారద కావూరి' గారికి అభినందనలు !

పుస్తకం పేరు : జగమంత కుటుంబం (కథల సంపుటి)
రచయిత్రి పేరు : శారద కావూరి/ పేజీలు : 130
వెల 150 /– / ప్రచురణ కావూరి పబ్లికేషన్స్ / ప్రతులకు: నవోదయ బుక్ హౌస్ మరియు అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో లభ్యమగును

**సమీక్షకులు – న్యాలకంటి నారాయణ**
**– 9550833490**

## ఫోన్ సిగ్నళ్లు అందని ఆ ఉదయం



ఫోన్ సిగ్నళ్లు అందని ఆ ఉదయం
మీ వైపు ఆకుపచ్చ సిగ్నల్ వేసి
నా హృదయాన్ని లాక్కెళ్ళారు
మళ్ళీ ఫోన్ చేస్తానని
ఏ సిగ్నల్ కూ అందని లోకాలకు
ఆకస్మికంగా పయనమయ్యారు
చిరునవ్వుతో
హృదయాలను గెలుచుకునే మీరు
పక్కనుంటే లోకాలు గెలవవచ్చని
ఇంద్రుడిలా రప్పించుకున్నాడు కాబోలు
నయా పైసాతో సహా లెక్కలు చెప్పే
ట్రెజరర్ల అవసరం అక్కడా ఉంటుందేమో!
ఆ పోస్టు అక్కడ ఖాళీ అయిందేమో!
మనసుతో మాట్లాడే మీరు
మాకొక రోల్ మోడల్
ఎప్పుడూ మరచిపోలేని
వ్యక్తిత్వం మీది
అజాతశత్రువుగా
అందర్నీ హత్తుకునే
ఉత్తమ మనస్తత్వం మీది
సహృదయంతో వెన్ను తట్టే మీరు
ఇక లేరంటే మదిలో కలవరం
ఈ లోటు తట్టుకోవడం
మా గుండెలకు భారం
మీరు లేని లోటు తీర్చాల్సింది మీరే
మీరు మళ్ళీ రావలసిందే
మా కన్నీరు తుడవాల్సిందే!

**-డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు,**
**9441046839**

# బిజినెస్

## ప్రేమను పోషించే ఆరోగ్యకర బహుమతి



ఈ కథనం ప్రేమికుల దినోత్సవ సందర్భంలో బహుమతుల రూపం ఎలా మారుతున్నదో వివరిస్తుంది. ఇక కేవలం పూలు, మిఠాయిలకే పరిమితం కాకుండా, ఆరోగ్యాన్ని, శ్రేయస్సును ప్రతిబింబించే ఆలోచనాత్మక కానుకలు ప్రాధాన్యం పొందుతున్నాయి. కాలిఫోర్నియా బాదంపప్పులు రుచితో పాటు పోషక విలువలు కలిగి ఉండటం వల్ల ప్రతిరోజూ ఉదయం ఆహారంలో చేర్చుకోవడానికి అనువైనవిగా భావించబడుతున్నాయి. ప్రోటీన్, నార, మంచి కొవ్వులు వంటి పౌష్టిక ఘటకాలతో ఇవి రక్తంలో చక్కెర నియంత్రణ, బరువు నిర్వహణ, గుండె ఆరోగ్యం, చర్మ కాంతి మెరుగుదలకు సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఒక రోజు ఆనందానికి మాత్రమే కాకుండా, ప్రతిరోజూ శ్రద్ధను తెలియజేసే బహుమతిగా ఇవి కొత్త ప్రేమ భాషను ప్రతిబింబిస్తున్నాయి.

## సార్వభౌమ మేధో గణన వేదిక పరిష్కారం



ఈ సమాచారం ఎస్‌డీఎస్ సంస్థ రూపొందించిన సమగ్ర కృత్రిమ మేధస్సు నిర్వహణ వేదిక గురించి వివరిస్తుంది. ఈ వేదిక ద్వారా సంస్థలు గణన సమూహాలను సులభంగా అనుసంధానం చేసుకోవడం, శిక్షణ మరియు నిర్ధారణ పనులను వేగంగా అమలు చేయడం, వనరుల వినియోగాన్ని ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడం సాధ్యమవుతుంది. బహుళ వినియోగదారుల నిర్మాణం, పాత్రాధారిత ప్రవేశ నియంత్రణ, ఆమోద ప్రక్రియలు, లెక్కల నమోదుతో భద్రత మరియు నియంత్రణ ప్రమాణాలు పాటించబడతాయి. గణన గంటల వినియోగం మరియు ఖర్చులపై స్పష్టమైన అవగాహన కల్పించడం ద్వారా వ్యయ నియంత్రణకు తోడ్పడుతుంది. దేశీయ డేటా నిల్వ ప్రమాణాలను అనుసరించే మూడవ స్థాయి ధృవీకృత కేంద్రాలలో ఈ వేదిక అమలు చేయబడుతుంది. పరీక్షా కార్యక్రమం ద్వారా సంస్థలు రెండు వారాలపాటు వినియోగ ప్రయోజనాలను అంచనా వేసి, పూర్తి స్థాయి అమలుకు ముందు ఫలితాలను పరిశీలించవచ్చు. భవిష్యత్తులో వనరుల మెరుగైన వినియోగం, ముందస్తు లోప హెచ్చరికలు, నియంత్రణ స్వయంచాలకరణ, ప్రాంతాల మధ్య విస్తరణ వంటి మెరుగుదలలు ప్రణాళికలో ఉన్నాయి.

## భారత్ మలేషియా డిజిటల్ చెల్లింపుల అనుసంధానం

NPCI INTERNATIONAL | PayNet PAYMENTS NETWORK MALAYSIA

భారతదేశంలోని జాతీయ చెల్లింపుల సంస్థ అంతర్జాతీయ విభాగమైన నాపీసీ ఇంటర్నేషనల్ ప్రెమెంట్స్ లిమిటెడ్ మరియు మలేషియాకు చెందిన జాతీయ చెల్లింపుల నెట్‌వర్క్ ప్రెమెంట్స్ నెట్వర్క్ మలేషియా మధ్య కుదిరిన ఒప్పందంతో భారత్--మలేషియా మధ్య క్యూఆర్ ఆధారిత వ్యాపార చెల్లింపులు సాధ్యమవుతున్నాయి. తొలి దశలో మలేషియాకు వెళ్లే భారతీయ ప్రయాణికులు అక్కడి ద్యూయిట్నోక్యూఆర్ కేంద్రాల్లో తమ యూనిఫైడ్ ప్రెమెంట్స్ ఇంటర్ఫేస్ ఆధారిత అనువర్తనాల ద్వారా సులభంగా చెల్లింపులు చేయగలరు. తరువాతి దశలో భారతదేశానికి వచ్చే మలేషియా పర్యాటకులు కూడా ఇక్కడి క్యూఆర్ కేంద్రాల్లో తమ దేశీయ అనువర్తనాల ద్వారా చెల్లింపులు చేయగలరు. ఈ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య భద్రమైన, వేగవంతమైన మరియు అంతరాయంలేని డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తూ పర్యాటకం, వాణిజ్యం మరియు ఆర్థిక సంబంధాలను మరింత బలపరుస్తుంది.

## ఎరిస్ లైఫ్‌సైన్సెస్ లిమిటెడ్ కు ద్వంక అంక వృద్ధి

Eris POWER OF EMPATHY TRUTH OF SCIENCE

ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ఔషధ తయారీ సంస్థ ఎరిస్ లైఫ్‌సైన్సెస్ లిమిటెడ్ ఆర్థిక సంవత్సరం 2026 మూడవ త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. దేశీయ బ్రాండెడ్ ఫార్ములేషన్స్ విభాగం సంవత్సరానికొకసారి 10 శాతం వృద్ధి సాధించగా, సమగ్ర ఆదాయం 11 శాతం పెరిగింది. ఈ త్రైమాసికంలో సంస్థ యొక్క సమగ్ర కార్యకలాప లాభం రూ. 282 కోట్లకు చేరుకుని, సుమారు 35 శాతం మార్జిన్‌ను నమోదు చేసింది. తొమ్మిది నెలల కాలంలో లాభదాయకత మరింత బలపడింది. సంస్థ ఇన్సులిన్ కార్ట్రిడ్జ్ విభాగంలో సుమారు పావు భాగ మార్కెట్ వాటాను సాధించినట్లు వెల్లడించింది. రక్తపోటు నియంత్రణకు సంబంధించిన కొత్త ఔషధాల ప్రవేశపెట్టడం, ఇంజెక్షన్లు మరియు ఇతర ప్రత్యేక ఉత్పత్తులలో పెట్టుబడులు పెంచడం ద్వారా భవిష్యత్తులో దేశీయ మరియు అంతర్జాతీయ వ్యాపార విస్తరణపై సంస్థ నమ్మకం వ్యక్తం చేసింది.

## పాప్‌కార్న్ మక్కలో ఆత్మనిర్భర భారత్ దిశగా అడుగు

GOURMET® POPCORNICA PVT LTD

భారత వ్యవసాయ పరిశోధన మండలికు చెందిన ఇండియన్ ఇన్నిట్యూట్ ఆఫ్ మైజ్ రీసెర్చ్ మరియు గౌర్మెట్ పాప్‌కోర్నికా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య భాగస్వామ్యం ద్వారా దేశంలో పాప్‌కార్న్ మక్క ఉత్పత్తి గొలుసు బలపడుతోంది. శాస్త్రీయ సాగు విధానాలు, అధిక దిగుబడి మరియు మెరుగైన గింజ విస్తరణ లక్షణాలున్న హైబ్రిడ్ రకాల అభివృద్ధి ద్వారా రైతుల ఆదాయం పెరుగుతోంది. గతంలో పూర్తిగా దిగుమతులపై ఆధారపడిన భారత మార్కెట్‌లో ఇప్పుడు సుమారు 65 శాతం దేశీయ ఉత్పత్తి జరుగుతోంది, దీని వల్ల విదేశీ మారక నిల్వలు ఆదా అవుతున్నాయి. 17,500 మందికి పైగా రైతులతో ఒప్పంద సాగు చేపట్టి, 36,000 ఎకరాలకు పైగా సాగు విస్తరించడం ద్వారా ఈ భాగస్వామ్యం ఆత్మనిర్భర భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ విలువ ఆధారిత వృద్ధిని, ఎగుమతి అవకాశాలను మరియు గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహిస్తోంది.

## ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్కు చారిత్రాత్మక వృద్ధి

ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆర్థిక సంవత్సరం 2026 తొమ్మిది నెలల ఫలితాల్లో చరిత్రాత్మక ప్రదర్శన కనబరిచింది. సమగ్ర రుణ ఆస్తుల పరిమాణం రూ. 1,64,720 కోట్లకు చేరి సంవత్సరానికొకసారి 48 శాతం వృద్ధి సాధించగా, సమగ్ర పన్ను తరువాత లాభం రూ. 7,209 కోట్లకు పెరిగి 84 శాతం పెరుగుదల నమోదు చేసింది. స్వతంత్ర రుణ ఆస్తులు రూ. 1,47,552 కోట్లకు చేరి 51 శాతం వృద్ధి సాధించాయి. ముఖ్యంగా బంగారం ఆధారిత రుణాలు రూ. 1,39,658 కోట్లకు చేరి 50 శాతం వృద్ధితో సంస్థ వృద్ధికి ప్రధాన బలంగా నిలిచాయి.

# ఈరోజు పైకి దూసుకెళ్లే 3 స్టాక్స్



సోమవారం ఈ 3 స్టాక్స్ పైపైకి దూసుకెళ్లే ఛాన్స్ ఉందని సూచించిన ప్రముఖ స్టాక్ అనలిస్ట్.. వీటిపై ఒక లుక్కేయండి..

ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ కంపెనీ అయిన ఆనంద్ రాతికి చెందిన టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ అయిన గణేష్ డోంగ్రే, ఒక లార్జ్ క్యాప్, అలాగే 2 మిడ్ క్యాప్ కేటగిరికి చెందిన మొత్తం 3 స్టాక్స్ కి బై రేటింగ్ తో పాటు టార్గెట్ ప్రైజ్, స్టాప్ లాస్ ని కూడా ఇస్తున్నట్లు స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకి సూచించడం జరిగింది. ఇక ఈ 3 స్టాక్స్ జాబితాలో మొదటిది ఇన్సూరెన్సు సెక్టార్ కి చెందిన ఎణఖీజ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్ కాగా, రెండవది టెక్నాలజీ సెక్టార్ కి చెందిన టాటా టెక్నాలజీస్ లిమిటెడ్, ఇక మూడవది సాఫ్ట్ వేర్ సర్వీసెస్ సెక్టార్ కి చెందిన ఇన్ఫో ఎడ్జ్ ఇండియా లిమిటెడ్ ఉన్నాయి. రేపటి ట్రేడింగ్ సెషన్ లో ఈ 3 బెస్ట్ స్టాక్స్ మంచి లాభాలని అందించే ఛాన్స్ ఉందని గణేష్ డోంగ్రే స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకి సూచించారు.

**హెచ్ డిఎఫ్ సి లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్**

హెచ్ డిఎఫ్ సిలైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 740 టార్గెట్ ప్రైజ్ ని ఇస్తున్నట్లు గణేష్ డోంగ్రే పెట్టుబడిదారులకి సూచించారు. అలాగే ఈ షేరుకి రూ. 675 స్టాప్ లాస్ ని కూడా గణేష్ డోంగ్రే అందించడం జరిగింది. చివరి ట్రేడింగ్ సెషన్ లో హెచ్ డిఎఫ్ సిలైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్ షేరు ధర 0.83 శాతం నష్టపోయి రూ. 696.85 వద్ద ముగిసింది. ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 820.75 గాను, అలాగే 52 వారాల కనిష్ట ధర రూ. 600.35 లుగా ఉంది. గత ఏడాదిలో ఈ షేరు 12 శాతం లాభాన్ని తమ వాటాదారులకి అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 1,50,000 కోట్లుగా ఉంది.

**టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ :**

టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 650 టార్గెట్ ప్రైజ్ ని ఇస్తున్నట్లు గణేష్ డోంగ్రే పెట్టుబడిదారులకి సూచించారు. అలాగే ఈ షేరుకి రూ. 560 స్టాప్ లాస్ ని కూడా గణేష్ డోంగ్రే అందించడం జరిగింది. చివరి ట్రేడింగ్ సెషన్ లో టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ షేరు ధర 3.37 శాతం నష్టపోయి రూ. 594.05 వద్ద ముగిసింది.

ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 797 గాను, అలాగే 52 వారాల కనిష్ట ధర రూ. 575.35 లుగా ఉంది. గత ఏడాదిలో ఈ షేరు 18 శాతం నష్టాన్ని తమ వాటాదారులకి అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 24,250 కోట్లుగా ఉంది.

**ఇన్ఫో ఎడ్జ్ ఇండియా లిమిటెడ్ :**

ఇన్ఫో ఎడ్జ్ ఇండియా లిమిటెడ్ షేరుకి బై రేటింగ్ తో పాటు రూ. 1230 టార్గెట్ ప్రైజ్ ని ఇస్తున్నట్లు గణేష్ డోంగ్రే పెట్టుబడిదారులకి సూచించారు. అలాగే ఈ షేరుకి రూ. 1100 స్టాప్ లాస్ ని కూడా గణేష్ డోంగ్రే అందించడం జరిగింది. చివరి ట్రేడింగ్ సెషన్ లో ఇన్ఫో ఎడ్జ్ ఇండియా లిమిటెడ్ షేరు ధర 1.24 శాతం నష్టపోయి రూ. 1135 వద్ద ముగిసింది. ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 1566.39 గాను, అలాగే 52 వారాల కనిష్ట ధర రూ. 1104.20 లుగా ఉంది. గత ఏడాదిలో ఈ షేరు 23 శాతం నష్టాన్ని తమ వాటాదారులకి అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ. 74,090 కోట్లుగా ఉంది.

# సీనియర్ సిటిజన్లకు సూపర్ స్కీమ్..

### పన్ను ప్రయోజనాలు, నెలకు రూ.20 వేల రిటర్న్స్!



సీనియర్ సిటిజన్లకు పదవీ విరమణ తర్వాత సాధారణంగా ఎటువంటి ఆదాయం ఉండదు. సీనియర్ సిటిజన్లు ఆర్థిక ఇబ్బంది పడకుండా ఉండేదుకు కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ ప్రారంభించింది. ఈ సేవింగ్స్ స్కీమ్ లో సీనియర్ సిటిజన్లు తమ డబ్బును పెట్టుబడి పెడితే కాలక్రమేణా వడ్డీ పొందేందుకు వీలు కల్పిస్తుంది. ఈ స్కీమ్ లో కొన్ని పన్ను ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే పూర్తిగా పన్ను రహితం కాదు. కేంద్ర ప్రభుత్వం పథకాలన్నింటిలో ఈ స్కీమ్ కే అధిక వడ్డీ అందిస్తుంది. ఎస్.సి.ఎస్.ఎస్. స్కీమ్ ద్వారా మీరు నెలకు రూ.20,000 కంటే ఎక్కువ రాబడి ఎలా సంపాదించవచ్చో తెలుసుకుందాం.

సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ అంటే ఏమిటి?

సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్.. సీనియర్ సిటిజన్లు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు పడకుండా భద్రత కల్పించేందుకు అమలు చేస్తున్న పొదుపు పథకం. 60 ఏళ్లు పైబడిన వారికి సురక్షితమైన పెట్టుబడి మార్గాన్ని అందిస్తుంది. డిఫెన్స్ లో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారులు అయితే 50 ఏళ్లకే ఌజూూ ఖాతాను తెరవవచ్చు. మీరు, మీ జీవిత భాగస్వామితో కలిసి అకౌంట్ ఓపెన్ చేయవచ్చు.

ఈ ఖాతాకు ఐదు సంవత్సరాల మెచ్యూరిటీ పీరియడ్ ఉంటుంది. మెచ్యూరిటీ టైమ్ ముగిసిన తర్వాత డబ్బును విత్ డ్రా చేసుకోవచ్చు. లేదా మరో మూడు సంవత్సరాలు పొడిగించుకోవచ్చు.

ఎంత పెట్టుబడి పెట్టవచ్చు?

ఈ పథకంలో కనీసంగా ఏడాదికి రూ. 1,000, గరిష్టంగా రూ. 30 లక్షలు పెట్టువచ్చు. అధిక మెంత్తంలో పెట్టుబడికి ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయి. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ ప్రస్తుత వడ్డీ రేటు 8.2%. ఆ సమయంలో ఆర్థిక వ్యవస్థ పరిస్థితి, ద్రవ్యోల్బణ రేటును బట్టి వడ్డీ రేట్లు సవరిస్తుంటారు.

నెలకు రూ. 20,000 ఎలా సంపాదించాలి?

SCSSÔÃ ప్రతి నెలా రూ. 20,000 కంటే ఎక్కువ సంపాదించవచ్చు. మీరు బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఎస్ సిఎస్ ఎస్ ఖాతాను ఓపెన్ చేసి రూ. 30 లక్షలు పెట్టుబడి పెట్టారనుకోండి. వార్షిక వడ్డీ రేటు 8.2% చొప్పున లెక్కగడితే.. మీకు ఏడాదికి దాదాపు రూ. 2.46 లక్షలు వడ్డీ రూపంలో వస్తుంది. అంటే నెలకు రూ. 20,500 అవుతుంది.

పన్ను ప్రయోజనాలు

సీనియర్ సిజిన్స్ సేవింగ్స్ స్కీమ్ లో డిపాజిట్లకు ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని సెక్షన్ 80-సి కింద మినహాయింపు ఉంటుంది. దీని వలన ఎస్.సి.ఎస్.ఎస్. ను పన్ను ఆదా కోసం కూడా ఉపయోగించుకోవచ్చు. ఏడాదికి రూ. 1.5 లక్షల వరకు పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. అయితే అసలుపై మాత్రమే పన్ను మినహాయింపు ఉంటుంది. వడ్డీపై ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మీ ఆదాయం బెసిక్ మినహాయింపు పరిమితి కంటే తక్కువగా ఉంటే, వడ్డీ కూడా పన్ను రహితంగా పరిగణించవచ్చు. సంవత్సరానికి రూ. 1 లక్ష కంటే ఎక్కువ వడ్డీ వస్తే, దానికి 10% టీడీఎస్ పడుతుంది. మీ మొత్తం ఆదాయం బెసిక్ ట్యాక్స్ స్లాబ్ పరిమితిలోనే ఉంటే.. టిడిఎస్ పడకుండా ఫామ్ 15-హెచ్ను సబ్మిట్ చేయవచ్చు.

# మళ్లీ పెరిగిన పసిడి ధరలు..

### అమెరికన్ కరెన్సీ డాలర్ బలహీనపడిన నేపథ్యం



జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లల్లో బంగారం ధరలకు మళ్లీ రెక్కలు. దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడం, డాలర్ బలహీనపడటంతో అంతర్జాతీయంగా పసిడి ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా భారత్‌లో శనివారం 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర సగటున రూ. 1900 మేర పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఆదివారం ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం స్పాట్ ధర రూ. 1,57,750కు చేరుకుంది. నిన్నటి ధరతో పోలిస్తే ఇది రూ. 1,970 అధికం. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర కూడా రూ. 1,800ల మేర పెరిగి రూ. 1,44,600కు చేరుకుంది. నగరంలో వెండి ధర స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం కిలో వెండి రూ. 2,80,000 వద్ద తచ్చాడుతోంది

అమెరికన్ కరెన్సీ డాలర్ బలహీనపడ్డ నేపథ్యంలో పసిడి, వెండివైపు పెట్టుబడులు మళ్లే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫలితంగా సోమవారం నుంచీ బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. బంగారం, వెండిలపై ఇన్వెస్ట్ చేసే వారు డాలర్ విలువపై ఓ కన్నేసి ఉంచాలని సూచిస్తున్నారు.

ప్రధాన నగరాల్లో 10 గ్రాముల పసిడి ధరలు (24కే, 22కే)

చెన్నై: ₹1,58,840; ₹1,45,600,ముంబై: ₹1,57,750; ₹1,44,600,న్యూఢిల్లీ: ₹1,57,900; ₹1,44,750,కోల్‌కతా: ₹1,57,750; ₹1,44,600,బెంగళూరు: ₹1,57,750; ₹1,44,600,హైదరాబాద్: ₹1,57,750; ₹1,44,600,విజయవాడ: ₹1,57,750; ₹1,44,600,కేరళ: ₹1,57,750; ₹1,44,600,పుణే: ₹1,57,750; ₹1,44,600,వడోదరా: ₹1,57,800; ₹1,44,650,అహ్మదాబాద్: ₹1,57,800; ₹1,44,650

వెండి ధరలు

చెన్నై: ₹2,80,000,ముంబై: ₹2,75,000,న్యూఢిల్లీ: ₹2,75,000,కోల్‌కతా: ₹2,75,000,బెంగళూరు: ₹2,75,000,హైదరాబాద్: ₹2,80,000,విజయవాడ: ₹2,80,000,కేరళ: ₹2,80,000,పుణే: ₹2,75,000,వడోదరా: ₹2,75,000,అహ్మదాబాద్: ₹2,75,000

# వెనిజులా ముడి చమురు కొనుగోలు

### రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కు అమెరికా లైసెన్స్

### ముడి చమురును రాయితీ రేటుకు దిగుమతి చేసుకోవడానికి అనుమతి




పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వెనిజులా ముడి చమురును నేరుగా కొనుగోలు చేయడానికి అమెరికా నుండి లైసెన్స్ పొందింది. ఈ అనుమతి దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ శుద్ధి సంస్థ అయిన ఆర్ఐఎల్ , భారీ ముడి చమురును రాయితీ రేటుకు దిగుమతి చేసుకోవడానికి అనుమతిస్తుంది. వెనిజులా ముడి చమురు గుజరాత్‌లోని జామ్‌నగర్‌లోని రిలయన్స్ శుద్ధి కర్మాగారం మౌలిక సదుపాయాలకు అనుకూలంగా ఉంటుంది. దాని శుద్ధి మార్జిన్‌లను మెరుగుపరుస్తుంది.

ఈ విషయం తెలిసిన వర్గాలు జనవరి చివరిలో, కొన్ని అంతర్జాతీయ కంపెనీలకు వెనిజులా నుండి నేరుగా చమురు కొనుగోలు చేయడానికిఅమెరికా సాధారణ అనుమతిని మంజూరు చేసిందని తెలిపాయి. గతంలో, అమెరికా ఆంక్షలు వెనిజులా నుండి ప్రత్యక్ష చమురు కొనుగోళ్లను నిరోధించాయి. వ్యాపారుల ద్వారా సరఫరాలను బలవంతం చేశాయి. గత నెలలో అమెరికా సైనిక చర్య తర్వాత వెనిజులా ముడి చమురు ప్రత్యక్ష కొనుగోళ్లను తిరిగి ప్రారంభించాలనే అంచనా పెరిగింది, దీని ఫలితంగా వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్టుబడి జైలు పాలయ్యాడు. అప్పటి నుండి, అమెరికా తన ఆంక్షలను కూడా సడలించింది. అయితే, వెనిజులా నుండి ముడి చమురు కొనుగోలు చేయడానికి యుఎస్ లైసెన్స్ పొందడంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రకటించలేదు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీ కాంప్లెక్స్ నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్, అమెరికా ఆంక్షలు విధించే ముందు వెనిజులా ముడి చమురును క్రమం తప్పకుండా కొనుగోలు చేసేది. అయితే, మదురో ప్రభుత్వంపై అమెరికా ఆంక్షలు విధించిన తర్వాత 2019-20లో దిగుమతులు ఆగిపోయాయి. అయితే, 2024లో తాత్కాలిక ఉపశమనం సమయంలో రిలయన్స్ వెనిజులా నుండి చమురును కొనుగోలు చేసింది.

ఈ సంవత్సరం వ్యాపారుల ద్వారా చమురు కొనుగోళ్లు తిరిగి ప్రారంభమైన తర్వాత రిలయన్స్ విటోల్ నుండి 2 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కూడా ఈ తగ్గింపును సద్వినియోగం చేసుకున్నాయి. ఈ రెండు ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు కంపెనీలు కలిసి వెనిజులా నుండి 2 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేశాయి. గత వారం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా నుండి చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి, అమెరికాతో సహా ఇతర వనరుల నుండి చమురు దిగుమతులను పెంచడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అంగీకరించారని అన్నారు.

రష్యా నుండి చమురు దిగుమతులు తగ్గుతున్న నేపథ్యంలో వెనిజులా చమురు ప్రాముఖ్యతను సంతరించుకుంది. వెనిజులాలోని ఒరినోకో బెల్ట్ ప్రాంతం దాని భారీ, అల్ట్రా-హెవీ ముడి చమురు గ్రేడ్‌లకు ప్రసిద్ధి చెందింది. రిలయన్స్ జామ్‌నగర్ శుద్ధి కర్మాగారం ఈ గ్రేడ్‌లను శుద్ధి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉందని పరిగణిస్తారు. ఈ ఆయిల్ ను డీజిల్, కిరోసిన్, ఌూ+ వంటి హై-వ్యాల్యూ పెట్రోలియం ఉత్పత్తులుగా మార్చవచ్చు. ఈ చౌకైన భారీ ముడి చమురును నేరుగా కొనుగోలు చేయడం వల్ల రిలయన్స్ దాని శుద్ధి, పెట్రోకెమికల్ వ్యాపారాలలో మార్జిన్‌లను మెరుగుపరచడంలో సహాయపడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## హైదరాబాద్‌లో మహిళల ఆరోగ్య పరుగు వేడుక స్ఫూర్తిదాయకం



హైదరాబాద్‌లో నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజాలో జైడస్ పింకథాన్ ఆరో ఎడిషన్ విజయవంతంగా జరిగింది. దాదాపు 5,000 మంది మహిళలు 3 కి.మీ, 5 కి.మీ, 10 కి.మీ, అల్ట్రా రేసులలో పాల్గొని ఆరోగ్యంపై తమ చైతన్యాన్ని ప్రదర్శించారు. మొదటగా పరుగు తీయేవారు, ఉద్యోగినులు, సీనియర్ సిటిజన్లు, అనుభవజ్ఞులైన అథ్లెట్లు అందరూ కలసి పరుగు తీశారు. విజయవంతులైన మహిళలు రేసులలో సత్తా చూపించారు. ఈ కార్యక్రమం మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్ జీవనశైలిలో భాగంగా మారుస్తూ, రొమ్ము క్యాన్సర్ వంటి సమస్యలపై అవగాహన కల్పించడానికి కూడా ఉపయోగపడింది. తెలంగాణ ప్రభుత్వం మరియు అనేక సంస్థల మద్దతుతో ఈ వేడుక స్ఫూర్తిదాయకంగా ముగిసింది.

## హైదరాబాద్‌లో ఈ-విద్య ప్రభావోత్సవం




విఐ ఫౌండేషన్ మరియు వోడాఫోన్ ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ-విద్య కార్యక్రమ ప్రభావాన్ని జరుపుకునే విద్యా ఉత్సవాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో 30 ప్రభుత్వ మరియు ప్రభుత్వ ఆధారిత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. డిజిటల్ పాఠన సాధనాలు, ఆధునిక బోధనా పద్ధతులు, అనుభవాధారిత అభ్యాసం ద్వారా పాఠశాల వాతావరణాన్ని మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. విద్యార్థులు విజ్ఞానశాస్త్ర నమూనాలు, యాంత్రిక పరికర ప్రదర్శనలు, గణిత ప్రత్యక్ష ప్రదర్శనలు, డిజిటల్ కథనాల రూపకల్పన వంటి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు అనుభవాత్మక మరియు విద్యార్థి కేంద్రిత బోధనా విధానాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ అతిథులు ప్రసంగించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను సత్కరించారు. సాంకేతిక ఆధారిత సాధికారత ద్వారా భవిష్యత్‌కు సిద్ధమైన తరాన్ని తీర్చిదిద్దాలనే సంకల్పాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.

## మహీంద్రా & మహీంద్రా లిమిటెడ్ కు చారిత్రాత్మక త్రైమాసిక ఆదాయం



మహీంద్రా & మహీంద్రా లిమిటెడ్ సమగ్ర ప్రాతిపదికపై ఒకే త్రైమాసికంలో మొదటిసారిగా రూ. 50,000 కోట్లకు పైగా ఆదాయం సాధించి కొత్త రికార్డు నెలకొల్పింది. మూడవ త్రైమాసికంలో సమగ్ర ఆదాయం రూ. 52,100 కోట్లకు చేరి 26 శాతం వృద్ధి నమోదు కాగా, పన్ను అనంతర లాభం రూ. 4,675 కోట్లకు పెరిగి 54 శాతం వృద్ధి సాధించింది. వార్షికీకరించిన ఈక్విటీపై రాబడి 20 శాతానికి పైగా నమోదైంది. క్రీడా ఉపయోగ వాహనాలలో 24.1 శాతం ఆదాయ మార్కెట్ వాటాతో మొదటి స్థానంలో నిలిచిన సంస్థ, 3.5 టన్నుల లోపు తేలికపాటి వాణిజ్య వాహనాల్లో 51.9 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. ట్రాక్టర్ల విభాగంలో 44 శాతం వాటాతో అగ్రస్థానాన్ని కొనసాగించింది. విద్యుత్ మూడు చక్రాల వాహనాల్లో 38.6 శాతం వాటాతో ముందంజలో ఉంది. అనుబంధ ఆర్థిక సేవల విభాగం బలమైన లాభ వృద్ధిని నమోదు చేయగా, సమాచార సాంకేతిక విభాగం లాభదాయకతను మెరుగుపరచింది. సంస్థ విభిన్న వ్యాపార విభాగాల్లో స్థిరమైన వృద్ధి సాధిస్తూ బలమైన ఆర్థిక ప్రదర్శనను కనబరిచింది.

## ముథూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ కు బలమైన త్రైమాసిక లాభ వృద్ధి



ముథూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ ఆర్థిక సంవత్సరం 2026 మూడవ త్రైమాసికంలో లాభదాయకతను గణనీయంగా మెరుగుపరుచుకుంది. పన్ను అనంతర లాభం రూ. 62.4 కోట్లకు చేరి త్రైమాసికానికొకసారి 104.6 శాతం వృద్ధి సాధించింది. మొత్తం రుణ పోర్ట్‌ఫోలియో రూ. 13,078 కోట్లకు చేరి సంవత్సరానికొకసారి 5.4 శాతం పెరిగింది. ఆస్తుల నాణ్యత మెరుగుపడుతూ స్థూల నిరర్థక ఆస్తులు 4.40 శాతానికి, నికర నిరర్థక ఆస్తులు 1.34 శాతానికి తగ్గాయి. రుణ నష్ట వ్యయం 3.3 శాతంగా ఉండి మార్గదర్శక స్థాయి కంటే తక్కువగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 12 శాతంగా ఉండగా, నిర్వహణ వ్యయం తగ్గి సమర్థత పెరిగింది. డిజిటల్ వసూళ్లు మరియు పూర్తిస్థాయి డిజిటల్ పంపిణీతో కార్యకలాప సామర్థ్యం బలపడింది. గ్రామీణ మహిళా వ్యాపారులకు సూక్ష్మ రుణాల ద్వారా ఆర్థిక చేర్పును ప్రోత్సహిస్తూ, స్థిరమైన వృద్ధి దిశగా సంస్థ ముందుకు సాగుతోంది.

## అన్విత గ్రూపు అంబాసిడర్ గా నందమూరి బాలకృష్ణ



ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ అన్విత గ్రూపు భారీ విస్తరణపై దృష్టి పెట్టింది. దేశంలోని, వివిధ ప్రాంతాలతోపాటు, అమెరికా, దుబాయ్‌లకూ తమ ప్రాజెక్టులను విస్తరించే ప్రణాళికల్లో ఉందని పేర్కొంది. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో ఒక్కో ప్రాజెక్టును ప్రారంభించబోతున్నట్లు సంస్థ ప్రచారకర్త, సినీనటుడు నందమూరి బాలకృష్ణతో కలిసి అన్విత గ్రూపు ఛైర్మన్ బొప్పన అచ్యుత రావు తెలిపారు. కంపెనీ బ్రాండ్ అంబాసిడర్, పద్మ భూషణ్ నందమూరి బాలకృష్ణ ఈ స్కీమ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా బొప్పన మీడియాతో మాట్లాడుతూ . 'చాలా మంది కస్టమర్లకు ఇతర లోన్స్ ఉంటాయి. దీంతో ఇల్లు చేతికి రాక పూర్వమే గృహ రుణం వాయిదా చెల్లించవలసి రావటం అదనపు భారం అవుతుంది. . ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్స్ నాగభూషణం బొప్పన, శ్రీకాంత్, విజయ్ రాజ్ పాల్గొన్నారు.

## రూ.100, రూ.500 నోట్ల రద్దు చేయం క్లారిటీ ఇచ్చిన ఆర్బీఐ



రూ.100, రూ.500 నోట్లను రద్దు చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ వైరల్ వార్తలపై ఆర్బీఐ స్పందించింది. ఈ ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొంది. రూ. 100, రూ. 500 నోట్లు చలామణిలో ఉంటాయని స్పష్టం చేసింది. భారత్ లో ముఖ్యంగా రూ. 100, రూ. 500 నోట్లతోనే లావాదేవీలు జరుగుతుంటాయి. దేశంలో డిజిటల్ చెల్లింపులు పెరిగినప్పటికీ, రిటైల్ మార్కెట్లు, గ్రామాల్లో, రవాణా వ్యవస్థలు, చిన్న వ్యాపారాలు.. నగదు కేంద్రంగానే కొనసాగుతున్నాయి. తాజాగా ఆర్బీఐ ఈ రెండు నోట్ల లావాదేవీలు మెరుగుపరుస్తామని ప్రకటించింది.

**నోట్ల నవీకరణ**

రూ. 100, రూ. 500 నోట్లను మరింత మెరుగుపరుస్తామని ఆర్బీఐ పేర్కొంది. అంతే కానీ నోట్ల రద్దు లేదా ఉపసంహరణ వంటి ఆలోచన లేదని స్పష్టం చేసింది. సెక్యూరిటీ, మన్నిక ప్రమాణాలను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. కచ్చితమైన ప్రింటింగ్, సిరా స్థితిస్థాపకత, నోట్ల మన్నికను మెరుగుపరచాలని నిర్ణయించినట్లు ఆర్బీఐ తెలిపింది. ఇప్పటికే ఉన్న నోట్లు చెల్లుబాటులో ఉంటాయని, మెరుగుపరిచిన వెర్షన్లు క్రమంగా చలామణిలోకి వస్తాయని చెప్పింది.

**అధిక చలామణి**

రోజువారీ నగదు లావాదేవీలలో రూ. 100, రూ. 500 నోట్లు ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. కూరగాయల మార్కెట్లు, పెట్రోల్ బంక్ లు, ఆసుపత్రులు, ప్రయాణాలు ఇలా ప్రతీ చోట ఈ నోట్లు చలామణిలో ఉంటాయి. ఈ నోట్లను ఎక్కువగా వాడడం వల్ల మన్నిక తగ్గుతుంది. సెక్యూరిటీ ఫీచర్స్ దెబ్బతింటుంటాయి. దీంతో ఇలాంటి నోట్లను ఆర్బీఐ అప్డేట్ చేస్తుంది. అలాగే నకిలీ నోట్లను అరికట్టేందుకు తరచూ కొత్త అప్డేట్స్ ను తీసుకొస్తుంది.

ఆర్బీఐ నకిలీ నోట్ల నిరోధక చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. అప్పుడప్పుడూ నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుంటూనే ఉన్నారు. మైక్రో-లెటరింగ్, వాటర్‌మార్క్ షార్ప్‌నెస్, ఇంక్ స్థిరత్వాన్ని మెరుగుపరిచి ఫేక్ నోట్స్ ను ఆర్బీఐ అరికడుతుంది. ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు నోట్లను అప్‌గ్రేడ్ చేస్తుంటాయి. ఇదంతా బయటకు తెలియకుండానే జరుగుతుంది.

**రూ. 100 నోటులో ఏం మారుతుంది?**

రూ. 100 నోటు క్వాలిటీని మెరుగుపర్చనున్నారు. మడతపెట్టడం, ఇతర చలామణిని తట్టుకునేందుకు ప్రింట్ కాంట్రాస్ట్, ఇంక్ మన్నిక మెరుగుపరచనున్నారు. వాటర్‌మార్క్, సెక్యూరిటీ థ్రెడ్ స్పష్టతను పెంచనున్నారు. నోటు జీవితకాలాన్ని పొడిగించడమే దీని లక్ష్యం అని అధికారులు చెబుతున్నారు. పాడైన నోట్లను తరచుగా మార్చడం వల్ల ప్రింటింగ్ ,లాజిస్టికల్ ఖర్చులు పెరుగుతాయి. అప్డేట్ వెర్షన్ తో నోట్ల క్వాలిటీ మెరుగుపడుతుందని ఆర్బీఐ తెలిపింది.




# ట్రేడ్ డీల్స్‌లో భారత్ సాధికారిక చర్చలు

- మన దేశం ఎదిగింది అనేందుకు అదే నిదర్శనం
- వాణిజ్య ఒప్పందా
- దేశంలో తయారీ రంగానికి అండ
- ఎంఎస్‌ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు దోహదం
- విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ఈజీగా రావచ్చన్న స్పష్టమైన అంచనా
- భారత మార్కెట్‌పై ప్రపంచ వ్యాప్తంగా విశ్వాసం పెరుగుతోంది
- ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు అనే భావన తొలగించిన బడ్జెట్ మనది
- పిటిఐ ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్రమోడీ



న్యూఢిల్లీ : వాణిజ్య ఒప్పందాలపై విదేశాలతో సాధికారికంగా చర్చలు జరిపే స్థాయికి భారత్ ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో తయారీరంగం, సేవారంగం, ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు బలోపేతం అయినందు వల్లే భారత్‌కు ఈ సాధికారత లభించిందని ఆయన తెలిపారు. భారత్ ఇప్పటికే 38 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల(ఎఫ్‌టీఏ)ను కుదుర్చుకుందని ప్రధాని గుర్తు చేశారు. వస్త్ర, లెదర్, రసాయన, హస్తకళలు, రత్నాలు, ఇతర రంగాల్లోని భారతదేశ ఎంఎస్‌ఎంఈలకు విదేశీ మార్కెట్లను తెరిచేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయన్నారు. ఆదివారం ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఈ కామెంట్స్ చేశారు. గత కొన్నేళ్ల వ్యవధిలో మునుపటి రికార్డులను అధిగమించే రేంజులో విదేశాలకు భారత్ వస్తు, ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయన్నారు. భారత్‌లో ప్రస్తుతం రాజకీయ సుస్థిరత ఉందని మోదీ తెలిపారు. దేశ రాజకీయ భవితవ్యంపైనా విదేశీ ఇన్వెస్టర్లు ఇప్పుడు ఈజీగా స్పష్టమైన అంచనాకు రావొచ్చన్నారు. అందుకే వారికి భారత మార్కెట్‌పై విశ్వాసం పెరుగుతోందని ప్రధాని చెప్పారు.

**వికసిత దేశంగా ఎదగాలనే ఆరాటానికి ప్రతీక :** ఈసారి పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అనేది వికసిత దేశంగా ఎదగాలనే భారత్ ఆరాటానికి ప్రతీక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పుడు కాకుంటే, ఎప్పుడూ కాదు అనే బలవంతపు భావన నుంచి ఈ కేంద్ర బడ్జెట్ రాలేదని, సన్నద్ధత, స్ఫూర్తిలతో ఏర్పడిన మేం సిద్ధం అనే భావన నుంచి ఇది వచ్చిందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దేశ రక్షణ రంగాన్ని ఆధునికీకరించాల్సిన బాధ్యత ప్రభుత్వం భుజస్కంధాలపై ఉందని ఆయన తెలిపారు. అందుకోసమే రక్షణ రంగానికి బడ్జెట్ కేటాయింపులను పెంచామన్నారు. దేశ త్రివిధ దళాల బలోపేతం కోసం ఏం చేయడానికైనా సిద్ధమేనని మోదీ వెల్లడించారు.

**ప్రైవేటు రంగం లాభాలపై తక్కువ ఫోకస్ పెట్టాలి :** "భారతదేశ తదుపరి దశ ఆర్థిక పరివర్తనలో ప్రైవేటు రంగం అత్యంత కీలకమైన పాత్రను పోషించాల్సి ఉంటుంది. ఆ రంగం నుంచి నిర్ణయాత్మక స్పందన వస్తుందని నేను ఆశిస్తున్నాను. వికసిత భారత్ దిశగా మన దేశం పయనించాలంటే ప్రైవేటు రంగం ఆవిష్కరణలు, దీర్ఘకాలిక సామర్థ్యం పెంపు, అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ వంటి విభాగాల్లో ధైర్యంగా పెట్టుబడులను పెట్టాలి. ప్రైవేటు రంగం లాభాలను కాపాడుకోవడంపై తక్కువగా, పరిశోధన – అభివృద్ధి (ఆర్అండ్‌డీ), సప్లై చైన్, నాణ్యతలపై ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. పారిశ్రామిక ఉత్పాదకత పెరిగితే, ప్రైవేటు కంపెనీల యజమానులు ఆ ఫలాలను పారదర్శకంగా కార్మికులతో పంచుకోవాలి"ప్రధాని మోదీ పిలుపు నిచ్చారు.

**ఆవిష్కరణలు, సామర్థ్యం, ఉత్పాదక శక్తిని పెంచాలి బీ** "వికసిత భారత్ సాధనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారు అనేది నా బలమైన నమ్మకం. అందుకే మహిళా సంక్షేమం విషయంలో మా ప్రభుత్వం ఎలాంటి రాజీకి తావు ఇవ్వడం లేదు. మా సర్కారు ప్రతీ నిర్ణయంలోనూ మహిళా సంక్షేమ భావన ఉండేలా చూస్తున్నాం. భారత సైనికుల సంక్షేమం అంశానికీ మేం పెద్దపీట వేస్తున్నాం. భారత్ బలంగా, సర్వసన్నద్ధంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మేం ఇప్పటివరకు ప్రవేశపెట్టిన అన్ని కేంద్ర బడ్జెట్‌లు దేనికవి ప్రత్యేకమైనవి. బడ్జెట్ రూపకల్పన కోసం మేం అనుసరించే ప్రమాణాలు అలాంటివి. కరోనా సంక్షోభ కాలం తర్వాత భారతదేశానికి ఎన్నో రంగాల్లో అవకాశాల తలుపులు తెరుచుకున్నాయి. ప్రోత్సాహకాలు, సుంకాల ప్రాధాన్యతలు అనేవి మన దేశ అభివృద్ధి పయనానికి ఊతాన్ని ఇవ్వగలవు. కానీ నిలకడగా అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని ఇచ్చే సత్తా రావాలంటే వినూత్న ఆవిష్కరణలు, విశిష్ట సామర్థ్యం, భారీ ఉత్పాదక శక్తిని మనం అందిపుచ్చుకోవాలి" అని ప్రధాని మోదీ చెప్పారు.

**ఏఐ ఎకో సిస్టమ్‌కు భారత్‌లో పునాదులు బీ** "యూపీఐ వేదిక ద్వారా ప్రజల లావాదేవీలను మేం వేగవంతం చేశాం. అందుకే భారత్ ఇప్పుడు ప్రపంచంలో డిజిటల్ లీడర్‌గా మారింది. ఏఐ టెక్నాలజీకి, ఆవిష్కరణలకు దోహదం చేసే ఎకో సిస్టమ్‌కు సైతం భారత్ పునాదులు వేస్తోంది. కంప్యూటింగ్ పవర్‌ను, డేటా సెంటర్ల మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని మనం పెంచుకుంటున్నాం. భారత చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో మౌలిక సదుపాయాల కల్పన రంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టాం. భవిష్యత్ కోసం బంగారు భారత్‌ను నిర్మిస్తున్నాం. ఈక్రమంలో ఈసారి కేంద్ర బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం రూ.12.2 లక్షల కోట్లను కేటాయించాం. 2013 కేంద్ర బడ్జెట్‌తో పోలిస్తే ఇది ఐదురెట్లు ఎక్కువ" అని ప్రధాని మోదీ వివరించారు.

# వందేమాతరం పాడను

## పార్లమెంట్‌లో నమాజు చేస్తా.. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ సంచలన ప్రకటన..



న్యూఢిల్లీ : "నేను పార్లమెంట్‌లో నమాజు చేస్తాను కానీ వందేమాతరం మాత్ర పాడను" ఇది ఒక కాంగ్రెస్ ఎంపీ పార్లమెంట్ ఆవరణలో ఇచ్చిన స్టేట్‌మెంట్. భారత స్వాతంత్ర్యోద్యమంలో వందేమాతరం ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. తాజాగా అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం వందేమాతరం ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం ఆదేశించడాన్ని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ తీవ్రంగా వ్యతిరేకించారు. 'వందే మాతరం' గీతం పాడే సమయంలో తప్పనిసరిగా అందరూ నిలబడాలన్న అంశంపై ఇమ్రాన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "వందే మాతరం ఇప్పటికే పాడుతున్నాం. కానీ అన్ని ఆరు చరణాలు చదవాలని చెబితే నేను చదవలేను. ఎందుకంటే నా మతం దానికి అనుమతించదు. నాకు ఇక్కడ(పార్లమెంట్) ఆవరణలో సజ్దా(ఇస్లామిక్ ప్రార్థన) చేయడంలో ఎలాంటి సమస్య లేదు. కానీ నా మతం ఏమి చెబుతుందో అది పాటించే స్వేచ్ఛను నాకు భారత రాజ్యాంగం ఇచ్చింది" ఎంపీ అని అన్నారు. ఇమ్రాన్ మసూద్ ప్రధానంగా రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను ప్రస్తావించారు. దేశానికి గౌరవం ఇవ్వడంలో తాను వెనుకాడనని, కానీ తన మత పరిమితులను దాటలేనని స్పష్టం చేశారు. ఈ అంశం ఇప్పుడు రాజకీయంగా మాత్రమే కాకుండా, సమాజంలో కూడా పెద్ద చర్చగా మారే అవకాశం కనిపిస్తోంది.

మరోవైపు వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలనూ పాడాలంటూ జారీ చేసిన ఉత్తర్వులు ఏకపక్షం, నిర్హేతుకమని ప్రముఖ ముస్లిం సంస్థ జమీయత్ ఉలామా–ఏ–హింద్ వ్యాఖ్యానించింది. ఇది రాజ్యాంగం కల్పించిన మతస్వేచ్ఛపై దాడి అని జమీయత్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదానీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. "వందేమాతరం పాడకుండా ముస్లింలు ఎవరినీ నిరోధించరు. కానీ గేయంలోని కొన్ని చరణాలు మాతృభూమిని ఓ దేవతలా స్తుతించేలా ఉన్నాయి. ఇది ఇస్లాం లాంటి ఏకధర్మ మతాల ప్రాథమిక విశ్వాసానికి విరుద్ధం. ఆర్టికల్ 25తో పాటు సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పులను ఇది ఉల్లంఘిస్తోంది. కేంద్రం ఆదేశాలు మైనార్టీల రాజ్యాంగ హక్కులను హరించే యత్నం" అని మౌలానా పేర్కొన్నారు.

# అబద్ధాలు చెపుతున్న మోడీ

- అమెరికాతో ట్రేడ్ డీల్పై రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- రైతులకు ద్రోహం చేస్తోందంటూ మండి పాటు
- ప్రజలను కాంగ్రెస్ తప్పుదారి పట్టిస్తోందంటూ అమిత్ షా కౌంటర్



న్యూఢిల్లీ : అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దీర్ఘకాలంలో భారత వ్యవసాయ రంగంపై పట్టు సాధించడానికి మరొక దేశాన్ని అనుమతిస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

డ్రైడ్ డిస్టిలరీస్ గ్రెయిన్స్‌ను దిగుమతి చేసుకోవడం అంటే జన్యుమార్పిడి చేసిన అమెరికా మొక్కజొన్నను పాడి ఉత్పత్తిదారులకు అందించడమేనని రాహుల్ ఎక్స్లో రాసుకొచ్చారు. ఇది దేశ పాల ఉత్పత్తులను అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా అని ప్రశ్నించారు. సోయా నూనె దిగుమతికి అనుమతిస్తే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా దేశవ్యాప్తంగా ఉన్న సోయా రైతులపై ప్రభావం ఉండదా అని నిలదీశారు. అదనపు ఉత్పత్తులు అంటే పప్పుధాన్యాలు సహా ఇతర పంటలను దిగుమతులకు భారత మార్కెట్‌ను తెరవాలనే ఒత్తిడిని సూచిస్తోందని రాహుల్ తెలిపారు. వాణిజ్యయేతర అడ్డంకులను తొలగిస్తామంటే భవిష్యత్తులో జన్యుమార్పిడి పంటలపై భారత్ తన వైఖరిని మార్చుకుంటుందా అని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రభుత్వం రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ట్రేడ్ డీల్ వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులకు తీవ్ర నష్టం :** అంతకుముందు కూడా, అమెరికాతో మోదీ సర్కార్ చేసుకున్న ఒప్పందం గురించి రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. వాణిజ్య ఒప్పందంతో దేశంలో వస్త్ర పరిశ్రమ, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రధాని, ఆయన కేబినెట్ మంత్రులు ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

దూరదృష్టి గల ప్రభుత్వం అయితే పత్తి రైతులు, టెక్స్‌టైల్ ఎగుమతిదారుల ప్రయోజనాలను కాపాడేలా ఒప్పందం చేసుకునేదని రాహుల్ దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కోసం ఆలోచించి ఉంటే పత్తి రైతులు, వస్త్ర ఎగుమతిదారుల శ్రేయస్సును రక్షించే విధంగా చర్చలు జరిపి ఉండేదని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కారణంగా పత్తి, వస్త్ర పరిశ్రమ రంగాలపై ఆధారపడి ఉన్న కోట్లాది మంది భారతీయుల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం అనే గొయ్యిలోకి నెట్టివేశారని ఆయన విమర్శించారు.

**రాహుల్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన అమిత్ షా :** ఇదిలా ఉండగా, అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర హోంమంత్రి గట్టి సమాధానం ఇచ్చారు. అమెరికా, ఐరోపా సమాఖ్య, యూకేలతో భారత్ చేసుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని షా ఆరోపించారు. వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రక్షించిందని నొక్కి చెప్పారు. దేశాన్ని తప్పుదారి పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని ఎద్దేవా చేశారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో దేశ మొట్టమొదటి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ– ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను అమిత్ షా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదారి పట్టిస్తుంది. నాకు నవ్వు వస్తుంది. ఈ దేశ పార్లమెంట్‌లో కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ రైతులు గురించి మాట్లాడతారు. ఐరోపా సమాఖ్య, యూకేతో జరిగిన ఎఫ్‌టీఏ, అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందాల ద్వారా ప్రధాని మోదీ రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని ఆయన చెబుతున్నారు. ఈ సందర్భంగా నేను రాహుల్ గాంధీకి సవాల్ చేస్తున్నా. ఏదైనా వేదికను నిర్ణయించండి. ఎవరు రైతులకు హాని కలిగించారో బీజేపీ యువజన విభాగం అధ్యక్షుడు వచ్చి మీతో చర్చిస్తారు. ఇవాళ రాహుల్ అబద్ధాలు చెబుతున్నారని దేశ రైతులకు చెప్పడానికే ఇక్కడకు వచ్చాను. రైతులను ప్రధాని మోదీ పూర్తిగా రక్షించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అని అమిత్ షా పేర్కొన్నారు.

# దక్షిణ కాశిలో భక్తజన సంద్రం..

## శ్రీకాళహస్తిలో ప్రశాంతంగా మహాశివరాత్రి దర్శనాలు!



శ్రీకాళహస్తి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణ కాశిగా పేరొందిన శ్రీకాళహస్తిలో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారు జామున రెండు గంటల నుంచే సర్వదర్శనం ప్రారంభం కావడంతో వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. లక్షన్నరకు పైగా భక్తులు జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**తిరుమల తరహాలో క్యూలైన్ల నిర్వహణ :** భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి ఆలయ అధికారులు ఈసారి తిరుమల తరహాలో పకడ్బందీగా క్యూలైన్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. విఐపి () దర్శనాల కోసం నిర్దిష్ట సమయాన్ని కేటాయించడం వల్ల సామాన్యుల క్యూలైన్లు వేగంగా కదులుతున్నాయి. దీనివల్ల గతంలో ఎదురైన రద్దీ సమస్యలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి.

**అంతరాయం లేని లింగోద్భవ దర్శనం :** అత్యంత కీలకమైన లింగోద్భవ కాలంలో భక్తుల మధ్య తోపులాట జరగకుండా ఆలయ యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. ముఖ్యంగా నంది వాహన సేవ నుంచి వచ్చే భక్తులు, దర్శనం కోసం వేచి చూస్తున్న భక్తులు ఒకేసారి కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రణాళికాబద్ధంగా భక్తులను లోపలికి అనుమతించడం ద్వారా ఎక్కడా తొందరపాటు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో దర్శనం సాగుతోంది.

**శాంతిభద్రతలపై పోలీసుల ప్రత్యేక నిఘా :** మహాశివరాత్రి వేడుకల భద్రతా ఏర్పాట్లపై తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు 'బిగ్ టీవీ'తో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవిన్యూ, పోలీస్, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఆలయ పరిసరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు.

**సమన్వయంతో భక్తుల సేవలో యంత్రాంగం :** కేవలం దర్శనమే కాకుండా భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నప్రసాదం వంటి ఏర్పాట్లలో ప్రభుత్వ శాఖలు నిమగ్నమయ్యాయి. పోలీస్ శాఖ నిరంతర నిఘా ఉంచడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పట్టణంలో రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో శ్రీకాళహస్తి క్షేత్రం భక్తిపారవశ్యంతో నిండిపోయింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు అత్యంత ప్రశాంతంగా సాగుతున్నాయి.

# ప్రపంచ పటంలో విశాఖకు ప్రత్యేక గుర్తింపు..

- మొట్టమొదటి ఏఐ డేటా నగరంగా సాగర తీరం..!
- కృత్రిమ మేధస్సు ఆశయాలకు కేంద్రంగా మారనుంది
- ఇక్కడ అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు
- అంతర్జాతీయ ఇంటర్నెట్ కనెక్టివిటీ తో వ్యూహాత్మకంగా ముఖ్యనగరంగా మారబోతున్నవైనం




ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరమైన విశాఖపట్నం భారతదేశ కృత్రిమ మేధస్సు ఆశయాలకు కేంద్రంగా మారనుంది. దేశంలో మొట్టమొదటి –కేంద్రీకృత డేటా నగరాన్ని ఇక్కడ అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతర్జాతీయ ఇంటర్నెట్ కనెక్టివిటీ కారణంగా ఈ సముద్ర తీరప్రాంత నగరం వ్యూహాత్మకంగా ముఖ్యమైనదిగా మారబోతుంది. ఈ ప్రణాళిక ప్రకారం, నగరం నుండి 100 కిలోమీటర్ల వ్యాసార్థంలో ఒక ఇంటిగ్రేటెడ్ డేటా పర్యావరణ వ్యవస్థను సృష్టించనున్నారు. హైపర్‌స్కేల్ డేటా సెంటర్లు, సర్వర్ తయారీ, అధునాతన శీతలీకరణ వ్యవస్థలు వంటి సౌకర్యాలను ఇక్కడ అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఏఐ రేసులో అమెరికా, చైనా వంటి శక్తులతో పోటీ పడటానికి భారతదేశానికి సహాయపడుతుంది.

విశాఖపట్నం తెలుగు రాష్ట్రాల్లో ఒక ముఖ్య ఓడరేవు నగరం. దాని తీరప్రాంత స్థానం కారణంగా, అనుకూలమైన భౌగోళిక స్థానాన్ని కలిగి ఉంది. ఇది భారతదేశాన్ని ఆగ్నేయాసియాతో అనుసంధానించే సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్‌కు ప్రత్యక్ష కనెక్టివిటీని అందిస్తుంది. సింగపూర్‌ను అనుసంధానించే జలాంతర్గామి కేబుల్ కోసం ల్యాండింగ్ పాయింట్‌గా ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఇది కంపెనీలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తుంది. అధిక–వేగం, తక్కువ–జాప్యం డేటా బదిలీని అందిస్తుంది. డేటా వేగం గురించి తక్కువ ఆందోళనలతో, పెద్ద ఎత్తున ప్రాజెక్టులు ఇక్కడ సులభంగా అమలు చేయడం జరుగుతుంది.

విశాఖపట్నం నుండి 100 కిలోమీటర్ల వ్యాసార్థంలో బలమైన, ఇంటిగ్రేటెడ్ డేటా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇది హైపర్‌స్కేల్ డేటా సెంటర్లు, సర్వర్ యూనిట్లు, అధునాతన శీతలీకరణ వ్యవస్థల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుంది. ఇక్కడ తయారీ, సాంకేతిక మౌలిక సదుపాయాలను స్థాపించడానికి ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలను కూడా ఆకర్షిస్తోంది. ఇది ఐటీ రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా గణనీయమైన ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఈ చొరవ విశాఖనగరానికి టెక్నాలజీ మ్యాప్‌లో కొత్త గుర్తింపును తీసుకురాబోతోంది. ప్రపంచ రేసులో అమెరికా, చైనాలు ప్రస్తుతం ముందంజలో ఉన్నాయి. ఇప్పుడు ప్రశ్న ని స్వీకరించాలా వద్దా అనేది కాదు, భారతదేశం ఎంత త్వరగా ముందుకు సాగగలదనేదే అని ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి నారా లోకేష్ స్పష్టంగా పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగే ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026 కి ముందు ఒక ప్రకటన చేశారు. విశాఖపట్నం ఈ దిశలో ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆయన సూచించారు. భారతదేశం వ్యూహంలో నగరం కేంద్ర బిందువుగా మారాలని, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం కోరుకుంటోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 700 కి పైగా ప్రాజెక్టులకు పెట్టుబడి ఒప్పందాలపై సంతకం చేసిందని ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గూగుల్ తన అతిపెద్ద మౌలిక సదుపాయాల కేంద్రాన్ని అమెరికా వెలుపల ఇక్కడ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రూక్‌ఫీల్డ్, డిజిటల్ రియాలిటీ వంటి ప్రధాన సంస్థలు కూడా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026 ఈ దిశలో బలమైన పునాది వేయగలదని నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న లు, దేశాధినేతలు పాల్గొంటున్నారు. తత్ఫలితంగా, విశాఖపట్నంలో జరిగే ఈ ప్రాజెక్ట్ ప్రపంచ మ్యాప్‌లో భారతదేశాన్ని కొత్త శిఖరాలకు చేర్చే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

# ఏప్రిల్ 1 నుంచి చేనేతకు ఉచిత విద్యుత్

## ఇటీవల బడ్జెట్‌లో కూడా నిధుల కేటాయింపు



అమరావతిః ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మరో పథకం అమలుకు సిద్ధమైంది. ఈ మేరకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసింది. చేనేతలు, మరమగ్గాల కార్మికులకు ఉచిత విద్యుత్ అందించే పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పథకం ద్వారా చేనేతలు, పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్ అందించనున్నారు. చేనేతలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. గత ఎన్నికలకు ముందు ఈ మేరకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని పొందుపర్చారు. దీంతో అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఈ ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని కూటమి సర్కార్ నిర్ణయం తీసుకుంది.

**ఏప్రిల్ 1 నుంచి అమలు**

ఏప్రిల్ 1 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ఏపీ ప్రభుత్వం అమలు చేయనుంది. ఇప్పటికే అర్హులు ఎంపిక పూర్తయింది. అర్హులకు ఏప్రిల్ 1 నుంచి నిబంధనల ప్రకారం ఉచిత విద్యుత్ కల్పించనున్నారు. రాష్ట్ర బడ్జెట్లో కూడా దీనికి నిధుల కేటాయింపు పూర్తయింది. ఈ పథకం వల్ల లక్షకుపైగా కుటుంబాలు లబ్ది పొందనున్నాయని ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తోంది. హ్యాండ్‌లూమ్స్ కార్మికులకు నెలకు రూ.700 వరకు, పవర్ లూమ్స్ కార్మికులకు రూ.1800 వరకు విద్యుత్ ఖర్చులు ఆదా కానున్నాయని ప్రభుత్వం అంచనా వేసింది. రాష్ట్రంలో దాదాపు 93 వేల కుటుంబాలు చేనేత పనులు చేసుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఇక 11 వేల వరకు మర మగ్గాలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ ఉచిత విద్యుత్ పథకం వల్ల ప్రయోజనం జరగనుందని చెప్పవచ్చు. ఈ నిర్ణయంపై చేనేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కేబినెట్ ఆమోదం**

చేనేతలకు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకానికి ఇటీవల కేబినెట్ కూడా ఆమోదముద్ర వేసింది. లబ్దిదారుల ఎంపిక కూడా దాదాపుగా పూర్తి కావడంతో.. ఏప్రిల్ 1 నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. మొత్తం 4 లక్షల మందికి ఈ స్కీమ్ ద్వారా బెనిఫిట్ జరగనుంది. ఇక చేనేత కార్మికులకు మరో కార్యక్రమం కూడా ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. త్వరలో వారికి పింఛన్లు కూడా అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అలాగే త్రిఫ్ట్ ఫండ్‌లతో చేనేతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. త్రిఫ్ట్ నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అటు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు ప్రకటించింది. వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది.

# కోట్ల మందికి అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

## సీఎం చంద్రబాబు



అమరావతి: తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆశయాలు, సేవలను మరింత ముందుకు తీసుకెళ్లేలా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రస్థానం కొనసాగుతోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ట్రస్ట్ స్థాపించి నేటికి 29 సంవత్సరాలు పూర్తిచేసుకుని 30వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో సీఎం పోస్ట్ చేశారు. "ప్రజా సేవకు నిజమైన అర్థాన్ని ఇచ్చి.. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని భావించిన ఎన్టీఆర్ బాటలో ట్రస్ట్ సేవలు కొనసాగిస్తోంది. విద్య, వైద్యం, రక్తదానం, విపత్తుల్లో సాయం వంటి కార్యక్రమాలతో సమాజంలో తిరుగులేని ముద్ర వేసింది. తలసీమియా వ్యాధిగ్రస్త చిన్నారులకు నిరంతర సేవలు అందించడంలో ట్రస్ట్ చేస్తున్న సేవలు అసమాన్యం. మహిళా సాధికారతలో, జీవనోపాధి కల్పనలోనూ సేవలు అందిస్తోంది. కష్టాల్లో ఉన్నవారికి మరింత చేరువయ్యేలా ట్రస్ట్ సేవలను విస్తరిస్తూ.. అత్యంత సమర్థ సంస్థగా ముందుకెళ్తోంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి అభినందనలు. ట్రస్ట్ కార్యక్రమాలకు వివిధ రూపాల్లో సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా. ఎన్టీఆర్ ట్రస్ట్ ఇలాగే కొనసాగుతూ కోట్ల మందికి అండగా నిలవాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఎప్‌స్టీన్ వివాదంలో కపిల్ సిబల్

- కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం
- జెఫ్రీ ఎప్స్టీన్ నిధులతో సిబల్ కి అవార్డు తీసుకున్నారని బీజేపీ ఆరోపణలు
- రాహుల్ స్పందించాలంటూ డిమాండ్- ఆరోపణలను తిరస్కరించిన కాంగ్రెస్



న్యూఢిల్లీ : ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాద అంశంపై కాంగ్రెస్ – బీజేపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ వివాదం అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. దేశంలోనూ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అమెరికా విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేరు కనిపించడంతో ఆయనరాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ప్రధాని మోదీ పేరు కూడా ఉండటంతో మొన్నటి వరకు బీజేపీ లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అయితే తాజాగా ఈ వివాదంలో మాజీ కాంగ్రెస్ నేత వచ్చి చేరారు. దీంతో హస్తం పార్టీని బీజేపీ లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించింది. దీంతో కమలం పార్టీ ఆరోపణలపై కూడా కాంగ్రెస్ అదే స్థాయిలో స్పందించింది. ఇంతకీ రెండు పార్టీల మధ్య జరిగిన మాటల యుద్ధాన్ని ఓసారి పరిశీలిద్దాం.

2010లో అమెరికాలో జరిగిన ఒక కార్యక్రమంలో లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్ నిధులతో కూడిన అవార్డును మాజీ కేంద్ర మంత్రి కపిల్ సిబల్ అందుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఈ విషయంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేసింది. ఈ అంశం గురించి సిబల్‌ను అడగ్గా వీటిని చెత్త ఆరోపణలుగా కొట్టిపారేశారు. కాంగ్రెస్ కూడా ఈ ఆరోపణలను తిరస్కరించింది. ఆ కార్యక్రమానికి సిబల్ అతిథి కాదని స్పష్టం చేసింది.

యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్ సర్కారులో కపిల్ సిబల్ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. విద్యలో ప్రపంచ స్థాయి సహకారానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఆ అవార్డు లభించిందని కాంగ్రెస్ మీడియా విభాగాధిపతి పవన్ ఖేడా తెలిపారు. దీనికి జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఎటువంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. కపిల్ సిబల్ 2022లో కాంగ్రెస్‌ను వీడారు. ప్రస్తుతం ఆయన సమాజ్‌వాదీ పార్టీ మద్దతుతో స్వతంత్ర రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

**సోషల్ మీడియాలో బీజేపీ పోస్టు**

అంతకుముందు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి ఎక్స్లో పోస్టు చేశారు. ఎప్‌స్టీన్ సహకారంతో ఇచ్చిన అవార్డును గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన కపిల్ సిబల్ అందుకున్నారని ఆ పోస్టులో పేర్కొన్నారు. కాంగ్రెస్ విదేశీ విభాగం అధిపతి శ్యామ్ పిట్రోడాకు కూడా ఇటువంటి వర్గాలతోనే సంబంధాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. సిబల్ ఆ అవార్డు అందిన కొద్ది కాలానికే, అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వంలో అనేక విధానపరమైన మార్పులు చోటుచేసుకున్నాయని ప్రదీప్ భండారి ఆరోపించారు. ఇవి కేవలం యాదృచ్ఛికాలేనా?, లేక కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ఎప్‌స్టీన్ వంటి బాహ్య శక్తులు ప్రయత్నించాయా? దీనికి రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూనే, ఎప్‌స్టీన్ కాంగ్రెస్ వాలెంటైన్ అంటూ వ్యంగ్యంగా ఆ పోస్టులో పేర్కొన్నారు.

బీజేపీ మరో అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఇదే అంశంపై కాంగ్రెస్‌ను విమర్శించారు. ఎప్‌స్టీన్‌తో కాంగ్రెస్ నడుపుతున్న మొహబ్బత్ కీ దుకాన్ ఎలాంటిది? ఎప్‌స్టీన్ నిధులు సమకూర్చిన ఐఐఈ నుంచి కపిల్ సిబల్ ఎందుకు అవార్డును స్వీకరించారు? అని ఆయన తన పోస్ట్‌లో ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి పార్లమెంటులో చాలా మాట్లాడటం ఇష్టం కదా? దీని గురించి ఇప్పుడు ఆయన ఏమైనా చెబుతారా? అని పూనావాలా ఎద్దేవా చేశారు.

**కాంగ్రెస్ ఎదురుదాడి**

బీజేపీ నేతల ట్వీట్లపై కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఎదురుదాడికి దిగారు. బీజేపీకి చెందిన ప్రదీప్ భండారి, షెహజాద్ పూనావాలా కలిసి కపిల్ సిబల్ పేరు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉందని తప్పుడు ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ షేర్ చేసింది 59 పేజీల డాక్యుమెంట్ అని, అందులో కాన్ఫరెన్స్‌ల నుంచి ఫ్యాషన్ షోల వరకు అనేక కార్యక్రమాలను జాబితా చేశారన్నారు. కపిల్ సిబల్ పేరు 55వ పేజీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం కింద ఉందన్నారు. కానీ బీజేపీ నేతలు అంత దూరం చదవడానికి ఇష్టపడలేదని, పేరు చూడగానే ఉత్సాహపడిపోయి, ప్రతిపక్షాలను ఈ గందరగోళంలోకి లాగాలని ఒక కట్టుకథను అల్లారని విమర్శించారు. తద్వారా తమ సొంత నేత హర్దీప్ సింగ్ పూరీ చుట్టూ అల్లుకున్న ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తున్నారని ఆరోపించారు.

## తారిఖ్ ప్రమాణ స్వీకారానికి.. భారత్ తరపున ఓం బిర్లా



దిల్లీ: బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత్ తరపున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ( ) హాజరుకానున్నారు. విదేశాంగశాఖ ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 17న జరగనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా భారత ప్రధాని మోదీకి ఆహ్వానం అందినట్లు వెల్లడించింది. అయితే ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ భారత పర్యటకు వస్తుండడంతో మోదీ ఢాకాకు వెళ్లే అవకాశం లేదని అధికారులు పేర్కొన్నారు.బంగ్లాదేశ్ ()లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్ నేతృత్వంలోని బీఎన్‌పీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నెల 17న ఆయన ఢాకాలో కొత్త ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని బంగ్లాదేశ్ పార్లమెంటు హౌస్‌లోని సదరన్ ప్లాజాలో నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం చైనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్, తుర్కియే, ఖతార్, శ్రీలంక, నేపాల్, భారత్ సహా 13 దేశాలకు ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.







# నేడు గ్లోబల్ లీడర్ బిల్ గేట్స్ రాక

● ఏపీకి స్వర్ణావకాశం ● అమరావతికి నేడు గ్లోబల్ ఐకాన్ బిల్ గేట్స్ రాక ● ప్రపంచ టెక్నాలజీ విప్లవానికి పునాది వేసిన బిల్ గేట్స్ ● ఆయన రాకతో రాష్ట్ర అభివృద్ధి దిశగా జరగనున్న కీలక చర్చలు ● ఐటీ, విద్య, ఆరోగ్య రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కీలక నిర్ణయాలు ● ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు కీర్తి గడించిన బిల్ గేట్స్ రాకతో రాష్ట్రానికి కొత్త దిశ ● సాంకేతికత, ఇన్నోవేషన్, అభివృద్ధి రంగాల్లో రాష్ట్రానికి కొత్త భాగస్వామ్యాలకు మార్గం



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ప్రపంచ ఐటీ విప్లవానికి ప్రతీకగా నిలిచిన బిల్ గేట్స్ నేడు అమరావతికి రానున్నారు. ఆయన రాకతో ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. టెక్నాలజీ, ఆరోగ్యం, విద్య రంగాల్లో భాగస్వామ్యాలపై కీలక చర్చలు జరిగే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు జరుగుతున్న ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యమంత్రి కగణద్రబాబు నాయుడు తో బిల్ గేట్స్ భేటీ కానున్నారు. రాష్ట్రంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, పబ్లిక్ హెల్త్, ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ రంగాల్లో సహకారం పెంచే అంశాలపై చర్చించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు దేశాల్లో అమలు చేసిన ఆరోగ్య, విద్యా ప్రాజెక్టుల మాదిరిగా ఏపీలోనూ కొత్త కార్యక్రమాలు ప్రారంభమయ్యే అవకాశాలపై ఆసక్తి నెలకొంది. బిల్ గేట్స్ రాకతో అమరావతి మరోసారి గ్లోబల్ మ్యాప్‌పై నిలవనుంది. రాష్ట్ర అభివృద్ధి దిశలో ఇది కీలక మలుపుగా మారుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు వివరాలు వెల్లడించారు. బిల్ గేట్స్ ఈ నెల 16న రాష్ట్రానికి వస్తున్నారని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. ఆయనను ఇప్పటికే రెండుసార్లు ఏపీకి చంద్రబాబు తీసుకువచ్చారు. తొలిసారి హైటెక్ సిటీ (హైదరాబాద్) కోసం, రెండోసారి విశాఖ అగ్రిటెక్ కోసం బిల్ గేట్స్‌ను రప్పించారు. ఇప్పుడు సంజీవని పథకం కోసం మూడో సారి వస్తున్నారు.

ఇదిలా ఉంటే, ఈ పర్యటన సందర్భంగా బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న సంజీవని డిజిటల్ హెల్త్ కేర్ ప్రాజెక్టు, ఏఐ ఆధారిత వ్యవసాయం, ఇతర రంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులపై చర్చిస్తారు. గేట్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌లను కలవనుంది. సోమవారం ఉదయం అమరావతికి రానున్న బిల్ గేట్స్... ఆర్టీజీఎస్‌కు వెళ్లి పాలనలో సాంకేతిక వినియోగాన్ని పరిశీలిస్తారు. అక్కడ రియల్‌టైం గవర్నెన్స్ విధానం, దాని ఫలితాల్ని గేట్స్‌కు చంద్రబాబు వివరిస్తారు. అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రులు, వివిధ శాఖల ప్రభుత్వ కార్యదర్శులు, అధికారులతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా స్వర్ణ ఆంధ్ర విజన్ 2047, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్యలో తీసుకువచ్చిన సంస్కరణల వివరాలను ప్రభుత్వం వివరిస్తుంది. అనంతరం అమరావతిలోని ఉండవల్లి సమీపంలోని వ్యవసాయ క్షేత్రానికి వెళతారు. అక్కడ వ్యవసాయ కార్యకలాపాలలో డ్రోన్లు, ఏఐ ఆధారిత సాధనాల వాడకంపై ప్రదర్శనలను బిల్ గేట్స్ ప్రతినిధి బృందం పరిశీలిస్తుంది.

సంజీవని పథకం... ఆరోగ్య రంగాన్ని విప్లవాత్మకంగా మార్చే లక్ష్యంతో సంజీవని పథకం రూపొందుతుంది. బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పథకం ద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్, మాతా శిశు సంరక్షణ వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. సంజీవని పథకం కింద ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్,డిజిటల్ హెల్త్ కార్డ్ ఇస్తారు. ఇందులో వైద్య పరీక్షలు, చికిత్స చరిత్ర, ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ రిపోర్టులు, వ్యాక్సినేషన్ రికార్డులు స్టోర్ అవుతాయి. మొబైల్ ఫోన్ ద్వారా డాక్టర్ అపాయింట్మెంట్లు బుక్ చేసుకోవచ్చు. క్యాష్, పేపర్‌లెస్ మాత్రమే కాకుండా తక్షణ సాయం అందుతుంది. ప్రతి కుటుంబానికీ సంవత్సరానికి రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స (యూనివర్సల్ హెల్త్ కవరేజ్). అవసరమైతే ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అడ్వాన్స్‌డ్ ట్రీట్మెంట్ కోసం రూ.25 లక్షల వరకు సాయం అందనుంది. ముందుగానే పరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యలను గుర్తించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 72.73 లక్షల మందికి 42 రకాల వైద్య పరీక్షలు (రక్త పరీక్షలు, డయాబెటిస్, బీపీ, గుండె సంబంధిత వంటివి) చేస్తారు.

ఏఐ ఆధారిత స్క్రీనింగ్, పర్సనలైజ్డ్ మెడిసిన్ కార్యక్రమాన్ని బిల్–మెలిండా గేట్స్ ఫౌండేషన్, టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సహకారంతో అమలు చేస్తున్నారు. ఇది ఆయుష్మాన్ భారత్, ఎన్టీఆర్ హెల్త్ సర్వీసెస్తో ఇంటిగ్రేట్ అవుతుంది.యఅమరావతి రాజధాని ప్రాంతంగా ఉండడంతో.. సంజీవని పథకాన్ని ఇక్కడ ప్రధానంగా అమలు చేయాలని చూస్తున్నారు. బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు, పర్సనలైజ్డ్ మెడిసిన్ వంటి అంశాలను అమరావతిలో ఫోకస్ చేస్తున్నారు.

ఈ పథకం మొదటి పైలట్ ప్రోగ్రాం కుప్పం నియోజకవర్గం (చిత్తూరు జిల్లా)లో విజయవంతంగా ప్రారంభమైంది. తర్వాత 2026 జనవరి నుంచి చిత్తూరు జిల్లా మొత్తం అమల్లోకి తెచ్చారు. 2026లో రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా అమలు చేస్తారు. 2026 జూలై నాటికి లక్షల మంది స్క్రీనింగ్ పూర్తిచేసి, ఆరోగ్య భద్రతను బలోపేతం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. తద్వారా రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని చూస్తుంది.

# కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం

● మేడారం జాతరలో కర్నూలు చిరు వ్యాపారికి వేధింపులు ● ఫుడ్ జిహాద్ ఆరోపణలతో వేధింపులకు పాల్పడిన యూట్యూబర్లు ● ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి నారా లోకేశ్ ● బాధితుడు వలీకి క్షమాపణ చెబుతూ లోకేశ్ ట్వీట్ ● త్వరలోనే వలీని కలుస్తానని, కోవా బన్ తింటానని మంత్రి హామీ




ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : తెలంగాణలోని మేడారం జాతరలో కర్నూలుకు చెందిన ఓ చిరు వ్యాపారి వేధింపులకు గురికావడం పట్ల ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధితుడైన వలికి బహిరంగంగా క్షమాపణ చెప్పారు. వివరాల్లోకి వెళితే, కర్నూలు జిల్లాకు చెందిన వలీ అనే చిరు వ్యాపారి మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో కొందరు యూట్యూబర్లు అతడిని అడ్డుకుని, ఫుడ్ జిహాద్ చేస్తున్నావంటూ ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, అతడితో బలవంతంగా కోవా బన్ తినిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియో పై స్పందించిన నారా లోకేశ్, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఒక పోస్ట్ చేశారు. ప్రియమైన సోదరుడు వలీ గారూ, మీకు ఈ బాధ కలిగినందుకు చాలా విచారంగా ఉంది. ఇలాంటి విభజనకరమైన, మతతత్వ ప్రవర్తనకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మన సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో నిలిచింది అని లోకేశ్ పేర్కొన్నారు. అంతేకాకుండా, త్వరలో మిమ్మల్ని కలిసి మీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురుచూస్తున్నాను! అంటూ వలీకి భరోసా ఇచ్చారు. లోకేశ్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ సైతం ఈ వ్యవహారంపై స్పందించారు. ఆకలికి కులం ఉండదు, ఆత్మగౌరవానికి మతం ఉండదు. కష్టపడి పనిచేసుకొని కుటుంబాన్ని పోషించుకునే ప్రతీ ఒక్కరినీ గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంటుంది. ఒక కోవా బన్ విక్రయించుకునే పేద చిరు వ్యాపారి జీవితాన్ని ఇలా రోడ్డుపైకి లాగడం దారుణం. యూట్యూబ్‌లో వ్యూస్, లైక్స్ కోసం కొందరు ఇలాంటి పనులు చేస్తున్నారు. వీళ్లైతే పేద వారి పక్షాన నిలబడాలి కానీ ఇలా గొంతు నొక్కడం సరైంది కాదు. ఆ చిరు వ్యాపారికి మద్ధతుగా నిలుస్తూ, ఈ సంఘటనను ఖండిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా ధన్యవాదాలు. సోషల్ మీడియాలో ఆ వ్యాపారికి లభిస్తున్న మద్ధతు చూస్తుంటే మానవత్వం ఇంకా బతికుందన్న భావన కలుగుతోంది అని పేర్కొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రాధాన్యం

సూర్య ప్రధాన ప్రతినిధి : కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి తగిన ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

శాసనసభలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ రాష్ట్ర చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. సంకల్పం ఉన్నచోట సాధనకు మార్గముంటుందన్నట్లుగా నేటి బడ్జెట్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఉంది. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా ఈ బడ్జెట్ ను భావించొచ్చు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల్లో మైనార్టీలకు పెద్దపీట వస్తోంది. గత ప్రభుత్వం చెల్లించకుండా పెట్టిపోయిన ఇమాం, మౌజన్ల గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం చెల్లించింది. హజ్ యాత్రకు వెళ్లే ప్రతి హాజీకి లక్ష రూపాయలు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రధానమంత్రి జన్ వికాస్ యోజన ద్వారా రాష్ట్ర మైనార్టీల సంక్షేమానికి 300 కోట్లు మంజూరు అయింది. ఉర్దూ భాషాభివృద్ధి, తదితరవాటికి రూ. 7.78 కోట్లు కేటాయించాం. ఉర్దూ ఘర్, ఉర్దూ లైబ్రరీల అభివృద్ధికి రూ. 2.85 కోట్లు కేటాయించాం. మైనార్టీ నిరుద్యోగులకు నిష్ణాతులచే కోచింగ్ ఇప్పించి, వారిని ప్రయోజకులను చేయడానికి రూ. 3.97 కోట్లు కేటాయించాం. ఉర్దూని రెండవ మాతృభాషగా ప్రకటించి గాలికొదలేసిన వైసీపీ ప్రభుత్వంలా కాకుండా ఉర్దూను అభివృద్ధి చేయాలి, ఉర్దూ పాఠశాలల్ని అభివృద్ధి చేయాలి, ఉర్దూలో చదువుకునే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉర్దూ అభివృద్ధికి రూ. 7.83 కోట్లు కేటాయించడం జరిగింది. మైనార్టీలకు పెద్దపీట వేస్తూ.. తల్లికి వందనం పథకాన్ని 15 శాతం మైనార్టీలకు కేటాయించడం జరిగింది. సామాజిక పెన్షన్ ల పంపిణీలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నాం.

**రెవెన్యూ లోటును తగ్గించేలా బడ్జెట్ ఉంది :** ప్రజల జీవన విధానంలో మార్పులు తెచ్చే విధంగా ఈ బడ్టెట్ ఉంది. పేదల సంక్షేమ పథకాల ద్వారానే ప్రజల భవిష్యత్తును మార్చగలమని ఊహించి, ప్రజలకు అవసరమైన అన్ని అంశాల్లోనూ బడ్జెట్ కేటాయింపులు, ప్రతిపాదనలు ఏ విధంగా ఉపయోగపడతాయో ఆలోచించి బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. విద్య, వైద్యం, పాఠశాల వ్యవస్థ, ఉద్యోగుల భద్రత, రాష్ట్రంలో పెట్టుబడులు తెచ్చే అవకాశం అన్నింటిని ముందుచూపుతో ఈ బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగింది. అసెంబ్లీకి వెళ్లి సమస్యలు విన్నవించాలని వైసీపీ నాయకులకు ఓట్లు వేసి గెలిపిస్తే.. ఇంట్లో కూర్చొని అసెంబ్లీకి రాకుండా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారు. వైసీపీ పరిపాలనలో రెవెన్యూ లోటు అధికంగా ఉంది. మూల ధన వ్యయాన్ని గతంలో వైసీపీ ప్రభుత్వం ఎంతవరకు ఖర్చు చేశారో ప్రజలకు తెలపాల్సిన అవసరముంది.

**బడ్జెట్ కేటాయింపు భేష్ :** నేడు అర్బన్ డెవలప్ మెంట్ కు అమృత్ పథకం లో భాగంగా 2.వా కింద 117 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం జరిగింది. అందులో భాగంగా రూ. 400 కోట్లు కేటాయించాం. రహదారులకు 6,39 కి.మీ.ల మేర రోడ్లు వేయడానికి 2,499 కోట్లు కేటాయించాం. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు కోసం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 2026–27 బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్ మొత్తం 3 లక్షల 32 వేల కోట్ల రూపాయలతో ప్రవేశపెట్టడం పట్ల సామాన్యుల నుండి ఉద్యోగాలు చేసుకునేవారి వరకు అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కేవలం 7 శాతంగా ఉన్న మూలధన వ్యయాన్ని, ఈ ప్రభుత్వం 17 శాతానికి (సుమారు 56,000 కోట్లు) పెంచింది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా చదువుకోవాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకానికి 9,668 కోట్ల రూపాయల కేటాయించడం జరిగింది. పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్నా క్యాంటీన్ల సంఖ్యను 275కి పెంచడం జరిగింది. స్కిల్ డెవలప్మెంట్ కోసం 1,232 కోట్ల రూపాయలు, యువత, క్రీడల కోసం 438 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ద్వారా గూగుల్ వంటి దిగ్గజ సంస్థల నుండి 13 లక్షల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పేర్కొనడం జరిగింది.

# భక్తులతో కిక్కిరిసిన శైవాలయాలు

● తెల్లవారుజాము నుండి ఆలయాలు శివనామ స్మరణలతో మార్మోగాయి ● ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విద్యుత్ దీపాల వెలుగులు ● తెల్లవారుజాము నుండి శివాలయాల్లో భక్తుల ఉత్సాహం పుంజాయి ● భక్తులతో కిక్కిరిసిన శ్రీశైలం మహా క్షేత్రం ● కోటప్పకొండ ఆనందవల్లి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి గొట్టిపాటి ● కోటప్పకొండలో స్వామి వారిని దర్శించుకున్న హోం మంత్రి అనిత ● శ్రీకాళహస్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఏపీ స్టేట్ బ్యూరో,అమరావతి : మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శైవ క్షేత్రాలు భక్తుల కిక్కిరిసిపోయాయి. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు తరలివచ్చి, శివుని దర్శనం పొందడానికి సాకార్య క్యూలైన్లలో నిలిచారు. శివనామ స్మరణలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి, భక్తుల ఉత్సాహం అందరినీ ఆకర్షించింది. ప్రతి ఆలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, మహామంత్రాల జపంతో పరమశివుని మహిమను భక్తులు నేరుగా అనుభవించారు. ఆలయ పరిసరాలు విద్యుత్ దీపాలు, రంగురంగుల పూల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దబడి, ఉత్సవ వాతావరణాన్ని మరింత మాంత్రికంగా మార్చాయి. పోలీస్, ట్రాఫిక్, మరియు ఆలయ అధికారుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆచరణాత్మకంగా శుభ్రమైన ప్రాంగణాల్లో పూజలు చేసి, భక్తి సంతోషంలో మునిగిపోయారు. ఉత్సవ సందర్భంలో కుటుంబాలు, యువత, వృద్ధులు సమీకృతమై భక్తిని ప్రదర్శించారు. "పరమశివుని దర్శనం పొందడం కోసం ప్రతీ సంవత్సరం ఈ రోజు కోసం ఎదురుచూస్తాం" అని ఒక భక్తి వ్యక్తి అన్నారు. అలాగే, ఆలయ కమిటీల సజావుగా ఏర్పాట్లు, భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్, స్వచ్ఛత, భద్రతా చర్యలు, ఈ మహోత్సవాన్ని మరింత సజీవంగా మరియు స్మరణీయంగా మార్చాయి.

**శ్రీశైల మహాక్షేత్రంలో :** శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తజనం తరలివచ్చింది. భక్తులతో శ్రీశైలం మహా క్షేత్రం కిక్కిరిసింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. భక్తుల భద్రత కోసం ప్రత్యేకంగా పోలీస్, రెవెన్యూ, దేవాదాయ శాఖలతో పాటు వివిధ శాఖల సమన్వయంతో శివ క్షేత్రంలో మునుపెన్నడూ లేని విధంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శ్రీశైలం దేవస్థానం సమీపంలో 626 కెమెరాల ద్వారా ప్రతి కదలికనూ ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించారు.

**శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి భక్తుల రద్దీ :** మహాశివరాత్రి వేళ శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. శ్రీ వాయు లింగేశ్వర స్వామి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవిని దర్శించుకునేందుకు వేకువజామున 2 గంటల నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయానికి చేరుకునే భక్తులకు ఉపయుక్తంగా రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ నుంచి అధికారులు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఆలయంలో శేష వాహన సేవను ఘనంగా నిర్వహించారు. సోమ స్కంద మూర్తి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవి శేష , యాలి వాహనాలపై భక్తులకు దర్శనం ఇచ్చారు.

**కోటప్పకొండలో :** పల్నాడు జిల్లా ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి తొలిపూజ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. తెల్లవారుజామున 12 గంటల 30 నిమిషాలకు త్రికోటేశ్వరునికి పలు అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. త్రికోటేశ్వరునికి నిర్వహించే అభిషేకాల వేడుకను తిలకించేందుకు భక్తులు శనివారం రాత్రి నుంచే ఆలయంలో బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలోని ఆనందవల్లి అమ్మవారికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో పాటు కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునుండి భక్తులు భారీగా కోటప్పకొండకు తరలివచ్చారు. ఆలయ పండితులు ఆలయ లాంఛనాలతో పట్టువస్త్రాల బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**కోటప్పకొండ ప్రభల ఉత్సవం :** కోటప్పకొండలో మహాశివరాత్రి సంబరాల్లో ప్రభలదే ప్రధాన భూమిక. ఈ తిరునాళ్లకే ప్రభల తిరునాళ్లు అని పేరు. కోటప్పకొండ పరిసర ప్రాంతాల నుంచి, ఇతర జిల్లాల నుంచి కూడా ప్రభలతో ఈ క్షేత్రానికి తరలివస్తారు. ప్రభలతో దర్శనానికి వస్తామని మొక్కుకోవడం రివాజు. ప్రభలను సమున్నతంగా తీర్చిదిద్దడానికి గ్రామీణులు పోటీపడతారు. ఈ ప్రభలు, దివ్యప్రభా భాసితమైన సూర్యశక్తిని ఆవాహన చేసుకుని, భక్తులకు ఆరోగ్యాన్ని, ఆయుష్షును కలిగిస్తాయనేది ఆంతర్యం. తళుకుబెళుకుల చెమ్కీలు, రంగుకాగితాలు, విద్యుద్దీపాలు, వర్ణమయ జెండాలతో ప్రభల ఉత్సవం కోటప్పకొండ తిరునాళ్లకు ప్రధాన ఆకర్షణ. సమస్త విద్యలకు మూలపురుషుడు, సకల శాస్త్రాలకు ఆధారభూతుడు పరమేశ్వరుడు. అఖిల విద్యలకు అధినాయకుడు. లోకైక విజ్ఞాన స్ఫూర్తిగా, అమేయ విద్యామూర్తిగా దక్షిణామూర్తి స్వరూపంలో పరమేశ్వరుడు లీలావిభూతిని ప్రకటించాడు. ఆ అపురూప మూర్తిమత్వం ప్రకటితమయ్యే దివ్యస్థలి కోటప్పకొండ శైవక్షేత్రం.

**సామాన్య భక్తులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట**

మహాశివరాత్రి వేళ కోటప్పకొండ అశేష భక్త జనంతో కిటకిటలాడింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు కోటప్పకొండకు చేరుకున్నారు. సామాన్య భక్తులతో పాటు ప్రజాప్రతినిధులు, హైకోర్టు న్యాయమూర్తులు త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పల్నాడు జిల్లాలోని మహిమాన్విత త్రికోటేశ్వరస్వామిని శివరాత్రి వేళ లక్షలాది మంది భక్తులతో కలిసి దర్శించుకోవడం మధురానుభూతిని పంచిందని ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, చదలవాడ అరవిందబాబు అన్నారు.

## సంత్ సేవాలాల్ స్ఫూర్తితో ఆదివాసీల అభివృద్ధి



● నీట్, ఐఐటీ సీట్లు సాధించేలా ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ● గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో 9 వేల కోట్లు ● సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో చంద్రబాబు

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తితో గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రూ.50 లక్షలు కేటాయించి సేవాలాల్ జయంతిని రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. నీట్, ఐఐటీ సీట్లు సాధించేలా గురుకులాల్లో ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని చెప్పారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 287 జయంతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సంత్ శ్రీ సేవాలాల్ మన రాష్ట్రంలో జన్మించడం మన అదృష్టమని తెలిపారు. బంజారాల ఆరాధ్య దైవమైన ఆయన సిద్ధాంతాలు ఎప్పటికీ ఆదర్శమేనన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నామని. 2026–27 వార్షిక బడ్జెట్‌లో రూ. 9,190 కోట్లు ఎస్టీల కోసం కేటాయించామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు మిరియాల శిరీషాదేవి, తోయక జగదీశ్వరి, చిర్రిబాలరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షులు ధారు నాయక్ , గిరిజన నేతలు, గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ను ప్రజల్లోకి తీసుకవెళ్ళి, బడ్జెట్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గాల్లో ప్రజలకు వివరించాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పై అవగాహన కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం విశాఖపట్నం నుంచి కూటమి ఎమ్మెల్యేలు, కీలక నేతలతో ఆయన నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో బడ్జెట్ ప్రాధాన్యతలపై సుదీర్ఘంగా చర్చించారు. 'విధ్వంసం నుంచి వికాసం వైపు' సాగుతున్న ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**వ్యవస్థను గాడితో పెట్టే 'విజన్‌డాక్యుమెంట్'**

గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మళ్లీ పురోగతి పట్టించేలా ఈ బడ్జెట్ ఉందని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత శతాబ్ది ఉత్సవాల నాటికి ఏపీ అగ్రగామిగా ఉండాలనే లక్ష్యంతో (విజన్–2047) ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ కూడా పాల్గొని, కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఎలా సమతుల్యం చేస్తోందో వివరించారు.

**ఇది గణాంకాల పుస్తకం కాదు.. ప్రజల జీవిత రేఖ: ఎమ్మెల్యే గణబాబు**

బడ్జెట్‌పై ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ బడ్జెట్ కేవలం అంకెలతో కూడిన పుస్తకం కాదు, ఇది కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే ఒక బ్లూ ప్రింట్. మాటల కోసం కాకుండా, చేతల్లో ప్రగతిని చూపించే విజన్ డాక్యుమెంట్ ఇది.' అని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి నేతలు ఈ సందర్భంగా బడ్జెట్‌లోని కీలక అంశాలను ప్రస్తావించారు. సుమారు రూ. 3.32 లక్షల కోట్లతో కూడిన భారీ బడ్జెట్‌గా పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా సంక్షేమం కోసం దాదాపు రూ. 91,527 కోట్లు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విద్యా రంగానికి (రూ. 32,308 కోట్లు) అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు.

## ఐలాపురం వెంకయ్య మృతికి

# చంద్రబాబు దిగ్భ్రాంతి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రముఖ బీసీ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం వెంకయ్య నిరంతరం పనిచేశారని ముఖ్యమంత్రి అన్నారు. నిరాడంబర జీవితాన్ని గడుపుతూ, అందరితో సత్సంబంధాలు కలిగిన వెంకయ్య మృతికి చంద్రబాబు సంతాపం తెలిపారు. వెంకయ్య కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఐలాపురం వెంకయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పారు.

## ప్రగతిశీల ఆలోచనతో

# రాష్ట్ర భవిష్యత్తుకు దిశా నిర్దేశం

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 2026–27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి స్పష్టమైన రోడ్ మ్యాప్ని సిద్ధం చేసినట్లు ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తెలిపారు. ఈ బడ్జెట్ మూడు సూత్రాలైన సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ల సమ్మిళితం ద్వారా ప్రజలకు ముఖ్యాంశాలను చేరవేయడం లక్ష్యమన్నారు. రూ. 3,32,000 కోట్లు వ్యయం తో ప్రవేశ పెట్టిన బడ్జెట్, 11.25 శాతం వృద్ధి రేటు లక్ష్యంతో ప్రతిపాదనతో, రెవెన్యూ లోటు 1.86 శాతానికి పరిమితం చేశారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ లో ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం వల్ల పెద్ద పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. గూగుల్ వంటి దిగ్గజ సంస్థలతో 15 బిలియన్ల ( రూ. 1,35,000 కోట్లు) పెట్టుబడులు, సెమీ కండక్టర్స్ మిషన్ 2.0, రేర్ ఎర్త్ కారిడార్ ప్రాజెక్టులు ముందుకు వచ్చేయన్నారు. రాయలసీమ అభివృద్ధికి రూ. 30,000 కోట్లతో ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రం ఏర్పాటు, ఏపీకి దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రత్యేక నిధి, సంక్షేమ పథకాలు, ఎన్టీఆర్ భరోసా, అన్నా క్యాంటీన్లు, ఉచిత విద్యుత్, మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఈ బడ్జెట్ కేవలం అంకెలకు పరిమితం కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును మార్చే ప్రగతిశీల ఆలోచనతో రూపొందించబడిందన్నారు. సోషల్ మీడియా, ప్రధాన మీడియా వేదికల ద్వారా డబుల్ ఇంజన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి చేరుస్తూ ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



# అభివృద్ధి- సంక్షేమం
# ప్రగతి పథం



**పలు పథకాలకు నిధుల కేటాయింపు**

**పోలవరం - అమరావతిపై ప్రత్యేక దృష్టి సారింపు**

**ఉద్యోగ కల్పన దిశగా వేగవంతమైన అడుగులు**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో ఈ పద్దును రూపొందించిందనిపిస్తోంది ఏపీలో(ప్రాధాన్యత రంగాలకు పెద్దపీట వేసింది ప్రభుత్వం. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్లో భారీగా నిధులు కేటాయించింది. అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలకు సమప్రాధాన్యం ఇస్తూ కేటాయింపులు చేశారు. అందులో భాగంగా రహదారుల మరమ్మతులకు, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు. ఇది నిజంగా శుభ పరిణామం. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రహదారులు కొంతవరకు బాగుపడ్డాయి. ప్రాధాన్యత క్రమంలో మెరుగుపరుచుతూ వచ్చారు. ఇప్పుడు భారీగా నిధులు కేటాయించడంతో రహదారుల స్వరూపం మారనుందని చెప్పాలి. మరిన్ని వివరాలలోకి వెళితే...**

సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఏడాది దాదాపు అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిన సంగతి తెలిసిందే. 2026-2027 వార్షిక ఏడాదిలో సైతం అన్ని రకాల పథకాలు కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈరోజు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు, ఆటో డ్రైవర్లకు సాయం.. ఇలా అన్ని పథకాలకు నిధులు కేటాయించారు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల. వాటన్నింటినీ ప్రస్తావిస్తూ.. వాటికి కేటాయింపులను గుర్తు చేశారు. ఓ సారి బడ్జెట్ అంశాలను విశ్లేషించుకుంటే....

అన్నదాత సుఖీభవ పథకం పై కీలక ప్రకటన చేశారు. ఆ పథకానికి రూ.6,660 కోట్లు కేటాయించారు. ఏపీలో 46.86 లక్షల మందికి పిఎం కిసాన్ తో కలిపి అన్నదాత సుఖీభవ కింద 20 వేల రూపాయల మొత్తాన్ని అందించగలిగారు. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో కేటాయింపులు చేశారు

**భారీగా తగ్గిన రెవెన్యూ లోటు.**

**2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 41, 118.36 కోట్లు**

**2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ. 22, 002.50 కోట్లు**

**2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 80,567.47 కోట్లు**

**2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ. 75,868.09 కోట్లు**

**అన్నదాత సుఖీభవ పథకానికి.**

వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.13,598 కోట్లు కేటాయింపును ప్రతిపాదించారు వ్యవసాయ శాఖ మంత్రి. అందులో కీలకమైన అన్నదాత సుఖీభవ పథకం కూడా ఉంది. ఈ ఏడాదికి సంబంధించి చివరి విడత నిధులు విడుదల కావాల్సి ఉంది. ఈనెల 21న కేంద్రం అందించే పీఎం కిసాన్ తో అన్నదాత సుఖీభవ నిధులు విడుదలయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.

**తల్లికి వందనం**

మరోవైపు విద్యార్థులకు సంబంధించి తల్లికి వందనం పథకానికి కూడా భారీగా నిధులు కేటాయించారు. ఈ విద్యా సంవత్సరంలో పిల్లల చదువుకు గాను రూ. 9668 కోట్లు కేటాయించారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి 15వేల రూపాయల చొప్పున సాయం అందించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆ పథకానికి భారీగా నిధులు కేటాయించడం విశేషం.



**ఎన్టీఆర్ భరోసా**

ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించి రూ. 27719 కోట్లు కేటాయించారు. మరోవైపు కొత్త పింఛన్లకు సంబంధించి మంత్రి కీలక ప్రకటన చేశారు. త్వరలో కొత్త పింఛన్లకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. మొత్తానికి అయితే ఏపీ బడ్జెట్లో సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించడం చూస్తుంటే మాత్రం.. అమలు చేసిన పథకాలన్నింటినీ కొనసాగిస్తారని అర్థమవుతోంది.

**రాజధాని అమరావతి:**

రాజధాని నిర్మాణ పనుల కోసం మరియు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ రుణాల ద్వారా నిధుల సమీకరణకు బడ్జెట్‌లో స్పష్టతనిచ్చారు. రాజధాని నిర్మాణం వేగవంతం చేయడానికి అమరావతి కోసం రూ.6,000 కోట్లు కేటాయించారు. పరిశ్రమల ప్రోత్సాహానికి రూ.3,161 కోట్లు, సర్దుబాటు నిధిగా రూ.1,500 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు మంజూరు చేయగా, రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి రూ.13,546 కోట్లు కేటాయించారు. ప్రత్యేక పథకాలకు కూడా వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. మౌలిక వసతులు, పారిశ్రామికాభివృద్ధి, రాజధాని నిర్మాణం సమన్వయంతో రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి దిశగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు వెల్లడించారు.

**రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్**

సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం విభిన్న రంగాలకు భారీ కేటాయింపులతో బడ్జెట్‌ను రూపొందించింది. విశాఖపట్నం ఆర్థిక ప్రాంత అభివృద్ధికి రూ.28 వేల కోట్లు కేటాయించగా, ఈ ప్రాంత పరిధిలో పది జిల్లాలు ఉండనున్నాయి. అమరావతి ఆర్థిక ప్రాంతం తొమ్మిది జిల్లాలతో రూపుదిద్దుకోనుంది. పంచాయతీరాజ్, వ్యవసాయం, జలవనరులు, మున్సిపల్ శాఖలకు భారీగా నిధులు కేటాయించారు. రైతుల సంక్షేమం, విద్యార్థుల ఉపకారవేతనాలు, మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టుకు కూడా కీలక కేటాయింపులు కొనసాగుతున్నాయి. రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ స్థాపనకు భారీ పెట్టుబడులు ప్రతిపాదించారు. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం ద్వారా భద్రతను బలోపేతం చేయనున్నారు. సంక్షేమం, మౌలిక వసతులు, ప్రాంతీయ సమతుల అభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ రూపుదిద్దుకున్నట్లు అధికారులు తెలిపారు.

**ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తిరుమల**

తిరుపతిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు.

## ఆర్థిక పరిస్థితిపై కీలక లెక్కలు



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బడ్జెట్ వివరాలను వెల్లడించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కీలక లెక్కలను ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక లోటు రూ.75,868 కోట్లుగా, రెవెన్యూ లోటు రూ.22,002 కోట్లుగా ఉన్నట్లు తెలిపారు. మూలధన వ్యయం రూ.53,915 కోట్లు కాగా, కేంద్ర పన్నుల వాటా రూ.64,362 కోట్లుగా ఉందన్నారు. పన్ను ఆదాయం రూ.1,25,845 కోట్లు, పన్నుయేతర ఆదాయం రూ.11,473 కోట్లుగా నమోదు అయిందని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండూ సమానంగా ముందుకు సాగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ రెండు రంగాలు సమతూకంగా పురోగమించాలనే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు.

**బడ్జెట్ పరిమాణం మరియు లోటు**

మొత్తం వ్యయం: 2025-26 సంవత్సరానికి గాను ప్రభుత్వం 3.22 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించింది.

**సానుకూల మరియు సవాలుతో కూడిన అంశాలు**

మూలధన వ్యయంపై దృష్టి: గత బడ్జెట్‌లతో పోలిస్తే ఆస్తుల సృష్టిపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. ఇది దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడుతుంది.

**కేంద్ర సాయం:** పోలవరం, అమరావతి- ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుండి గ్రాంట్లు పెరగడం గమనార్హం.

**ఆర్థిక లోటు సవాలు:** పెరుగుతున్న రుణ భారం మరియు వడ్డీ చెల్లింపులు రాష్ట్ర బడ్జెట్‌పై ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఆదాయ వనరులను పెంచుకోవడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

ఈ బడ్జెట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యతను సాధించడానికి ప్రయత్నించినట్లు స్పష్టమవుతోంది.

**రెవెన్యూ వ్యయం:** సుమారు 2.39 లక్షల కోట్లుగా ఉంది.

**ద్రవ్య లోటు** : ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 4.4%గా అంచనా వేయబడింది.

**రుణ భారం:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్పులు 2026-27 నాటికి 7.11 లక్షల కోట్లకు చేరుతాయని అంచనా.

**కీలక కేటాయింపులు**

**పాఠశాల విద్య:** విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ 31,805 కోట్లు కేటాయించారు.

**వ్యవసాయం:** సాగునీటి రంగానికి 18,019 కోట్లు కాగా, అందులో పోలవరం ప్రాజెక్టుకు 5,756 కోట్లు కేటాయించడం జరిగింది.

**కొత్త విధానాలు**

రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పోటీతత్వంతో ముందుకు తీసుకెళ్లేందుకు 26 పునర్వ్యవస్థీకరించిన విధానాలను ప్రవేశపెట్టిన వాటిలో ముఖ్యమైనవి:

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి విధానం (4.0)
ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ & పారిశ్రామిక వేత్తల అభివృద్ధి విధానం (4.0)
ఆంధ్రప్రదేశ్ సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానం
ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ & స్టార్టప్ విధానం (4.0)
ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం ఈ విధానాలు రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనుకూలమైన, స్థిరమైన మరియు సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా తీసుకెళ్తాయని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు.

**బి.వి.రమణ - 94407 40015**

## ఉద్యోగుల కోసం..



**మహిళా ఉద్యోగుల కోసం..**

మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చైల్డ్ కేర్ లీవ్స్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా ఉద్యోగులు తమ పిల్లల సంరక్షణ కోసం ఎప్పుడైనా సెలవులు పొందేలా వెసులుబాటు కల్పించామని బడ్జెట్ ప్రసంగంలో వివరించారు.

**గ్రూప్ ఇన్సూరెన్స్, ఉద్యోగ నియామకాలు**

ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా వివిధ బ్యాంకులతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని మంత్రి పయ్యావుల తెలిపారు. దీనివల్ల బీమా సౌకర్యం మరింత సులభంగా అందుతుందని చెప్పారు. ఇక ఉద్యోగాల విషయంలో గడిచిన కొద్ది నెలల్లోనే వివిధ కేటగిరీల్లో 30 వేల 607 ఉద్యోగాలను భర్తీ చేశామని, మెగా డీఎస్సీ ద్వారా మరిన్ని నియామకాలు చేపడతామని స్పష్టం చేశారు.

**.పెండింగ్ బకాయిల చెల్లింపు**

గడిచిన వైసీపీ హయాంలో ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, పెన్షన్లు సకాలంలో అందలేదని, అనేక ఆర్థిక ప్రయోజనాలు పెండింగ్‌లో పడ్డాయని మంత్రి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో బకాయిలను విడుదల చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ. 1,100 కోట్ల బకాయిలను ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించినట్లు సభకు వెల్లడించారు. భవిష్యత్తులో మిగిలిన బకాయిలను కూడా విడతల వారీగా జమ చేస్తామని మంత్రి చెప్పారు.

**సీపీఎస్, ప్రాన్ అకౌంట్లు...**

సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించి మంత్రి పయ్యావుల కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ప్రభుత్వ వాటా కంట్రిబ్యూషన్ సకాలంలో జమ కాక ఉద్యోగులు నష్టపోయారని, ఇప్పుడు ప్రభుత్వం తన వాటాను ఎప్పటికప్పుడు ప్రాన్ అకౌంట్లో జమ చేస్తోందని చెప్పారు. దీనివల్ల ఉద్యోగుల రిటైర్మెంట్ నిధికి భద్రత లభిస్తుందని పేర్కొన్నారు.

**పీఆర్సీ ప్రస్తావన లేదు..**

ఉద్యోగులు ప్రధానంగా ఎదురుచూసిన కొత్త పీఆర్సీ ఏర్పాటు లేదా మధ్యంతర భృతి()పై బడ్జెట్‌లో నేరుగా ప్రస్తావన లేకపోవడం గమనార్హం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా పూర్తిస్థాయిలో కుదుటపడకపోవడమే దీనికి కారణమని మంత్రి పరోక్షంగా సూచించారు. అయితే సంక్రాంతి కానుకగా ఇప్పటికే ఒక డీఏ బకాయిని విడుదల చేసిన ప్రభుత్వం, రాబోయే రోజుల్లో ఆర్థిక వెసులుబాటును బట్టి పీఆర్సీపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

## విశాఖకు నిధుల వరద




విశాఖకు అత్యంత ప్రాధాన్యం దక్కింది. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఆర్థిక ప్రాంతానికి సింహభాగం కేటాయింపులు చేశారు, విశాఖ ఆర్థిక ప్రాంతానికి గాను ఏకంగా 28 వేల కోట్ల రూపాయలు కేటాయించడం విశేషం. దాదాపు పది జిల్లాలతో విశాఖ ఆర్థిక కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దేశంలో ముంబాయిని ఆర్థిక రాజధానిగా చూస్తున్న మాదిరిగా.. ఏపీలో ఆర్థిక రాజధానిగా విశాఖను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సర్కార్ కృత నిశ్చయంతో ఉంది. కొద్ది రోజుల కిందట విశాఖ ఎకనమిక్ రీజియన్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు భారీగా కేటాయింపులు చేయడం ద్వారా ఏ స్థాయిలో ప్రాధాన్యమిస్తున్నారో అర్థం అవుతుంది. 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి లక్ష్యంతో ముందుకు సాగుతోంది చంద్రబాబు సర్కార్.

**అంతా భారీ వ్యూహం..**

విశాఖ ఎకనామిక్ రీజియన్ కు ఈ స్థాయిలో నిధులు కేటాయించడం వెనుక భారీ వ్యూహం ఉంది. ఈ నిధులను సక్రమంగా ఖర్చు చేసి.. ప్రణాళికలు అమ లు చేయగలిగితే వచ్చే ఏడు వేలలో 7.5 లక్షల గృహాలు, పదివేల హోటల్ రూములు, 20 వరకు ఇన్నోవేషన్ సెంటర్లు, పది కాలేజీలు, 7వేల ఆసుపత్రి బెడ్స్, 20వేల హెక్టార్ల పరిధిలో పరిశ్రమలు, 80 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ సముదాయం, 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో గోదాములు నిర్మించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మొత్తానికి అయితే విశాఖ ప్రాంతానికి బడ్జెట్ నిధుల కేటాయింపు అనేది ఒక గేమ్ చేంజర్ గా నిలవనుంది.

### అమెరికాVS నమీబియా

## అమెరికా విజయం




ఆదివారం హీూ చిదంబరం స్టేడియంలో జరిగిన తమ చివరి ౨20 ప్రపంచ కప్ 2026 గ్రూప్-దశ మ్యాచ్లో ఖూూ నమీబియాను 20 ఓవర్లలో 168/6కి పరిమితం చేసి 31 పరుగుల విజయాన్ని సాధించడంతో బంతితో తన అద్భుతమైన పరుగును కొనసాగించాడు. ఈ విజయం ఖూూ వరుసగా రెండవ విజయంగా నిలిచింది మరియు వారి సూపర్ 8 ఆశయాలను సజీవంగా ఉంచింది. అయితే, వారి అర్హత ఆశలు ఇప్పుడు భారతదేశం లేదా పాకిస్తాన్ వారి మిగిలిన రెండు గ్రూప్ మ్యాచ్లను గణనీయమైన తేడాతో ఓడిపోవడంపై ఆధారపడి ఉన్నాయి. 200 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన నమీబియా నమ్మకంగా ప్రారంభించింది. ఓపెనర్లు జాన్ ఫ్రైలింక్ మరియు లౌరెన్ స్టీన్క్యాంప్ ఓవర్కు పది పరుగులకు పైగా చురుగ్గా స్కోరు చేస్తూ అవసరమైన రేటును అదుపులో ఉంచారు. ఐదవ ఓవర్లో వాన్ షాల్క్విక్ ఫ్రైలింక్ను అవుట్ చేయడంతో ఈ పురోగతి వచ్చింది, అతను 15 బంతుల్లో 19 పరుగులు చేశాడు, దీనితో పవర్ప్లే ముగిసే సమయానికి నమీబియా 57/1తో నిలిచింది. లాఫ్టీ-ఈటన్తో కలిసి 45 పరుగులు జోడించి, లాఫ్టీ-ఈటన్ 17 బంతుల్లో నాలుగు బౌండరీలతో 28 పరుగులు చేశాడు. లౌరెన్ 33 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు కానీ 39 బంతుల్లో ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 58 పరుగులు చేసి ఔటయ్యాడు. శుభమ్ రంజనే 13వ ఓవర్లో నెమ్మదిగా బంతితో అతనిని మోసం చేశాడు. కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ 6 పరుగులు చేసి, నమీబియా కోలుకోలేకపోయింది. 18వ ఓవర్లో రిటైర్డ్ అయిన జెజె స్మిత్ మరియు జేన్ గ్రీన్, అడిగే రేటు పెరగడంతో పేస్ను నిలబెట్టుకోవడానికి ఇబ్బంది పడ్డారు. హానర్ సిగ్నాటిస్ వాన్ షాల్క్విక్ 2/30 గణాంకాలను తిరిగి ఇవ్వగా, సౌరభ్ నేత్రావల్కర్, అలీ ఖాన్ మరియు రంజనే ఒక్కొక్క వికెట్ తీసుకున్నారు. ముందుగా, కెప్టెన్ మోనాంక్ పటేల్ మరియు సంజయ్ కృష్ణమూర్తి అర్ధ సెంచరీలు ఖూూను 199/4కి నడిపించాయి. పవర్ప్లేలో ఖూూ వికెట్ నష్టపోకుండా 65 పరుగులు చేసింది.

సంక్షిప్త స్కోర్లు: ఖూూ 199/4 (సంజయ్ కృష్ణమూర్తి 68లి, మోనాంక్ పటేల్ 52, మిలింద్ కుమార్ 28; విల్లెం మైబర్గ్ 2-22, గెర్హార్డ్ ఎరాస్మస్ 2-27) నమీబియాను 168/6 (లోరెన్ స్టీన్క్యాంప్ 58, జీజీ స్మిట్ 31; షాడ్లీ వాన్ షాల్క్విక్ 2-30, శుభం రంజనే 1-6)తో 31 పరుగుల తేడాతో ఓడించింది.

### వెస్టిండీస్ VS నేపాల్

## వెస్టిండీస్ విజయం



ముంబైలో జరిగిన 2026 గ్రూప్ సి టీ20 ప్రపంచ కప్ మ్యాచ్లో వెస్టిండీస్ నేపాల్పై అద్భుతమైన విజయం సాధించింది. ఈ విజయంతో టోర్నమెంట్ సూపర్ 8 దశలో వెస్టిండీస్ స్థానం ఖరారైంది, నేపాల్ అర్హత అవకాశాలు ముగిశాయి. జాసన్ హోల్డర్ 4/27 నేతృత్వంలోని అద్భుతమైన విండీస్ బౌలింగ్ ప్రయత్నంతో నేపాల్ 20 ఓవర్లలో 133/8 మాత్రమే చేసింది. పవర్ప్లేలో నేపాల్ మూడు వికెట్లు కోల్పోయింది, కానీ దీపేంద్ర సింగ్ ఐరీ అర్ధ సెంచరీ మరియు సోంపాల్ కామి 15 బంతుల్లో 26 పరుగులు చేయడంతో కోలుకుంది. దీనికి ప్రతిస్పందనగా, వెస్టిండీస్ 15.2 ఓవర్లలోనే తొమ్మిది వికెట్లు చేతిలో ఉండగా పరుగుల వేటను పూర్తి చేసింది. కెప్టెన్ షాయ్ హోప్ 61 పరుగులతో నాటౌట్గా నిలవగా, షిమ్రాన్ హెట్మైర్ 46 పరుగులతో అజేయంగా నిలిచాడు.

## హైదరాబాద్లో జైడస్ పింకథాన్ సందడి

### ఆరోగ్యం కోసం 5 వేల మంది మహిళల పరుగు




హైదరాబాద్, : జైడస్ పింకథాన్ హైదరాబాద్ ఆరో ఎడిషన్ ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్లోని పీపుల్స్ ప్లాజాలో అత్యంత ఉత్సాహంగా జరిగింది. దాదాపు 5,000 మంది మహిళలు ఈ పరుగులో పాల్గొనడం నగరంలో మహిళల ఫిట్నెస్ పట్ల పెరుగుతున్న చైతన్యాన్ని చాటిచెప్పింది. తెల్లవారుజామున 5:30 గంటలకే వివిధ వయసుల మహిళలు రఘు వంశీ 3 కి.మీ, లైఫ్లాంగ్ 5 కి.మీ, 10 కి.మీ విభాగాలతో పాటు అల్ట్రా-డిస్టెన్స్ రేసుల కోసం సిద్ధమయ్యారు. తొలిసారి రన్నింగ్ చేస్తున్న వారు, ఉద్యోగినులు, సీనియర్ సిటిజన్లు, అనుభవజ్ఞులైన అథ్లెట్లు అందరూ కలిసి ఒకే వేదికపై పరుగు తీశారు.

అల్ట్రా రన్నింగ్లో మహిళల సత్తా 'ఇన్విన్సిబుల్ ఉమెన్' వేదికగా 50 కి.మీ, 75 కి.మీ, 100 కి.మీ, 100 కి.మీ రిలే వంటి అల్ట్రా విభాగాలను నిర్వహించారు. ఇండియాలో మహిళా రన్నర్లు క్రమంగా అల్ట్రా-రన్నింగ్ వైపు ఆకర్షితులవుతున్నారని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. 3 కి.మీ విభాగంలో అమల కలపాల (19 నిమిషాల 10 సెకన్లు), 5 కి.మీ విభాగంలో మౌనిక కలపాల (27 నిమిషాల 32 సెకన్లు),10 కి.మీ. పరుగులో వడ్డే నవ్య (49 నిమిషాల 59 సెకన్లు) విజేతలుగా నిలిచారు. పింకథాన్ వ్యవస్థాపకుడు మిలింద్ సోమన్ మాట్లాడుతూ.. "హైదరాబాద్ మహిళలు తమ ఆరోగ్యం కోసం చూపిన ఉత్సాహం అద్భుతం. స్పోర్ట్స్ వేర్ లేదా సంప్రదాయ దుస్తులు అన్నది కాకుండా, ఆరోగ్యం కోసం పరుగు తీయాలన్న నిర్ణయం గొప్పది. వేలాది మంది ఇలా సూర్యోదయ వేళ ఆరోగ్యం కోసం కదలడం శుభపరిణామం" అని పేర్కొన్నారు.

# పాకిస్తాన్‌పై ఇండియా ఘనవిజయం

- టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పాక్ • మొదట దూకుడు, ఆ తర్వాత తడబాటు... పాకిస్థాన్‌పై భారత్ ఇన్నింగ్స్ సాగింది! • 20 ఓవర్లలో భారత్ స్కోరు 175-7 • విరుచుకుపడిన ఇషాన్ కిషన్, 40 బంతుల్లో 77 పరుగులు • మొదట దూకుడుగా ఆడినా మధ్య ఓవర్లలో తడబడిన బ్యాటింగ్ • భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్



కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ 2026 గ్రూప్ దశ మ్యాచ్‌లో పాకిస్తాన్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. పాకిస్తాన్ తమ ప్లేయింగ్ టీ20 ఎటువంటి మార్పులు చేయలేదు, భారతదేశం రెండు మార్పులతో పోటీలోకి దిగుతోంది. రెండు జట్లు ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు గెలిచాయి మరియు ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు దాదాపు సూపర్ 8లోకి చేరుకుంటుంది. టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారతదేశం ఆధిపత్యం చెలాయించింది మరియు చిరకాల ప్రత్యర్థులతో జరిగే మ్యాచ్‌లో వారు మరో విజయాన్ని నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

భారతదేశం 127/4 (ఓవర్లు 10-15) : తిలక్ మరియు సూర్యకుమార్ ఇన్నింగ్స్‌ను స్థిరీకరించడానికి మరియు తరువాత దాడి చేయడానికి వెళుతున్నారు. అయితే, సైమ్ అయూబ్ వేసిన 15వ ఓవర్ కథలో ఒక మలుపు తెచ్చింది, తిలక్ మొదట పెద్దగా ఆడాలనే తపనతో అవుట్ అయ్యాడు. తరువాత, హార్దిక్ పాండ్యా మొదటి బంతికే డకౌట్ అయ్యాడు. స్పిన్నర్లకు చాలా అవకాశాలు ఇస్తున్న ఈ పిచ్‌పై భారత్ ఇప్పుడు వికెట్ కాపాడుకుని, తర్వాత గేర్లు మార్చాల్సిన అవసరం ఉంది.

భారతదేశం 92/2 (ఓవర్లు 5-10) : అభిషేక్ అవుట్ అయిన తర్వాత, ఇషాన్ కిషన్ జట్టును కమాండింగ్ పొజిషన్‌లోకి తీసుకురావడంలో అద్భుతమైన పని చేశాడు. స్పిన్నర్లకు చాలా అవకాశాలు ఇస్తున్న పిచ్‌లో, కిషన్ లెగ్ సైడ్‌లో ఏమీ వదిలిపెట్టలేదు. అలాగే, వారు తన ఆఫ్-సైడ్‌లో దాడి చేసినప్పుడు, అతను రివర్స్ స్వీప్‌కు మారాడు. చివరికి సైమ్ అయూబ్ అతన్ని అవుట్ చేశాడు, కానీ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ 40 బంతుల్లో 77 పరుగులు చేశాడు. సూర్యకుమార్ యాదవ్ మరియు తిలక్ ఇప్పుడు క్రీజులో ఉన్నారు.

భారతదేశం 41/1 (0-5 ఓవర్) :ఇంటింగ్ ప్రారంభంలోనే అభిషేక్ శర్మ రూపంలో భారత్‌కు తొలి దెబ్బ తగిలింది. అయితే, ఇషాన్ కిషన్ మరొక చివర నుండి దాడి చేయడం ప్రారంభించగా, తిలక్ వర్మ జాగ్రత్తగా ఆడుతున్నాడు. పిచ్‌లో ఒక మలుపు ఉంది, షాహీన్ అఫ్రిది వేసిన రెండో ఓవర్ తప్ప, ఇప్పటివరకు మిగిలిన ఓవర్లన్నీ స్పిన్నర్లే బౌల్ చేశారు. భారత జట్టులో మార్పులు భారత్ తమ ప్లేయింగ్ లో రెండు మార్పులు చేసింది. సంజు సామ్సన్ స్థానంలో అభిషేక్ శర్మ జట్టులోకి వచ్చాడు, అర్ష్‌దీప్ స్థానంలో కుల్దీప్ యాదవ్ జట్టులోకి వచ్చాడు, భారత స్పిన్ దాడిని బలోపేతం చేయడానికి జట్టులోకి వచ్చాడు.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. అభిషేక్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తిలక్ వర్మ (25), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) నుంచి మంచి సహకారం లభించింది. అయితే, మిడిల్ ఓవర్లలో హార్దిక్ పాండ్య (0) విఫలమవడంతో స్కోరు వేగం తగ్గింది. చివర్లో శివమ్ దూబే (17 బంతుల్లో 27), రింకు సింగ్ (4 బంతుల్లో 11) వేగంగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. పాక్ బౌలర్లలో సైమ్ అయూబ్ 3 వికెట్లు పడగొట్టాడు.







## మోహన్ బగన్ 2-0 తేడాతో కేరళ బ్లాస్టర్స్ ఓటమి




శనివారం కోల్కతాలోని వివేకానంద యుబా భారతి క్రిరంగన్లో జరిగిన సీజన్ ఓపెనర్ మ్యాచ్లో డిఫెండింగ్ ఛాంపియన్స్ మోహన్ బగన్ సూపర్ జెయింట్ తమ ఇండియన్ సూపర్ లీగ్ ప్రచారాన్ని కేరళ బ్లాస్టర్స్పై 2-0 తేడాతో సునాయాసంగా ప్రారంభించింది. జామీ మాక్లారెన్ (36వ నిమిషం) చేసిన మొదటి అర్ధభాగంలో చేసిన స్ట్రైక్ మరియు రెండవ అర్ధభాగంలో ఇంజురీ టైమ్ గోల్ టామ్ ఆల్డ్రెడ్ (90 6) చేసిన గోల్ మెరైనర్స్కు మూడు పాయింట్లు సాధించిపెట్టాయి. మోహన్ బగన్ ప్రధాన కోచ్ సెర్గియో లోబెరా చాలా బలమైన లైనప్ను ప్రకటించారు, డిమి పెట్రాటోస్, జామీ మాక్లారెన్ మరియు ఆల్బెర్టో రోడ్రిగ్జ్‌తో సహా అన్ని సుపరిచితమైన ముఖాలు మెరైనర్స్కు బాధ్యత వహిస్తూ స్పానిష్ జట్టు మొదటి మ్యాచ్కు మైదానంలోకి దిగారు. కొత్త సైన్ అప్లు మెహతాబ్ సింగ్, రాబ్సన్ డా సిల్వా మరియు అమే రణవాడే మొత్తం మ్యాచ్-డే జట్టులో కొత్త ముఖాలు. మరోవైపు, డేవిడ్ కాటాలా తన మొదటి మ్యాచ్లో యువ లైనప్ను ఎంపిక చేశాడు, విదేశీ సైన్ అప్లు ఓమర్ బా మరియు విక్టర్ బెర్టోమేయు మిడ్ఫీల్డర్లు వై ఎబిందాస్ మరియు రౌలిన్ బోర్జెస్తో కలిసి అరంగేట్రం చేశారు. మొదటి అర్ధభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్లు మెరుగైన పోసెషన్ను సాధించారు, అనిరుధ్ థాపా మరియు లాలెంగ్మావియా రాల్టే (అపుయా) మిడ్ఫీల్డ్ను నియంత్రించారు, రాబ్సన్ మరియు లిస్టన్ కొలాకో వింగ్ల ద్వారా దాడి చేయడానికి స్థలాన్ని కనుగొనగలిగారు. డిమి పెట్రాటోస్ జామీ మాక్లారెన్ తర్వాత తనకు ఇష్టమైన నంబర్ 10 పాత్రకు తిరిగి వచ్చాడు మరియు ఆస్ట్రేలియన్ ఆటగాడు తన జట్టుకు ప్రారంభంలోనే ఆధిక్యాన్ని ఇచ్చాడు. లిస్టన్ కొలాకో బాక్స్ లోపల పెట్రాటోస్ను కనుగొన్నాడు, కానీ ఫార్వర్డ్ అతని షాట్ను లాక్కున్నాడు, అది గోల్కు దూరంగా వెళ్ళింది. మెరైనర్స్ ఆధిపత్యం చెలాయిస్తున్నారు, కానీ కేరళ బ్లాస్టర్స్ యొక్క మొండి పట్టుదలగల రక్షణను బద్దలు కొట్టడం కష్టంగా ఉంది. జామీ మాక్లారెన్ ద్వారా వాటర్ బ్రేక్ తర్వాత వారు ఆధిక్యాన్ని సాధించగలిగారు. పెట్రాటోస్ అతన్ని బాక్స్ లోపల కనుగొన్నాడు మరియు ఆస్ట్రేలియన్ స్ట్రైకర్ ఐబాన్ డోహ్లింగ్ను తిప్పికొట్టాడు మరియు సీజన్లో మొదటి గోల్ కోసం ఎడమ పాదం ముగింపు ద్వారా నెట్ను కనుగొన్నాడు. మోహన్ బగన్ మొదటి అర్ధభాగాన్ని ఒక గోల్ ఆధిక్యంతో ముగించాడు, సగం చివరిలో గోల్పై 10 షాట్లు నమోదు చేశాడు, ఆరు గోల్లు సాధించాడు. రెండవ అర్ధభాగం ప్రారంభంలో కాటాలా రెండు మార్పులు చేసి నవోచా సింగ్ మరియు మార్లోన్ ట్రుజిల్లోను జట్టులోకి తీసుకున్నారు, సుభాషిష్ బోస్ స్థానంలో అమీ రణవాడేను మోహన్ బగన్ జట్టులోకి తీసుకున్నారు. రెండవ అర్ధభాగంలో మెరైనర్స్ ఎక్కువసేపు ఆటను కొనసాగించడంతో బ్లాస్టర్స్ తమ సొంత అర్ధభాగంలో లోతుగా డిఫెండ్ చేసుకోవాల్సి వచ్చింది. ఆట చివరి క్వార్టర్లో కేరళ బ్లాస్టర్స్ బలంగా మారింది, ముఖ్యంగా కెవిన్ యోక్ తన వేగం మరియు డ్రిబ్లింగ్ సామర్థ్యాలను రెక్కల కింద చూపించాడు, కానీ విశాల్ కైత్ గోల్ చేయడానికి ఇబ్బంది పడే స్పష్టమైన అవకాశాలను కూడగట్టలేకపోయాడు. రెండవ అర్ధభాగంలో ఇంజురీ-టైమ్లో మోహన్ బగన్ ప్రత్యర్థి జట్టుకు అందనంత దూరంలో ఆటను నిలిపాడు, ప్రత్యామ్నాయ ఆటగాడు టామ్ ఆల్డ్రెడ్ అనిరుధ్ థాపా ఫ్రీ కిక్ నుండి సచిన్ సురేష్ను దాటుకుని శక్తివంతమైన హెడర్తో గోల్ చేశాడు. జేమీ మాక్లారెన్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్గా ఎంపికయ్యాడు.

సూర్య
# సినిమా

# ఇండియాని షేక్ చేసేలా చిత్రాలు

**పాన్ ఇండియాలో భారీ యాక్షన్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కి సక్సెస్ అయిన చిత్రాలు కేజీఎఫ్, సలార్, యానిమల్, ధురంధర్ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఈ నాలుగు సినిమాల్లో యాక్షన్ ప్రధానంగా హైలైట్ అయింది ఎవరి స్టైల్లో వారు యాక్షన్ డిజైన్ చేసిన తీరుకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. కేజీఎఫ్, సలార్ లో ఓ రకమైన యాక్షన్ ఉంటే? యానిమల్, ధురంధర చిత్రాల్లో మరో రకమైన యాక్షన్ హైలైట్ అయింది. వీటిలో మూడు సినిమాల్లో మూల కథ పాతదే అయినా? వారు డీల్ చేసిన విధానం కొత్తగా ఉంటుంది. కథా నేపథ్యం...ఎంచుకున్న పాత్రలు సినిమా సక్సెస్ లో పాత్ర పోషించాయి.**



ప్రేక్షకులకు ఆ యాక్షన్ సన్నివేశాలు కొత్త అనుభూతిని అందించాయి. దర్శకుల ట్రీట్ మెంట్ కు ఫిదా అయ్యారు. అందుకే ఆ సినిమాలు అంత గొప్ప విజయాన్ని నమోదు చేసాయి. త్వరలోనే రిలీజ్ అవుతోన్న మరో నాలుగు



పాన్ ఇండియా సినిమాలపై అంచనాలు అంతకు మించే ఉన్నాయి. వాటి వివరాల్లోకి వెళ్తే.. యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ టాక్సిక్ అనే భారీ యాక్షన్ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే రిలీజ్ అయిన టీజర్ స్టైలిష్ గా కనెక్ట్ అయింది. ఇందులో యాక్షన్ ఏ రేంజ్ లో

- **యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ టాక్సిక్ అనే భారీ యాక్షన్ చిత్రం**
- **అసలైన బ్లడ్ షెడ్ ఎలా ఉంటుంది? అన్నది శ్రీకాంత్ ఓదలో ది ప్యారడైజ్ తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే**
- **ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ చిత్రం కేజీఎఫ్, సలార్ యాక్షన్ మించి ఎన్టీఆర్ యాక్షన్ హైలైట్ అవుతుంది. తారక్ అత్యంత క్రూరమైన మాఫియా డాన్ పాత్రలో కనిపిస్తాడని సమాచారం.**
- **ధురంధర్ పార్ట్ 2 ది రివేంజ్ మొదటి భాగం కంటే నెక్స్ట్ లెవల్లో హింస ఉంటుందని ఆధిత్యధర్ చెప్పేసారు.**

ఉంటుంది? అన్నది టీజర్ చెప్పకనే చెప్పింది. కారులో ఘాటైన రొమాన్స్ – గన్ ఫైరింగ్ డిజైన్ చేసిన తీరు ఎంతో కొత్తగా ఉంది. మేకింగ్ లో హాలీవుడ్ మేకర్ నే తలపించింది. చిన్న టీజర్ లోనే యాక్షన్ సీన్ తో అదర గొట్టింది.

అసలైన బ్లడ్ షెడ్ ఎలా ఉంటుంది? అన్నది మూడు గంటల సినిమాలో చూపించబోతున్నారు. అలాగే నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదలో ది ప్యారడైజ్ తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ మద్య రిలీజ్ అయిన గ్లింప్స్‌తో ఈ సినిమాలోనే రక్తపాతం మామూలుగా ఉండదని అర్ధమైంది. ఇందులో నాని జడల్ అనే పాత్ర పోషిస్తున్నాడు. ఆ పాత్ర ఆహార్యం ఎంతో ఆకట్టుకుంటుంది. నాని నుంచి ఓ డిఫరెంట్ యాక్షన్ సినిమాను ఆస్వా దించొచ్చు అనేలా ఉంది. ఆ పాత్రను చాలా మాసివ్ గా డిజైన్ చేసాడు. టీజర్, ట్రైలర్‌తో హింస ఏ రేంజ్ లో ఉంటుంది? అన్నది ఓ క్లారిటీ వచ్చేస్తుంది. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. కేజీఎఫ్, సలార్ యాక్షన్ మించి ఎన్టీఆర్ సినిమాలో యాక్షన్ హైలైట్ అవుతుందని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఈ విషయంలో యంగ్ టైగర్ అభిమానులు ఎంతో కాన్ఫిడెంట్ గా ఉన్నారు. 1960ల నాటి మయన్మార్ , థాయిలాండ్ , లావోస్ సరిహద్దు ప్రాంతమైన గోల్డెన్ ట్రయాంగిల్ నేపథ్యంలో కథ సాగుతుంది. ఇందులో తారక్ అత్యంత శక్తివంతమైన, క్రూరమైన మాఫియా డాన్ పాత్రలో కనిపిస్తాడని సమాచారం. ఒక సాధారణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎలా ఎదిగింది అనేది ఈ కథలోని ప్రధానాంశం. అలాగే ధురంధర్ పార్ట్ 2 ది రివేంజ్ గా రిలీజ్ అవుతుంది. మొదటి భాగంలో హింసను పతాక స్థాయిలో చూపించాడు ఆధిత్యధర్. దీంతో రివేంజ్ లో అదే హింస నెక్స్ట్ లెవల్లో ఉంటుందని ముందే చెప్పేసారు. 'ఏ' సర్టిఫికెట్ తోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది.






# వేసవి తరువాత టార్గెట్



- **మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్ల పాక గాంధీ దర్శకత్వంలో 'కొరియన్ కనకరాజు'**
- **సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ చిత్రం**
- **అఖిల్ హీరోగా 'లెనిన్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే**
- **మెగా మేనల్లుడు సాయిదుర్గ తేజ్ హీరోగా 'సంబరాల ఏటిగట్టు'**
- **బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా 'టైసన్ నాయుడు'**
- **'ఫౌజీ' తర్వాత ఒక్కొక్కటిగా ప్రేక్షకుల ముందుకు**

**రెండేళ్లగా వేసవి లో సరైన సినిమాలు రిలీజ్ అవ్వని సంగతి తెలిసిందే. దీంతో థియేటర్లను తాత్కాలికంగా మూసి వేసిన ఘటనలున్నాయి. స్టార్ హీరోలంతా పాన్ ఇండియా సినిమాలపై దృష్టి పెట్టడంతో ఈ పరిస్థితి తలెత్తింది.టైర్ 2, టైర్ 3 హీరోలు కూడా స్టోరీలు..దర్శకుల పరంగా సెలక్టివ్ గా ఉండటంతో ఔట్ పుట్ బాగా తగ్గిపోయింది. దీంతో గత రెండు సమ్మర్ సీజన్లలో ప్రేక్షకులకు ఎంటర్ టైన్ మెంట్ కరువైంది. కానీ ఈ సమ్మర్ మాత్రం రిలీజ్ లు బాగానే కనిపిస్తున్నాయి. తెలుగు సినిమాలతో పాటు కన్నడ, హిందీ పరిశ్రమల నుంచి భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న సినిమాలు కనిపిస్తున్నాయి. ఆ సినిమాలకు హిట్ టాక్ వస్తే గనుక వేసవి సీజన్ వాటితో ముగించొచ్చు. రేసులో పోటా పోటీగా కొన్ని సినిమాలు...గ్యాప్ తీసుకుని మరికొన్ని తెలుగు చిత్రాలు రిలీజ్ కు ఉండటంతో? ఈ సమ్మర్ కి ఎంటర్ టైన్ మెంట్ కి కొదవలేదు. అలాగే వేసవి అనంతరం మరికొన్ని చిత్రాలు బ్యాక్ టూ బ్యాక్ రిలీజ్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. ఓసారి వాటి వివరాల్లోకి వెళ్తే...**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్ల పాక గాంధీ దర్శకత్వంలో 'కొరియన్ కనకరాజు' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ముందుగా వేసవికి రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ షూటింగ్ డిలే అవ్వడంతో చిత్రాన్ని వేసవి తర్వాత రిలీజ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. అలాగే కోలీవుడ్ స్టార్ సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కు తోంది. ఇప్పటికే 70 శాతం షూటింగ్ పూర్తయింది. మిగతా షూటింగ్ సహా అన్ని పనులు పూర్త వ్వడానికి ఎలా లేదన్నా మరో మూడు నుంచి నాలుగు నెలలు సమయం పడుతుంది. అనంతరమే చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తుంది. సూర్య తెలుగు డెబ్యూ చిత్రం కావడంతో ఎలాంటి పోటీ లేకుండా రిలీజ్ చేయాలని భావిస్తున్నారు. అలాగే అక్కినేని వారసుడు అఖిల్ హీరోగా 'లెనిన్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. రాయలసీమ నేపథ్యంలో రూపొందుతుంది. ఈ సినిమా కూడా షూటింగ్ మెల్లగా జరుగుతోంది. మరో స్టార్ కు పోటీగా రిలీజ్ చేసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఆగస్టు తర్వాత రిలీజ్ ఉండే ఛాన్స్ ఉంది. ఇంకా మెగా మేనల్లుడు సాయిదుర్గ తేజ్ హీరోగా 'సంబరాల ఏటిగట్టు' ను చెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఏడాది కాలంగా సినిమా సెట్స్‌లోనే ఉంది. రిలీజ్‌కు సంబంధించి ఎలాంటి ప్రకటన లేదు. వాస్తవానికి ఇప్పటికే రిలీజ్ అవ్వాలి. కానీ నత్త నడక షూటింగ్ జరగడంతో? అన్ని పనులు వాయిదా పడుతున్నాయి. అలాగే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా 'టైసన్ నాయుడు' కూడా ఏడాదిన్నర కాలంగా నలుగుతోన్న చిత్రం. షూటింగ్ పూర్తయినా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం సహా రకరకాల కారణలతో డిలే అవుతుంది. ఈ చిత్రాలన్నీ సమ్మర్ సహా ఆగస్టులో రిలీజ్ కానున్న 'ఫౌజీ' తర్వాత ఒక్కొక్కటిగా ప్రేక్షకుల ముందు కొచ్చే అవకాశం ఉంది.







# అమాయకపు అనన్య

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో గ్లామర్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది తెలుగమ్మాయి అనన్య నాగళ్ల. సోషల్ మీడియా వేదికగా ఈమె చేసే గ్లామర్ రచ్చ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పొట్టి బట్టల్లో స్కిన్ షో చేయడం అమ్మడికి అలవాటుగా మారిపో యిందనే కామెంట్స్ కూడా వినిపిస్తూ ఉంటాయి. అలా ఇప్పుడు వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ బ్యూటీ షార్ట్ స్కర్ట్ లో గ్లామర్ ట్రీట్ ఇచ్చింది. తన అందాలతో



అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది . కొంటె చూపులతో కసిగా కవ్విస్తూ యువత గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. తాజాగా యాష్ కలర్ మినీ స్కర్ట్ ధరించిన ఈమె అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో మంట రాజేస్తున్నాయి. వాలెంటైన్స్ డే వేళా యువతకు స్పెషల్ ట్రీట్ ఇచ్చింది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అనన్య నాగళ్ళ షేర్ చేసిన ఈ మినీ స్కర్ట్ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది ఆమె అభిమానులు. ఈ ఫోటోలకు తెగ లైక్ షేర్ చేస్తూ కామెంట్ చేస్తున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో జన్మించిన ఈ తెలుగ మ్మాయి.. ఒక వ్యాపారవేత్త కుటుంబం నుంచి వచ్చింది. చదువు కోసం హైదరాబాద్ వెళ్ళిన ఈ ఇబ్రహీంపట్నంలోనే రాజా మహేంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో బీటెక్ పూర్తి చేసి ఇండస్ట్రీలోకి రాకముందే ఇన్ఫోసిస్ లో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం కూడా చేసింది. 2019లో ప్రియదర్శితో కలిసి మల్లేశం సినిమాకి హీరోయిన్‌గా ఎంపికైంది. మొదటి సినిమాతోనే అందరూ దృష్టిని ఆకట్టుకుంది. చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా రాజు రాచకొండ రచించి, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనన్య నాగళ్ల పాత్రకు మంచి పేరు లభించింది. నిజానికి ఈమె పేరు అనూష నాగళ్ల అయితే ఈ చిత్రం ద్వారానే ఈమెకు అనన్య నాగళ్ళ అని పేరు మార్చారు. ఇక ఇందులో మల్లేశం భార్య పద్మా పాత్రలో ఒదిగిపోయింది. సహజమైన అమాయకత్వంతో నటనతోలోకి చొచ్చుకుపోయింది. అలాంటి అనన్య నాగళ్ళ ఆ తర్వాత ప్లే బ్యాక్, వకీల్ సాబ్, మాస్ట్రో వంటి చిత్రాలలో నటిగా నటించి.. ఊర్వశివో రాక్షసివో సినిమాలో దివ్య అనే పాత్రలో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చి అందరిని ఆకట్టుకుంది. అన్వేషి, తంత్రం, డార్లింగ్ వంటి చిత్రాలలో కీలక పాత్రలు పోషించిన అనన్య 2024 లో వచ్చిన డార్లింగ్ సినిమాలో డాక్టర్ నందిని పాత్ర పోషించి ఆకట్టుకుంది. ఇక చివరిగా శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ లో నటించింది అనన్య నాగళ్ళ. తెలుగు భాషా కామెడీ థ్రిల్లర్గా విడుదలైన ఈ చిత్రం ద్వారా రచయిత మోహన్ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. శ్రీ గణపతి సినిమాస్ పతాకం పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్ టైటిల్ పాత్ర పోషిం చారు. ప్రస్తుతం అవకాశాలు అందుకునే పనిలో పడ్డ అనన్య అందులో భాగంగానే ఇటు సోషల్ మీడియా ద్వారా కూడా అభిమానులను అలరిస్తోంది.

# నాలుగు సినిమాల బడ్జెట్ ఎంతంటే?

అగ్ర కథానాయిక ప్రియాంక చోప్రా నటించిన రెండు ప్రాజెక్టుల బడ్జెట్ 4200కోట్లు. నాలుగు సినిమాల బడ్జెట్ 5000 కోట్లు.. ఈ లెక్కలు చూస్తుంటే మతి చెడిపోతోంది కదూ? కానీ ఇది నిజం. ఇంత భారీ బడ్జెట్లతో నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో భాగం అవుతున్న ఏకైక నటి పీసీ. మహేష్ – రాజమౌళితో కలిసి చేస్తున్న వారణాసి 150 మిలియన్ డాలర్ల బడ్జెట్ తో రూపొందుతోంది.. అంటే సుమారు 1400 కోట్లకు ఇది సమానం. ఇప్పటికే స్ట్రీమింగ్ లో ఉన్న వెబ్ సిరీస్ 'సిటాడెల్'కి 300 మిలియన్ డాలర్లు ఖర్చు చేసారు. అంటే సుమారు రూ.2800కోట్ల బడ్జెట్ వెచ్చించారు. తదుపరి సిటాడెల్ సీజన్ 2 విడుదల కావాల్సి ఉంది. సిటాడెల్ సీజన్ 1లో ప్రియాంక చోప్రా యాక్షన్ ప్యాక్డ్ రోల్ అందరి దృష్టిని ఆకర్షించింది. పీసీ నటించిన వాటిలో, కేవలం రెండు ప్రాజెక్టుల కోసం ఖర్చయిన బడ్జెట్ 4200 కోట్లు. ప్రస్తుతం 'వారణాసి' చిత్రీకరణ శరవేగంగా పూర్తవుతోంది. ఆ తర్వాత కూడా అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందించనున్న చిత్రాలలో ప్రియాంక చోప్రా నటిస్తోంది. తదుపరి హృతిక్ రోషన్ సరసన క్రిష్ 4 లో నటించాల్సి ఉంది. ఈ సినిమా బడ్జెట్ 500 కోట్లు అని ప్రచారం ఉంది. కానీ భాగస్వామ్య నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిలింస్ తో సమస్యల కారణంగా ఈ ప్రాజెక్ట్ ఆలస్యమయ్యేందుకు ఛాన్సుందని కథనాలొస్తున్నాయి. అలాగే ఫర్హాన్ అక్తర్ తో జీలే జరా లాంటి భారీ మల్టీస్టారర్ లోను ప్రియాంక చోప్రా నటించాల్సి ఉంది. ఈ సినిమా బడ్జెట్ 200 కోట్లు అని ప్రచారం ఉంది. పై నాలుగు సినిమాలు కలుపుకుంటే సుమారు 5000 కోట్ల బడ్జెట్ అంచనా. ప్రియాంక చోప్రా ప్రస్తుతం గ్లోబల్ ఐకాన్‌గా ఎదుగుతూ, భారతీయ సినిమా చరిత్రలోనే ఏ నటికీ సాధ్యం కాని రీతిలో భారీ బడ్జెట్ ప్రాజెక్టులతో దూసుకెళుతోంది. వారణాసిలో ప్రియాంక 'మందాకిని' అనే పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇందులో రామాయణం స్ఫూర్తితో తెరకెక్కిస్తున్న 25 నిమిషాల యుద్ధ సన్నివేశం సినిమాకే హైలైట్ అని తెలుస్తోంది. రాజమౌళి ఆ ఒక్క సీన్ కోసమే వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని సమాచారం. మరోవైపు ప్రియాంక చోప్రా నటించిన సిటాడెల్ అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమ్ అయింది. ఈ సిరీస్ 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్' తర్వాత ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన సిరీస్‌లలో ఒకటిగా నిలిచింది. ఒక ఎపిసోడ్ కే ఏకంగా 500కోట్లు ఖర్చు చేసారు. భారతీయ నటీమణులలో మరెవరికీ సాధ్యం కానిది ప్రియాంక చోప్రాకు సాధ్యమైంది. ఐశ్వర్యరాయ్, దీపికా పదుకొనే వంటి స్టార్లకు హాలీవుడ్ అవకాశాలు వచ్చినా ప్రియాంక లాగా అక్కడ ఒక లీడ్ యాక్టర్ గా నిలబడి.. ఇంతటి భారీ బడ్జెట్ చిత్రాలను మోయగలిగే స్థాయికి వెళ్లడం విశేషం. ప్రియాంక చోప్రా కేవలం ఒక నటిగానే కాకుండా, గ్లోబల్ మార్కెట్‌లో ఒక బ్రాండ్‌గా మారారు. భారతీయ సినిమా, హాలీవుడ్ సినిమాల మధ్య ఒక బలమైన వారధిగా నిలబడుతూ తనవంతు సహకారం అందిస్తున్నారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-